www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శనివారం 3 మే 2025
సంపుటి :06 సంచిక : 333 , పేజీలు : 12 వెల:రూ.5/-
తెలుగు దినపత్రిక
TELANGANA, ANDHRA PRADESH


2 లో..

**శ్రీ మైసమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్**

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కాంగ్రెస్ నేతల భేటీ

- బిసి బిల్లు ఆమోదించినందుకు పొన్నం తదితరలు కృతజ్ఞతలు



**హైదరాబాద్,మే2( వెలుతురు):** కాంగ్రెస్ బీసీ నేతలు శుక్రవారం ఉదయం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి కృతజ్ఞతలు తెలియచేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, కేకే, మధుయాష్కీ నేతృత్వంలో గవర్నర్‌ను కలిశారు. బీసీలకు రాజకీయ, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఉభయ సభల్లో చేసిన బిల్లుకు 2 లో..



## వడగాలులపై హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్

- వడదెబ్బ మరణాలకు ఎక్స్ గ్రేషియో రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు పెంపు
- అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్ల సరఫరా
- హీట్ వేవ్‌పై 12 విభాగాలతో సమీక్షించిన రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ వెలుతురు మే 02:** రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు, వడగాలుల నుంచి ప్రజలను రక్షించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆమేరకు సంబంధిత శాఖలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది -2025లో ఎండలు , వడగాలులు అధికంగా వీచే అవకాశం ఉందని, జూన్ వరకు కూడా అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని , ఐఎండి హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై 12 సంబంధిత శాఖలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ, ఇండియన్ 2 లో..

## దేశ వ్యాప్తంగా బలహీన వర్గాల సంక్షేమానికి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- తెలంగాణ లో తీసుకున్న కులగణన రోల్ మోడల్
- దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం 2025 జనగణన లో కులగణన చేస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నాం
- గవర్నర్ గారిని కలిసి ధన్యవాదాలు తెలిపిన తెలంగాణ కాంగ్రెస్ బీసీ నాయకులం
- మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ వెలుతురు మే 02:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్ గా బీసీ లకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టం చేసింది చట్టం కన్నా ముందు ఎంపెరికల్ డేటా ప్రామాణికమైన సమాచారాన్ని సేకరించి సబ్ కమిటీ వేసి కేబినెట్ అప్రూవల్ తీసుకొని 2 లో..

## హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు

- 8న ప్రారంభించనున్న సిఎం రేవంత్


2 లో..

## దోస్త్ నోటిఫికేషన్ విడుదల

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



2 లో..

## నత్తనడకన ఉప్పల్ ఫ్లై ఓవర్

- భూసేకరణలో ఆలస్యంతో పనుల్లో జాప్యం
- అధికారులను మందలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,మే2( వెలుతురు):** ఉప్పల్ నుంచి ఘట్ కేసర్ వైపు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ పక్రియలో ఎదురవుతున్న సమస్యలపై కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. ప్రజల ప్రయాణ సౌలభ్యం కోసం ప్రాధాన్యతతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉప్పల్-ఘట్ కేసర్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూమి సేకరణలో ఆలస్యం పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సీరియస్ అయ్యారు. లక్షలాది ప్రయాణికుల రాకపోకలకు ఉపయోగపడే ఉప్పల్ నుంచి ఘట్ 2 లో..











## చిరకాల స్వప్నం అమరావతి సాకారం కాబోతోంది

- స్వర్ణాంధ్ర నిర్మాణానికి అమరావతి ఎంతో కీలకం
- అమరావతి అంటే ఒకనగరం కాదు...ఒక శక్తి
- 60వేలకోట్ల పనులకు శంకుస్థపానలు
- ఇవన్నీ ఎపి ప్రగతికి..వికసిత్ భారత్‌కు పునాదులు
- అన్ని రంగాల్లో అమరావతి అద్భుత నరగంగా ఆవిర్భవిస్తుంది
- చంద్రబాబు విజనరీ నేత..ఉమ్మడి ఎపిలో ఐటికి పెద్దపీట
- అమరావతికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ
- అమరావతి పునర్నిర్మాణ సభలో మోడీ ప్రసంగం

**అమరావతి,మే2( వెలుతురు):** ఏపీ ప్రజల చిరకాల స్వప్నం అమరావతి సాకారం కాబోతుందని ప్రధాని మోడీ అన్నారు. అమరావతి ఒక పుణ్య భూమి అని.. నేను ఈ పుణ్యభూమిపై నిలబడి మీ అందరితో మాట్లాడటం ఆనందంగా ఉందన్నారు. అమరావతి అంటే సాంప్రదాయం, పురోగతి అని.. స్వర్ణాంధ్ర నిర్మాణానికి అమరావతి ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. అమరావతి అంటే కేవలం ఒక నగరమే కాదని.. ఒక శక్తి అని అభివర్ణించారు. అమరావతి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్న ప్రధాని.. రాష్ట్రంలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుందని వ్యాఖ్యానించారు. అమరావతి పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. తన ప్రసంగాన్ని తెలుగులో మొదలు పెట్టిన ఆయన.. దుర్గాభవానీ కొలువైన ఈ పుణ్య భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉందని అన్నారు. తన ప్రసంగం మధ్యమధ్యలో తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు. ఇవాళ దాదాపు రూ.60 వేల కోట్ల పనులకు శంఖుస్థాపనలు చేశా.. అయితే ఇవి కేవలం శంఖుస్థాపనలే కాదు.. ఏపీ ప్రగతికి, వికసిత్ భారత్‌కు బలమైన పునాదులని పేర్కొన్నారు. శుక్రవారం వెలగపూడిలో అమరావతి పునర్నిర్మాణ పనులను మోడీ 2 లో..

## చరిత్రలో లిఖించదగ్గ పునర్నిర్మాణ రోజు

- గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది
- అధికారం చేపట్టాక..అంధకారం నుంచి పట్టాలకెక్కిస్తున్నాం
- డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఇక అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా
- రైతుల త్యాగాలు..వారి ఉద్యమాలు చారిత్రాత్మకం
- మోడీ డైనమిక్ లీడర్‌షిప్‌తో ఐదోస్థానానికి దేశ ఆర్థిక వ్యవస్థ
- అమరావతి పునర్నిర్మాణ సభలో సిఎం చంద్రబాబు



**అమరావతి,మే2( వెలుతురు):** అమరావతి రాజధాని పున:ప్రారంభోత్సవం జరిగిన రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత ఐదు సంవత్సరాలు రాజధాని పనులు 2 లో..

## భూములిచ్చిన రైతలు త్యాగాలు మరువలేనివి

- లాఠీదెబ్బలు..కేసులను ఎదుర్కొని నిలిచారు
- మీరిచ్చింది భూమి కాదు...రాష్ట్రానికి భవిష్యత్
- వారి కష్టనష్టాలను గుర్తు పెట్టుకుని అమరావతి నిర్మాణం
- గుండెల్లో బాధ పెట్టుకుని వచ్చిన ప్రధాని మోడీకి కృతజ్ఞతలు
- అమరావతి పునర్నిర్మాణ సభలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**అమరావతి,మే2( వెలుతురు):** రాజధాని నిర్మాణానికి 34000 ఎకరాలు ఇచ్చిన 29 వేల పైచిలుకు రైతులుకు డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ నమస్కారాలు తెలిపారు. అమరావతి రైతులు ఐదు సంవత్సరాలుగా 2 లో..

## కాంగ్రెస్ అగ్రనేతలకు కోర్టు శ్రీముఖం


- సోనియా రాహుల్‌లకు ఢిల్లీ కోర్టు నోటీసులు
- నేషనల్ హెరాల్డ్ కేసులో నోటీసులు జారీ

9 లో..

## కేరళలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

- డీప్ వాటర్ సీపోర్టును ప్రారంభించిన ప్రధాని
- మోడీకి స్వాగతం పలికిన కాంగ్రెస్ నేత శశిథరూర్
- థరూర్‌ను చూసి కొందరికి నిద్ర పట్టదంటూ మోడీ చురకలు

**తిరువనంతపురం,మే2( వెలుతురు):** కాంగ్రెస్ నేత శశిథరూర్ కేరళలో ప్రధాని మోడీ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనిపై మోడీ సెటైర్లు వేసారు. ఇది చూసి కొందరికి నిద్రపట్టదని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం కేరళలో పర్యటించారు. తిరువనంతపురం సమీపంలో రూ.8,900 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన విఝింజమ్ ఇంటర్నేషనల్ 9 లో..




## మన నమో మిస్సైల్‌తో పాక్ మటాష్

- వంద పాకిస్థాన్‌లు వచ్చినా ఏమీ చేయలేవు
- అమరావతి సభలో లోకేశ్ ఉద్వేగపూరిత ప్రసంగం

**అమరావతి,మే2( వెలుతురు) :** ఏపీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. పదేళ్ల క్రితం 2015 అక్టోబరు 22న అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన 9 లో..



(మొదటి పేజీ తరువాయి..)

## శ్రీ మైసమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**జైనథ్ మండలం వెలుతురు మే 02:**

జైనథ్ మండలం కరంజి గ్రామంలో నిర్వహించిన శ్రీ మైసమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ మైసమ్మ దయతో అందరూ సుఖసంతోషాలతో, పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం సభ్యులు, బీజేపీ నాయకులున్నారు.

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కాంగ్రెస్ నేతల భేటీ

గవర్నర్ ఆమోదం పొంది రాష్ట్రపతికి పంపినందుకు కాంగ్రెస్ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా గవర్నర్‌ను కలిసిన వారిలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, మేయర్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు. స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మార్చి 18 శాసనసభలో ప్రవేశపెట్టిన రెండు బిల్లులు ఆమోదం పొందాయి. ఆ మరుసటి రోజు మంగళవారం వాటిని శాసన మండలిలో ప్రవేశపెట్టి ఆమోదంపొందిన అనంతరం వాటిని ప్రభుత్వం గవర్నర్‌కు పంపారు. ఆయన వాటిని పరిశీలించి.. రాష్ట్రపతికి పంపారు. తెలంగాణ 'తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ (విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు) బిల్లు-2025', 'తెలంగాణ బీసీ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల బిల్లు-2025'ను మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు ఉన్న రిజర్వేషన్లు 29 శాతం. వాటిని 42 శాతానికి పెంచుతూ ఆమోదించిన బిల్లు చట్ట రూపం దాల్చాలంటే.. పార్లమెంటు-లో 2/3 మెజారిటీతో వాటికి ఆమోదం పొందాల్సి ఉంది. ఇందుకు కారణం.. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులే. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలందరికీ అమలు చేసే రిజర్వేషన్లన్నీ కలిపి 50 శాతాన్ని మించకూడదని గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ఒకవేళ.. రిజర్వేషన్లను పెంచితే వాటిని రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చాల్సి ఉంటుంది. అందుకే.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 31 (సి) ప్రకారం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతున్నట్లు- బిల్లుల్లో పేర్కొంది. న్యాయ సలహా తీసుకుని రాష్ట్రపతి వాటిపై ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అవి చట్టపరంగా నిలబడాలంటే మాత్రం.. బిల్లులను పార్లమెంటు- ఉభయ సభలు ఆమోదించాలి. అప్పుడు మాత్రమే అవి రాజ్యాంగంలోని షెడ్యూల్-9లో చేరి, వాటికి రాజ్యాంగ రక్షణ లభిస్తుంది.

## దేశ వ్యాప్తంగా బలహీన వర్గాల సంక్షేమానికి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

శాసనసభ ఆమోదించుకొని చట్టాన్ని ప్రభుత్వానికి అనుమతి కొరకు కేంద్రానికి పంపే సందర్భంలో గవర్నర్ న్యాయ పరమైన అంశాలను పరిశీలించి రాష్ట్రపతికి పంపడం జరిగింది అందుకు తెలంగాణ కాంగ్రెస్ బీసీ నాయకులం గవర్నర్ గారికి కలిసి ధన్యవాదాలు తెలపడం జరిగింది తెలంగాణ లో తీసుకున్న కుల గణన రోల్ మోడల్ దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం 2025 జన గణన లో కుల గణన చేస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నాం దీనిపై విమర్శిస్తున్నారు ఆత్మవిమర్శ చేసుకోవాలని గతంలో వ్యతిరేకించిన వారు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వ ఆలోచనను కేంద్రం మార్గదర్శకత్వం గా తీసుకుంటూ జీర్ణించుకోలేక విమర్శిస్తున్నారు.. దేశ వ్యాప్తంగా బలహీన వర్గాల సంక్షేమానికి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం గవర్నర్ గారికి ధన్యవాదాలు తెలుపుతున్నాం.. దేశ వ్యాప్తంగా కుల గణన చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం చేసిన కుల గణన ఆధారంగా బీసీ లకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చేసిన చట్టాన్ని అమలు చేయడానికి ఆమోదించాలి.. కేంద్ర ప్రభుత్వం బీసీ ల చిత్తశుద్ధి నిరూపించుకోవాలి..

## హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు

**హైదరాబాద్,మే2( వెలుతురు):**

హైదరాబాద్ నగరంలో భారీ స్పందన పొందిన హైడ్రా ఇప్పుడు ఇతర జిల్లాలకు కూడా విస్తరించేందుకు సన్నద్ధమవుతోంది. అక్రమ నిర్మాణాల కూల్చివేత, చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న ఈ ప్రత్యేక విభాగానికి ఇటీవల ప్రభుత్వం మరిన్ని అధికారాలు అప్పగించింది. ఈ నేపథ్యంలో, హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించినట్లుగా, త్వరలో ప్రత్యేక హైడ్రా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అనుగుణంగా 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా పోలీస్ స్టేషన్లను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఇకపై చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములపై జరిగే అక్రమ ఆక్రమణలపై స్థానికులు లేదా అధికారులు ఫిర్యాదు చేస్తే, హైడ్రా పోలీస్ స్టేషన్లలోనే కేసులు నమోదు అవుతాయి. ఇప్పటివరకు సాధారణ పోలీస్ స్టేషన్లలో నమోదైన భూకబ్జా కేసులపై హైడ్రా దాడులు జరుపుతూ వస్తోంది. అయితే త్వరలోనే ఈ కేసులు సాధారణ స్టేషన్ల నుంచి హైడ్రా స్టేషన్లకు బదిలీ అయ్యే అవకాశం ఉంది.

## దోస్త్ నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్,మే2( వెలుతురు):**

తెలంగాణలో డిగ్రీ ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి 'దోస్త్' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మూడు విడతల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించారు. మొదటి దశలో మే 3 నుంచి 21 వరకు మొదటి ఫేజ్ దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. మే 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మే 29న మొదటి ఫేజ్ సీట్ల కేటాయింపు చేస్తారు. రెండోదశలో మే 30 నుంచి జూన్ 8 వరకు దరఖాస్తుల స్వీకరణ చేపడతారు. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు. జూన్ 13న సీట్ల కేటాయింపు ఉంటుంది. మూడోదశలో జూన్ 13 నుంచి 19 వరకు దరఖాస్తుల స్వీకరణ. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు, జూన్ 23న సీట్ల కేటాయింపు పూర్తి చేస్తారు. జూన్ 30 నుంచి డిగ్రీ కళాశాలల్లో తరగతులు ప్రారంభం అవుతాయి.

## నత్తనడకన ఉప్పల్ ఫ్లై ఓవర్




కేసీఆర్ వైపు నిర్మిస్తున్న పైవంతెన కోసం భూమి సేకరణ ప్రక్రియలో జాప్యం అవుతున్న విషయాన్ని కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ప్రాజెక్టు వేగవంతంగా పూర్తయ్యేలా వెంటనే భూమి సేకరణ పూర్తిచేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుమారు రూ. 400 కోట్ల వ్యయంతో నిర్మితమైన అంబర్‌పేట ++ఎలివేటెడ్ ఫ్లైఓవర్‌ను మే 5న కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వంతెన కింద రోడ్డుపై ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు- చేయాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశించారు. కాగా.. మరోవైపు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిలో మొదట ప్రతిబింబించేది హైదరాబాద్ అని.. అభివృద్ధి అంటే కేవలం హై-టెక్ సిటీ- కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఓల్డ్ సిటీ-, గోలిగూడ, అంబర్‌పేట్, సనత్ నగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలూ కీలకమని తెలిపారు. నిధుల కొరత లేకుండా చూసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రింకింగ్ వాటర్, డ్రైనేజ్ వంటి సమస్యలు బస్తీల్లో రొటీన్ అయ్యాయన్నారు.నగరంలో అవసరమైన ప్రతిచోటా స్ట్రీట్ లైట్స్, రీస్టోరేషన్ తక్షణ చర్యలు అవసరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైటెక్ సిటీతో పాటు ఓల్డ్ సిటీ అభివృద్ధిపై సమాన దృష్టితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మెట్రో రైలు ప్రాజెక్టుల్లో అఫ్జల్‌గంజ్ వరకే పరిమితమైన ఫస్ట్ ఫేజ్‌ను విస్తరించాలన్నారు. సెకండ్, థర్డ్, ఫోర్త్ ఫేజ్‌ల కోసం ప్రతిపాదనలు వెంటనే కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం పంపించాలన్నారు.

# వడగాలులపై హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్

మెట్రాలాజికల్ శాఖ కలిసి సమగ్ర తెలంగాణ స్టేట్ హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్ (HAP)-2025 ను రూపొందించాయని ఇందులో భాగంగా . ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించారని తెలిపారు. ఈ సందర్భంగా హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ -2025ను మంత్రిగారు విడుదల చేశారు. సమావేశంలో మంత్రిగారు మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల దృష్ట్యా చలివేంద్రాలలో త్రాగునీరుతోపాటు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్ల సరఫరా చేయాలని, సి ఎస్ ఆర్ కింద వివిధ కంపెనీలు వీటిని సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం,మహబూబ్‌నగర్, నిజామాబాద్, కొత్తగూడెం, మెదక్, కరీంనగర్ తదితర పట్టణ ప్రాంతాల్లో ప్రధానంగా దృష్టిసారించాలని సూచించారుద. తెలంగాణలో 612 మండలాల్లో 588 మండలాలను వడగాలుల ప్రభావిత ప్రాంతాలుగా వర్గీకరించామని తెలంగాణ రాష్ట్రం గతనెల 15న హీట్‌వేవ్‌ను స్టేట్ స్పెసిఫిక్ డిజాస్టర్‌గా నోటిఫై చేశామని తెలిపారు. మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియోను రూ. 50 వేల నుంచి నాలుగు లక్షలకు పెంచినట్లు తెలిపారు. వడగాలుల ప్రభావం సామాన్యప్రజలపై పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అయినా కూడా అనుకోని పరిస్థితులలో ఎవరైనా చనిపోతే మానవతా దృక్పథంతో వ్యవహరించి తక్షణం ఎక్స్ గ్రేషియో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలకు సంబంధించిన సమాచారం, అధిక ఉష్ణోగ్రతల వేళ ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, కూల్ వార్డుల ఏర్పాటు, ఆసుపత్రులలో ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహణ వంటి అంశాలపై చర్యలు చేపట్టాలని ప్రజా ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులలో ఓఆర్ఎస్ ప్యాకట్లను అందుబాటులో ఉంచాలని , ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖను మంత్రి గారు ఆదేశించారు. అదేవిధంగా వేడి ప్రదేశాలలో పనిచేసే కార్మికులను రెండు బృందాలుగా విభజించి కనీసం గంట లేదా రెండు గంటల విశ్రాంతి ఇచ్చేలా రొటేషన్ పద్ధతి అవలంభించేలా పరిశ్రమలకు సూచించాలని పరిశ్రమలు, వాణిజ్య శాఖకు సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణా కార్మికులకు అవసరమైన విశ్రాంతి, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ సదుపాయం వంటి వైద్య సౌకర్యాల అందుబాటు వంటి విషయాలలో దృష్టిసారించాలని కార్మిక సంక్షేమ శాఖకు సూచించారు. బస్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాలు, ప్రార్థనా స్థలాల వంటి పబ్లిక్ ప్రాంతాలలో అవసరమైన షెల్టర్లు, త్రాగునీరు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పబ్లిక్ అడ్రస్ సిస్టమ్,ఎల్ ఇ డి స్క్రీన్ల ద్వారా ప్రచారం కల్పించాలని స్థానిక సంస్థలు, మున్సిపాల్టీలు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పార్కుల వద్ద పక్షులు, వీధి జంతువుల కోసం నీటి సరఫరాను సమకూర్చాలని చెప్పారు. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి. పంచాయితీరాజ్ శాఖల తరపున ప్రజలకు క్లోరినేట్ చేసిన త్రాగునీటిని సరఫరా చేయాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. అదేవిధంగా సమాచార శాఖ, మత్స్య, పశు సంవర్ధక శాఖ, రక్షిత మంచినీటి సరఫరా, అటవీ, విద్యుత్ శాఖల అధికారులకు మార్గదర్శనం చేశారు.ఈ సమావేశంలో విపత్తుల నిర్వహణాశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, ప్రణాళికా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఫైర్ సేఫ్టీ డీజీ నాగిరెడ్డి, ఐ& పిఆర్ కమీషనర్ వినయ్‌కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ ,గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ ,మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి శ్రీదేవి, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ సృజన,తెలంగాణ ఐఎండి విభాగాధిపతి డాక్టర్ నాగరత్న,జిహెచ్ ఎం సీ కమీషనర్ ఆర్ వి కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# చిరకాల స్వప్నం అమరావతి సాకారం కాబోతోంది

ప్రారంభించారు. మొత్తం 18 ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. మోడీ చేతుల మీదుగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభంఅయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మోడీ మాట్లాడుతూ.. ఏఐ, ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్ ఇలా అన్ని రంగాల్లో అమరావతి కీలకంగా మారబోతుందని అన్నారు. అమరావతి ప్రతి వ్యక్తి కలల నిర్మాణమని.. త్వరలోనే వారి స్వప్నం సాకారం కాబోతుందని చెప్పారు. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు ఐటీ విజన్ అద్భుతమని.. ఆయన ఐటీ విజన్ ను నేను అప్పుడు గుజరాత్ సీఎంగా ఉండి పరిశీలించానని తెలిపారు. నాణ్యమైన ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలంటే చంద్రబాబు తర్వాతే ఎవరైనా అని ప్రశంసించారు. 2015లో అమరావతి నిర్మాణానికి నేనే శంఖుస్థాపన చేశా.. పదేండ్లు ఏపీ అభివృద్ధి కోసం సహకరించామని పేర్కొన్నారు. ఏపీని వికసిత్ భారత్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తయారు చేయాలని కోరారు. ఏపీలో కనెక్టివిటీ-కి కొత్త అధ్యాయం మొదలైందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌కు ఇది శుభ సంకేతమని చెప్పారు. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలని ప్రధాని ఆకాంక్షించారు. టెక్నాలజీ నాతో మొదలైనట్లు- చంద్రబాబు ప్రశంసించారు. నేను గుజరాత్ సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీని ఎలా అభివృద్ధి చేశారో తెలుసుకున్నా. అధికారుల్ని పంపించి హైదరాబాద్ ఐటీ- అభివృద్ధిని అధ్యయనం చేయించా. పెద్ద ప్రాజెక్టులు చేపట్టాలన్నా.. త్వరగా పూర్తి చేయాలన్నా చంద్రబాబుకే సాధ్యం. పెద్ద పెద్ద పనుల్ని చేపట్టి పూర్తి చేయడంలో చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు. 2015లో ప్రజా రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేశా. గత పదేళ్లలో అమరావతికి కేంద్రం మద్దతుగా నిలిచింది. అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించింది. ఇప్పుడూ అమరావతి అభివృద్ధికి కేంద్రం సహకారం కొనసాగుతుంది. అమరావతిలో అన్ని రకాల నిర్మాణాలకు కేంద్రం తోడ్పాటు- అందిస్తుందని అన్నారు.ఎన్టీఆర్.. వికసిత ఏపీ కోసం కలలుగన్నారు. మనందరం కలిసి ఆయన కలల్ని నిజం చేయాలి. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి. పవన్ కల్యాణ్ గారూ ఇది మనం చేయాలి. మనమే చేయాలి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచింది. ఏపీలో రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం రూ.వేల కోట్లు సాయం చేస్తోంది. ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నప్పుడు నాకు కనబడుతున్నది ఒక్క నగరం మాత్రమే కాదు.. ఒక స్వప్నం సాకారాం కాబోతోందనే భావన కలుగుతోంది. దాదాపు రూ.60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశా. ఇవి కేవలం కాంక్రీటు నిర్మాణాలు కాదు.. ఏపీ ప్రగతి, ఆశలు, వికసిత్ భారత్ ఆశయాలకు బలమైన పునాదులు. వీరభద్ర స్వామి, అమరలింగేశ్వరస్వామి, తిరుపతి వెంకటేశ్వరస్వామికి పాదాలకు నమస్కరిస్తూ ఏపీ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. చంద్రబాబు, పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. ఇంద్రలోకం రాజధాని అమరావతి. ఇప్పుడు ఏపీ రాజధాని పేరు కూడా అమరావతే. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. ఏపీని ఆధునిక ప్రదేశ్, అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతి. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి. యువత కలలు సాకారమయ్యే రాజధానిగా ఈ నగరం ఎదుగుతుంది. ఐటీ-, ఏఐ సహా అన్ని రంగాలకూ అమరావతి గమ్య స్థానంగా మారుతుంది. హరితశక్తి, స్వచ్ఛ పరిశ్రమలు, విద్య, వైద్య కేంద్రంగా అమరావతి మారుతుంది. అమరావతిలో మౌలికవసతుల కల్పనకు కేంద్ర సహకరిస్తుందని చెప్పారు. ఏపీలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుంది. రైల్వే ప్రాజెక్టులతో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, మరో రాష్ట్రానికి అనుసంధానం పెరుగుతుంది. ఈ అనుసంధానం తీర్థయాత్రలకు పర్యాటకాభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలకు రైల్వే బడ్జెట్ రూ.900 కోట్ల లోపే ఉండేది. ఇప్పుడు కేవలం ఏపీకే రూ.9వేల కోట్ల రైల్వే నిధులు ఇచ్చాం. ఏపీకి గతం కంటే పది రెట్లు- అధికంగా నిధులు కేటాయించాం. గత పదేళ్లలో ఏపీలో 750 రైల్వే బ్రిడ్జులు, అండర్‌పాస్‌లు నిర్మించాం. వందేభారత్, అమృత్ భారత్ రైళ్లు కేటాయించాం. ఏపీలో 70కి పైగా రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్నాం. మౌలిక వసతుల కల్పనతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. సిమెంట్, స్టీల్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రాజెక్టుల వల్ల వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రైతు వికాసానికి కేంద్రం ప్రత్యేకంగా కృషిచేస్తోంది. రైతులకు పథకాలు, పరిహారం కింద రూ.17వేల కోట్లు- సాయం చేశాం. పోలవరం త్వరగా పూర్తి చేసేందుకు కలిసి పనిచేస్తాం. ప్రతి ఎకరానికీ నీరు ఇచ్చేందుకు కృషిచేస్తాం. వికసిత్ భారత్ నిర్మాణం కావాలంటే మహిళలు, కార్మికులు అభివృద్ధి చెందాలి.

ఈ నాలుగు వర్గాలు నాలుగు స్తంభాలు లాంటివారు. రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. నాగాయలంకలో టెస్టింగ్ రేంజ్.. దుర్గామాత లాగా భారత రక్షణ రంగానికి శక్తినిస్తుంది. శ్రీహరికోట నుంచి ప్రయోగించే ప్రతి రాకెట్ కోట్లాది భారతీయులకు గర్వకారణం. భారత శక్తి అంటే కేవలం మన ఆయుధాలే కాదు.. మన ఐక్యత కూడా. విశాఖలో యునిటీ-మాల్ అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. విశాఖలో జూన్ 21న జరగనున్న యోగా డేలో పాల్గొంటాను. నన్ను ఆహ్వానించినందుకు ప్రభుత్వానికి థ్యాంక్స్. మన యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. వచ్చే 50 రోజులూ ఏపీలో యోగాకు అనుకూల వాతావరణం కల్పించాలి. ఏపీలో కలలు కనేవాళ్ల సంఖ్య తక్కువేం కాదు.. ఆ కలల్ని నిజం చేసేవారి సంఖ్యా తక్కువకాదు. ఏపీ సరైన మార్గంలో నడుస్తోంది. సరైన వేగంతో ముందుకెళ్తోంది. దీన్ని కొనసాగించాలి. మూడేళ్లలో అమరావతి పనుల్ని పూర్తి చేస్తామని సీఎం అన్నారు. ఆ పనులు పూర్తయ్యాక ఏపీ జీడీపీ ఏ స్థాయికి వెళ్తుందో నేను ఊహించగలను. అది ఏపీ రాష్ట్రం చరిత్ర గతిని మార్చబోతోంది. ఏపీ అభివృద్ధిలో మీ భుజంతో కలిపి నా భుజం కలిపి పనిచేస్తాను. అందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు అని ప్రధాని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదికపై కేంద్రమంత్రులు వర్మ, చంద్రశేఖర్, రామ్మోమన్ నాయుడు, గవర్నర్ నజీబ్, సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్,మంత్రులు లోకేశ్, కేశవ్,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రలో లిఖించదగ్గ పునర్నిర్మాణ రోజు

ఆగిపోయాయని, విధ్వంసం జరిగిందని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని పున:ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ' ఈ రోజు చాలా గొప్ప రోజు. చరిత్రలో శాశ్వతంగా లిఖించదగ్గ రోజు. ఆ రోజు అమరావతి పనులకు ప్రధాని మోదీ గారు శంకుస్థాపన చేశారు. ఐదు సంవత్సరాలు విధ్వంసం జరిగింది. పనులు నిలిచిపోయాయి. మళ్లీ ప్రధాని మోదీ గారే పున:ప్రారంభం చేస్తున్నారంటే.. దీనికంటే మంచి రోజు చరిత్రలో ఇంకోటి లేదని అన్నారు. ఉగ్రవాదం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. ' ముందుగా మీ అందరికీ ఓ విషయం చెప్పాలి. గతంలో మోదీ గారిని ఎప్పుడు కలిసినా.. చాలా ఆహ్లాదకరంగా ఉండేవారు. కానీ, మొన్న అమరావతి కార్యక్రమానికి పిలవడానికి వెళ్లాను. ఆ మీటింగ్ చాలా గంభీరంగా సాగింది. దీనికి కారణం.. ' నా దేశ ప్రజలు ఉగ్రవాదుల దాడిలో చనిపోయారు' అన్న ఆవేదన మోదీ గారిలో చూశాను. ఈ సందర్భంగా మీ అందరి తరపునా ఆయనకు నేనో విజ్ఞప్తి చేస్తున్నాను. ఉగ్రవాదాన్ని అణిచివేయడానికి మోదీ, కేంద్రం తీసుకునే నిర్ణయాలకు మేము అండగా ఉంటాం' స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ నాయకత్వం గురించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ' రైట్ -టైం .. రైట్ లీడర్ ఫర్ ది నేషన్.. దట్ ఈజ్.. నరేంద్ర మోదీజీ. చాలా దృఢమైన నాయకుడు.. బ్యాలెన్స్ కలిగిన నాయకుడు. ప్రపంచం నలుమూలలా ఉన్న ప్రజలందరూ మోదీ నాయకత్వాన్ని మెచ్చుకుంటున్నారు. నరేంద్ర మోదీ తన 11 ఏళ్ల పాలనలో ప్రపంచ ఎకానమిలో దేశాన్ని 10 స్థానం నుంచి 5వ స్థానానికి తీసుకువచ్చారు. ఈ సంవత్సరం జపాన్‌ను వెనక్కు నెట్టి 4వ స్థానంలోకి రాబోతోందని అన్నారు. ఈ సందర్భంగా వందేమాతరం అంటూ ప్రజలను ఉత్తేజితులను చేయగా మోదీ కూడా వంత కలిపారు. వందేమాతరం.. భారత్ మాతాకీ జై అంటూ చంద్రబాబు నినాదాలు చేశారు. ప్రజలతోనూ సీఎం నినాదాలు చేయించారు. ఏపీ కలల రాజధాని అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదు.. ఐదు కోట్ల మంది ప్రజల సెంటిమెంట్ అని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, ఆశలు, ఆకాంక్షలకు ఈ నగరమే ప్రతిరూపమన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా 29 వేల మంది రైతులు ఏకంగా 34వేల ఎకరాల భూమిని రాజధానికి పూలింగ్ కింద ఇచ్చారంటే.. దేశానికే కాదు.. ప్రపంచానికే ఇదో చరిత్ర అన్నారు. అలాంటి అమరావతి నగర నిర్మాణం తలపెడితే.. గత ఐదేళ్లలో ఎలాంటి విధ్వంసం జరిగిందో చూశామన్నారు.సరైన సమయంలో.. సరైన నేత దేశాన్ని పాలిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మోదీ నాయకత్వాన్ని ఆమోదిస్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ పదో స్థానంలో ఉండేది. ప్రస్తుతం ఐదో స్థానానికి ఎదిగింది. త్వరలోనే మూడో స్థానానికి చేరుతుంది. 2047 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుంది. ఒకవైపు అభివృద్ధి మరోవైపు పేదరిక నిర్మూలనకు మోదీ కృషి చేస్తున్నారు. కులగణన చేయాలని ఇటీవల మోదీ నిర్ణయం తీసుకున్నారు. ఇదో గొప్ప నిర్ణయం అని ప్రశంసించారు. గత ఎన్నికల్లో ప్రజలంతా ఓట్లేసి గెలిపించారు. మోదీపై నమ్మకం, తెదేపా, జనసేన కలిసి పనిచేస్తే రాష్ట్రం మొత్తం తిరగబడింది. 93శాతం హిట్‌రేట్ వచ్చింది. మేం అధికారంలోకి వచ్చేసరికి ఆర్థిక వ్యవస్థ అగమ్య గోచరం. ఏం చేయాలో తెలియని పరిస్థితి. నేను నాలుగోసారి సీఎం.. కానీ, ఎటు- చూసినా అగాథమే.

అలాంటి సమయంలో వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థిక వ్యవస్థకు కేంద్రం, వ్యక్తిగతంగా ప్రధాని మోదీ ఆక్సిజన్ ఇచ్చారు. ఇప్పుడిప్పుడే రికవరీ అవుతున్నాం. వెంటిలేటర్ నుంచి బయటకు వచ్చాం.. ఇంకా కొన్నిరోజుల పాటు- సహకారం వస్తే ఒక బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏపీని రూపకల్పన చేస్తామని హామీ ఇస్తున్నా అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఎపిని అగ్రగామిగా నిలుపుతామని అన్నారు. అమరావతి కోసం రైతులు వీరోచితంగా పోరాడారు. మీ పోరాటం వల్లే అమరావతి పునః ప్రారంభమైంది. ఇది మీ అందరి విజయం. బాధలు, అవమానాలు, లాఠీ దెబ్బలు తిన్నారు, జైళ్లకు వెళ్లారు. అయినా వెనకడుగు వేయలేదు.. హ్యాట్సాఫ్. ఇలాంటి ఉద్యమాన్ని నా చరిత్రలో ఎన్నడూ చూడలేదు. మళ్లీ చూస్తానని కూడా నమ్మకంలేదు. అలాంటి ఉద్యమం చేసిన ఉద్యమకారు లందరికీ సెల్యూట్ చేస్తున్నా. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా ఇచ్చిన ప్రజాతీర్పుతో అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది. పది నెలల్లో సవాళ్లను అధిగమించి కేంద్రం సహకారం, మోదీ ఆశీస్సులతో అమరావతి నిర్మాణాన్ని పట్టాలెక్కించాం. ఐదు కోట్ల మంది ప్రజలు నా రాజధాని అమరావతి అని చెప్పుకొనేలా నిర్మిస్తాం అని సీఎం చంద్రబాబు అన్నారు.

### భూములిచ్చిన రైతలు త్యాగాలు మరువలేనివి

నలిగిపోయారని.. రోడ్ల మీదకు వచ్చి, ముల్లకంచెలపై కూర్చొని, పోలీసులు లాఠీ దెబ్బలు తిని, కేసులు పెట్టించుకున్నారని గుర్తు చేశారు. 2000 రైతుల ప్రాణాలు కోల్పోయాయని చెప్పారు. రైతులు నలిగి బాధపడి, తమ కన్నీళు తుడిచేవారు ఉన్నారా? అని చాలామంది మహిళలు రైతులు ఆ రోజుల్లో తను అడిగిన సన్నివేశాన్ని గుర్తు చేశారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి తెలుస్తుందా? అని రైతులు అడిగినట్లు తెలిపారు. మోడీకి ఏదీ ఉండదని.. అమరావతి శాశ్వత రాజధాని అని మోడీ నమ్మారని ఆరోజు చెప్పినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం మరోసారి మోడీ చేతుల మీదుగా రాజధాని నిర్మాణం పున ప్రారంభం జరుగుతుందన్నారు. 5 కోట్ల మంది ప్రజలకు సంబంధించి ఈ రాజధాని ఒక హబ్ లాంటిదని, ఓ ఇల్లు లాంటిదన్నారు. రైతులు పడ్డ బాధలను గుర్తు చేసిన డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ నాటి రోజులను గుర్తు చేశారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు నా శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేస్తున్నా. గత ఐదేళ్లలో మీరు పడ్డ బాధలు, మీరు తిన్న లాఠీ దెబ్బలు, మీరు అనుభవించిన అవస్థలు అన్ని మా మనసులో ఉన్నాయి. దివ్యాంగులను కూడా లాఠీతో కొట్టడం, నా గుండెల్లో ఇప్పటి వరకు ఇలాగే ఉంది. ఆ బాధను నేను మర్చిపోలేను. దీనికి సజీవ సాక్షి నేడు ఈ అమరావతి రాజధాని పునః ప్రారంభం. ఆరోజు మహిళలు విద్యార్థులు చేసిన పోరాటాల త్యాగానికి జవాబుదారీ తరంగా ఉంటాం. అమరావతి మహిళా రైతుల పాత్ర ప్రత్యేకమైనద డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. అమరావతి రైతులు గత ఐదేళ్లు పోరాడారని.. అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని మాటిచ్చాం.. గత ప్రభుత్వం అమరావతి భవిష్యత్‌ను తుడిచి పెట్టేసింది.. అమరావతి రైతులు ధర్మ యుద్ధంలో గెలిచారు.. అమరావతి ప్రపంచస్థాయి రాజధానికి మారుతుంది.. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రధాని మోదీ అమరావతి పునఃనిర్మాణ సభకు వచ్చారు.. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలో ఉండటంతో వేగంగా అభివృద్ధి జరుగుతుంది.. మ్యాచింగ్ గ్రాంట్లు- కూడా ఇవ్వని కారణంగా గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడింది.. 20 ఏళ్ల ముందే భవిష్యత్‌ను ఊహించి ప్రణాళికతో ముందుకు వెళ్ల గల నేత చంద్రబాబు. అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ దేశమే తన కుటుంబంగా చేసుకుంటూ దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోదీకి రాష్ట్ర ప్రజల తరపున నమస్కారాలు తెలియచేశారు. ప్రస్తుతం దేశంలో కీలక పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఎంతో బిజీ షెడ్యూల్ మధ్య కూడా ప్రధాని అమరావతికి రావడం చాలా సంతోషకరమని పవన్ అన్నారు. కాశ్మీర్ ఉగ్రవాదుల దాడితో నిబ్బరంగా ఉన్న ప్రధాని మోదీకి ఆ కనకదుర్గమ్మ బలాన్ని ప్రసాదించాలని పవన్ కళ్యాణ్ ప్రార్థించారు. దేశంలో ఉగ్రదాడి అనంతరం క్లిష్ట పరిస్థితుల్లో కూడా.. ప్రధాని మోదీ మన కోసం అమరావతికి వచ్చారని పవన్ గుర్తు చేశారు. ఏపీపై మోదీ నిబద్ధతకు ఇదే నిదర్శనమని పవన్ స్పష్టం చేశారు.అమరావతి రైతులు, రాష్ట్ర ప్రజలు ధర్మ యుద్ధంలో విజయం సాధించారని పవన్ చెప్పారు. అమరావతి పనులు పు:న ప్రారంభమవుతున్న శుభసందర్భంలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు పవన్ ధన్యవాదాలు తెలియచేశారు.అమరావతి ప్రపంచస్థాయి రాజధానిగా ఆవిర్భవిస్తుందని పవన్ ఆకాంక్షించారు. రాజధాని రైతులు భూములు మాత్రమే ఇవ్వలేదు.. రాష్ట్రానికి ఒక భవిష్యత్ ఇచ్చారని పవన్ కళ్యాణ్ కొనియాడారు. రాళ్లు, రప్పల్లో మహానగరాన్ని చూసిన వ్యక్తి చంద్రబాబు అని పవన్ చెప్పారు. సైబరాబాద్‌ను చంద్రబాబు ఎలా సృష్టించారో.. అమరావతిని కూడా అలాగే అభివృద్ధి చేస్తారని పవన్ ధీమా వ్యక్తం చేశారు.

# దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి కి పాలాభిషేకం



**ఆదిలాబాద్ వెలుతురు మే 02:**
దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి కి పాలాభిషేకం దేశ భవిష్యత్తు అదృష్ట దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారు దేశ ప్రజల జనగణన మరియు కులగనను చేయాలని నిర్ణయించారు. దీనికి గాను దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ దేశంలో జనగణన ఎంత ముఖ్యమైనదో అలానే కులగనన్నా కూడా అంతే ముఖ్యంగా భావించాలి మరియు ఏ వర్గానికి చెందిన వాళ్ళు తెలిసే విధంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తారని కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలియడం జరిగింది. దేశంలో అన్ని రాష్ట్రాలకు కూడా ఈ కులగణన అనేది ఉపయోగపడే విధంగా ప్రతి వర్గానికి అన్ని విధమైన పథకాలు అందే విధంగా ఈ కులగణన ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ నిర్ణయం దేశంలో ప్రజలకు మంచి జరిగే విధంగా ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం కులగణన విషయాన్ని తీసుకొచ్చింది. దీనికిగాను అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ గోడం నగేష్, దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం, పట్టణ అధ్యక్షులు వేదవ్యాస్, జోగు రవి, రవి రెడ్డి, భూమేష్, రాకేష్, సుభాష్, దయాకర్ బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్లోబల్ మీడియా డైలాగ్ 2025

**వేవ్స్ డిక్లరేషన్‌ను అమలు చేస్తూ, ఏఐ యుగంలో సృజనాత్మకతను ప్రోత్సహిస్తూనే సంప్రదాయాలు, వారసత్వాల వాణిని వినిపించడంలో సహకారానికి అంగీకరించిన సభ్య దేశాలు**



**వెలుతురు ముంబై 02 మే 2025:**
"సృజనాత్మకతను ప్రోత్సహించడంలో ప్రపంచ సహకారాన్ని, అదే సమయంలో పరస్పర సాంస్కృతిక విధానాలను అర్థం చేసుకోవడం మన ముందున్న మార్గం." ప్రస్తుతం ముంబయిలో జరుగుతున్న ప్రపంచ ఆడియో విజువల్, ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్ 2025) లో భాగంగా నిర్వహించిన గ్లోబల్ మీడియా చర్చల తీర్మానాల్లో ఇది ఒకటి. డిజిటల్ అంతరాన్ని తగ్గించే మార్గంలో మనమంతా ముందుకు సాగుతున్న క్రమంలో దేశాల్లో సృజనాత్మకతను విస్తృతం చేయడం మన సమష్టి పురోగతికి కీలకం అని చర్చల్లో పాల్గొన్న దేశాలు అభిప్రాయపడ్డాయి. పెరుగుతున్న ప్రపంచీకరణ మీడియా వాతావరణం మధ్య ప్రపంచ శాంతి, సామరస్యాలను పెంపొందించడంలో ప్రభుత్వాల పాత్రను చర్చించిన అనంతరం సభ్యదేశాలన్నీ వేవ్స్ డిక్లరేషన్‌ను ఆమోదించడంతో ఈ చర్చలు ముగిశాయి.

ప్రపంచవ్యాప్తంగా గల విభిన్న సంస్కృతులను ప్రదర్శించే సినిమాలు ప్రజలను చేరువ చేయగల అపార సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయనే భావన గ్లోబల్ మీడియా చర్చల్లో ప్రతిధ్వనించింది. సభ్య దేశాలు ఈ విషయంలో భారతీయ చిత్రాల పాత్రను ప్రశంసించాయి. కథ చెప్పడం కోసం వినోదాత్మక రూపంగా ఉన్న సినిమాలు పరస్పర సహకారాన్ని పెంపొందించే బలమైన శక్తిగా పనిచేస్తాయి. వినోద ప్రపంచాన్ని పునర్నిర్వచిస్తూ కథ చెప్పే కళను సాంకేతికతతో మేళవించిన వ్యక్తిగత కథలు క్రియేటివ్ ఎకానమీలో బలమైన శక్తిగా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. "బాధ్యతాయుతమైన జర్నలిజం"ని పెంపొందించాల్సిన అవసరముందన్న కొన్ని సభ్య దేశాలు, వేవ్స్ ఫోరమ్‌లో పరస్పర సహకారాల ద్వారా దీనిని పరిష్కరించవచ్చునే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి.

వేవ్స్ 2025 ను ప్రపంచ సమాజపు సూక్ష్మ ప్రపంచంగా అభివర్ణించిన భారత విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, మీడియా-వినోద రంగాల భవిష్యత్తు ప్రణాళికను చర్చించడానికి ఈ సమ్మిట్ కంటెంట్ క్రియేటర్లు, విధాన రూపకర్తలు, నటులు, రచయితలు, నిర్మాతలు, దృశ్య కళాకారులను ఒక ఉమ్మడి వేదికపైకి తీసుకువచ్చిందన్నారు.

తన ప్రసంగంలో డాక్టర్ జైశంకర్ గ్లోబల్ మీడియా డైలాగ్ 2025లో చర్చించే వివిధ అంశాలను గురించి ప్రస్తావించారు. బలమైన సాంస్కృతిక కోణాన్ని కలిగి ఉన్న ప్రపంచ క్రమం నేడు పరివర్తన దశలో ఉందని పేర్కొన్నారు. "మన సంప్రదాయాలు, వారసత్వం, ఆలోచనలు, అభ్యాసాలు, సృజనాత్మకతల గురించి మనం గళం వినిపించాల్సిన అవసరం ఎంతగానో ఉంది" అని ఆయన పిలుపునిచ్చారు.

# కులగణన సర్వేలో రేవంత్ విజయం సాధించారు

- **దీనిని జీర్ణించుకోలేకే కిషన్ రెడ్డి విమర్శలు: జగ్గారెడ్డి**

**హైదరాబాద్,మే2( వెలుతురు):**
కులగణన విషయంలో తెలంగాణ బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. అసెంబ్లీలో జరిగిన చర్చలో బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్ కూడా పాల్గొన్నట్లు- తెలిపారు. క్షేత్ర స్థాయికి సర్వే వెళ్ళిందని.. కిషన్ రెడ్డి ఈ విషయం తెలుసుకోవాలన్నారు. ఇంటింటికి అధికారులు వెళ్లి సర్వే చేశారన్నారు. కుల గణనపై కిషన్ రెడ్డి విమర్శలపై స్పందిస్తూ..దీనిపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కులగణనలో రేవంత్ సక్సెస్ అయ్యాడు కాబట్టి డైవర్ట్ చేసి బురద జల్లే ప్రయత్నం చేయకండన్నారు. 100 శాతం సర్వే సక్సెస్ ఫుల్ గా జరిగిందని.. గవర్నర్ కూడా ఆమోదముద్ర వేశారన్నారు. అంటే సర్వే సరిగా జరిగింది అనే కదా..? అని అన్నారు. సర్వే జరిగిన నెల రోజుకు కిషన్ రెడ్డి తెలంగాణలో లేరని అనుకుంటా అన్నారు. అందుకే ఆయనకు కుల గణన మీద పూర్తిస్థాయిలో అవగాహన లేదని జగ్గారెడ్డి అన్నారు. అసెంబ్లీలో మీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని.. వాళ్ళు కూడా మద్దతు ఇచ్చినట్లు- తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యేల మీద కూడా అనుమానం ఉందా..? అని ప్రశ్నించారు. సర్వేలో పాల్గొనని వాళ్ళ కోసం మళ్ళీ సమయం పొడిగించారు కదా..? అన్నారు. కిషన్ రెడ్డి మాటలు నమ్మకండని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కిషన్ రెడ్డికి సెంట్రల్ పార్టీ మొట్టికాయలు వేసిందని.. అందుకే ఈ మధ్య తరచూ ప్రకటనలు ఇస్తున్నారన్నారు. కేంద్రం నిర్ణయం తీసుకునే సమయంలో ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. రాజకీయ విమర్శలు మానుకోండన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు 600 చదరపు అడుగులకు మించొద్దు

- **ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో 500 ఇండ్లు**
- **ఈనెల 5 నుంచి 20 వతేదీ వరకు 28 మండలాల్లో భూభారతి**
- **నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు**
- **జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**







**హైదరాబాద్ వెలుతురు మే 02:**
ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇండ్లకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. లబ్దిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు ఏరోజుకారోజు ఇన్‌ఛార్జి మంత్రుల నుంచి లబ్దిదారుల జాబితాకు ఆమోదం తీసుకోవాలని అలాగే ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో కనీసం 500 ఇండ్లను కేటాయించి లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం నాడు చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణ రావుతో కలిసి భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ లు, ఎస్.పి లతో మంత్రిగారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగేలా కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అనర్హులని తేలితే ఇండ్ల నిర్మాణం మధ్యలో ఉన్నాకూడా రద్దు చేస్తామన్నారు. లిస్ట్-1, లిస్ట్-2 , లిస్ట్-3 లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు.

5 నుంచి 20వ తేదీవరకు..

గత నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీవరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. పైలట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 31వ తేదీవరకు పరిష్కరించాలని , పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని కలెక్టర్లకు సూచించారు. 605 మండలాలకు గాను ఇప్పటి వరకు 590 మండలాల్లో అవగాహనా సదస్సులను నిర్వహించడం జరిగిందని ఇందులో 85,527 మంది పౌరులు, 1,62, 577 మంది రైతులు పాల్గొన్నారని తెలిపారు.

ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, అసైన్డ్ ల్యాండ్‌లకు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టాఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలని సూచించారు.

నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈనెల 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది రాష్ట్రం నుండి 72,572 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతున్నారని ఇందుకోసం 24 జిల్లాల్లో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరుతోపాటు ఓ ఆర్ ఎస్ ప్యాకట్లు, మెడికల్ కిట్ లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన సూచనలను ముందుగానే ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని సూచించారు.

ఈ సమావేశం లో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, సి.సి. ఎల్. ఎ డైరెక్టర్ మకరంద్, హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి, వి. పి. గౌతమ్ , లా & ఆర్డర్ డిఐజి మహేష్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశ సృజనాధారిత ఆర్థిక వ్యవస్థ- 2030 నాటికి వినియోగదారుల వ్యయంలో 1 ట్రిలియన్ డాలర్లకు పైగా ప్రభావాన్ని చూపుతుందని అంచనా

**వేవ్స్ 2025లో నివేదిక విడుదల చేయనున్న బీసీజీ**

**వెలుతురు పిఐబీ ముంబై 02 మే 2025:**
ముంబయి 2, మే 2025: భారత సృజనాధారిత ఆర్థిక వ్యవస్థ పెరుగుతుండడంతో దేశ డిజిటల్ రంగం కూడా గణనీయమైన మార్పులు చెందుతోంది. "ఫ్రమ్ కంటెంట్ టు కామర్స్ మ్యాపింగ్ ఇండియాస్ క్రియేటర్ ఎకానమీ" అనే పేరుతో బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) ఈ నెల 3వ తేదీన ఒక నివేదికను ముంబయిలోని వేవ్స్ 2025లో విడుదల చేయనున్నది. భారతదేశ క్రియేటర్లు ప్రస్తుతం ఏటా 350 బిలియన్ డాలర్లకు పైగా వినియోగదారులు చేసే ఖర్చుపై ప్రభావం చూపుతున్నారని వెల్లడించింది. ఈ సంఖ్య 2030 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లను అధిగమించే అవకాశం ఉంది. డిజిటల్ సృజనకారుడు అంటే ఒక్కొక్కరికి వెయ్యి మందికి పైగా ఫాలోవర్లు ఉంటారని నిర్ధారిస్తూ, భారతదేశంలో 2 నుంచి 2.5 మిలియన్ల మంది యాక్టివ్ డిజిటల్ సృజనకారులు ఉన్నారని నివేదిక ప్రముఖంగా ప్రస్తావించనున్నది. ప్రమాణాలు ఎలా ఉన్నా, వారిలో 8 నుంచి 10 శాతం మంది మాత్రమే ప్రస్తుతం తమ కంటెంట్ పై సమర్థవంతంగా డబ్బు ఆర్జిస్తున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రంగంలో ఇంకా అన్వేషించని అవకాశాలను అందిపుచ్చుకుంటోందని నివేదిక వెల్లడించనున్నది. డిజిటల్ క్రియేటర్ ప్రత్యక్ష ఆదాయం నేడు 20 నుంచి 25 బిలియన్ డాలర్లని అంచనా వేస్తే, దశాబ్దం చివరి నాటికి అది 100 నుంచి 125 బిలియన్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు.
నివేదికలో కొన్ని కీలకమైన అంశాలు:
సృజనకారులు 30 శాతానికి పైగా వినియోగదారుల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నారు. ఇది 350 నుంచి 400 బిలియన్ డాలర్లు ఉంటుంది.
స్వల్ప కాల వ్యవధి వీడియో కంటెంట్ ఇప్పటికీ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. కామెడీ, సినిమాలు, రోజువారీ ధారావాహికలు, ఫ్యాషన్ వంటి విభాగాల వైపే ఎక్కువగా వినియోగదారులు ఆకర్షితులవుతున్నారు. వేగవంతమైన కంటెంట్ ప్రొడక్షన్, ఎక్కువ సృజనాత్మక స్వేచ్ఛ, వైవిధ్యభరితమైన వినియోగదారుల అవసరాలు, ఫలితాల ఆధారిత లక్ష్యాల వంటి అంశాలలో పెరిగిన ప్రాధాన్యతలను బట్టి బ్రాండ్ వ్యూహాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఆదాయ నమూనాలు వైవిధ్యంగా విస్తరిస్తున్నాయి. వర్చువల్ గిఫ్టింగ్, లైవ్ కామర్స్, సబ్‌స్క్రిప్షన్‌లు పెంచే వ్యూహాల వంటి వినియోగదారుల పెట్టుబడులకు సంబంధించిన అంశాలు బాగా ఆదరణ పొందుతున్నాయి.



## సంపాదకీయం..

# అమరావతి అద్భుత నగరం కావాలి !

అమరావతి సాకారం కాబోతున్నది. ప్రధాని మోడీ పునర్నిర్మాణ పనుల్లో పాల్గొనడం...ఏడాది కాలంగా చంద్రాబు అమరావతి పునర్నిర్మాణానికి అహర్నిశలు కష్టపడడంతో ఆంధ్రప్రదేశ్ కీలక మైలురాయిని చేరుకుంది. నిజానికి జగన్ తన ఐదేళ్ల పదవీకాలంలో అమరావతిని నిర్మించివుంటే చరిత్ర గుర్తించేది. ఇప్పుడు అమరావతి చరిత్రలో జగన్ చోటులేకుండా చేసుకున్నారు. అంతేగాకుండా మూడు రాజధానులు అంటూ ఐదేళ్లూ కాలం వెళ్లదీసారు. చంద్రబాబు విజన్‌కు జగన్ ఆలోచనకు ఎంతో వ్యత్యాసం ఉంది. చంద్రబాబును కాదనుకుని ఒక్క ఛాన్స్ అని అభ్యర్థించిన జగన్‌కు పట్టం కట్టడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ఓ పదేళ్లు వెనక్కి పోవడమే గాకుండా అప్పులకుప్పగా మారింది. అప్పులు చేసిన జగన్ ఆంధ్రప్రదేశ్‌ను అంధకారంలో ముంచారు. యువకుడైన జగన్‌కు నిజంగానే మంచి ఆలోచనలు ఉండివుంటే ఎపి భవిష్యత్ మరోలా ఉండేది. విజన్ ఉండాలి. పట్టుదల ఉండాలి. ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా పనులు చేయగలగాలి. బటన్ నొక్కి అప్పులు చేసిన జగన్ విజన్ లేని నేతగానే నిలిచిపోతాడు. ప్రజలు వ్యక్తిగత ప్రయోజనాలతో పాటు సమిష్టి ప్రయోజనాలు కూడా ఆశిస్తారు. విద్య,వైద్యం, నీరు,రోడ్లు వంటి సౌకర్యాలపై ప్రభుత్వాలు ఎప్పుడూ ప్రయత్నాలు సాగుతుండాలి. అందుకే ఇవేవీ లేకపోవడం వల్లనే జగన్ ఐదేళ్ల పాలనలో అనేక అనర్థాలు జరిగాయి. ప్రజలపై అప్పుల భారం పడింది. అందుకే మళ్లీ అమరావతిని రాజధానిగా పునర్నిర్మిస్తామని తెలుగుదేశం కూటమి హామీ ఇచ్చింది. అధికారంలోకి రావడంతో అది సాకారం కాబోతున్నది. గత పదేళు ్గా రాజధాని అన్నది లేకుండా పోయింది. అమరావతిని దెబ్బతీసిన జగన్ చరిత్రలో నిలిచిపోతారు. రాజధాని లేకుండా చేశారు. జగన్ ఐదేళ్ల పాలనా కాలంలో ఎపి రాజధాని ఏది అని అడిగితే చెప్పే పరిస్థితి లేకుండా పోయింది. మూడు రాజధానులా అంటే అదీ లేదు. తలలేని మొండెంలా ఆంధ్రప్రదేశ్ గత ఐదేళ్లుగా కొనసాగింది. జగన్ అధికారంలోకి వస్తే ఇలాంటి దుర్గతి వస్తుందని ఎవరుకూడా ఊహించి ఉండలేదు. అభివృద్ధి వికేంద్రీకణ వేరు..రాజధాని వేరు అన్న స్పృహలో లేకుండా జగన్ పాలన సాగించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన పలువురు రైతులు, మహిళలు కోర్టులు చుట్టూ తిరగడంతోనే సరిపోయింది. కేసులతో వారిని కోర్టులకే పరిమితం చేస్తే ఇక ఉద్యమంలో కనిపించరన్న ఎత్తుగడతో జగన్ ఎపిని అందకారంలోకి నెట్టారు.రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అన్న చందంగా కేసులకు కొదవ లేకుండా పోయింది. జగన్ తన ఐదేళ్ల పాలనాకాలంలో కనీసం రైతులతో మాట్లాడ కుండా, వారి అభిప్రాయాలు తెలుసుకోకుండా తీసుకున్న నిర్ణయం కారణంగా ఎపి తీవ్రంగా నష్టపోయింది. మొత్తంగా అస్తవ్యస్థ పాలన సాగించారు. హైదరాబాద్ హైటెక్ సిటీ నిర్మాణ సమయంలో చంద్రబాబు నిర్ణయంతో ఇప్పుడు హైదరాబాద్ ఎలా అభివృద్ధిలో పెనవేసుకు పోయిందో కళ్లకు కనిపిస్తోంది. రేపటి అమరావతిలోనూ ఇదే కనిపిస్తుంది. విభజనకు గురైన 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనివార్యంగా ఇప్పుడు కొత్త రాజధానికి శ్రీకారం చుడుతోంది. ఓ ఐదేళ్ల తరవాత అమరావతితో రూపురేఖలు మారుతాయి. భారత్‌లో ఓ అద్భుత నగరం ఆవిష్కృతం అవుతుందనడంలో సందేహం అవసరం లేదు. ఉమ్మడి ఎపిలో హైదరాబాద్ అనేది తెలుగు వారికి ఒక విద్యా, వ్యాపార, నివాస, ఉపాధి వనరుగా మారిపోయింది. విశాఖపట్నం, విజయవాడ ఆ స్థాయి నగరాలు కావు కనుకనే చంద్రబాబు కొత్త రాజధానికి శ్రీకారం చుడుతున్నారు. చంద్రబాబును తిట్టి పోసుకుంటున్న వారే రేపు స్తుతిస్తారు. విశాలమైన సముద్ర తీరంతో పాటు, పలు విమానాశ్రయాలు, ఓడరేవులు ఉన్న ఎపి ఇక అమరావతితో మరింతగా అలరారడం ఖాయం. హైదరాబాద్ లాంటి విస్తృత అవకాశాలు గల ఒక నగరం ఆంధ్రకు లేని లోటును అమరావతి తీర్చనుందనడంలో సందేహం లేదు. అంతేకాదు అంతర్జాతీయనగరంగా హైదరాబాద్÷-కు పోటీగా విస్తరిస్తుందనడంలోనూ సందేహం అవసరం లేదు. నిజానికి జగన్ అధికారంలోకి రాకుండా ఉండివుంటే ఈపాటికి అమరావతి సాక్షాత్కరించేది. అమరావతి అంటే... లక్షలాదిగా నివసించే ప్రజలు, ప్రపంచస్థాయి పెద్ద పెద్ద వ్యాపార, వాణిజ్య భవనాలు, పబ్లిక్ పార్కులు, వినోద కేంద్రాలు, ఐకానిక్ నిర్మాణాలు, సువిశాలమైన రహదారులు, నైట్ లైఫ్ వినోద కార్యకలాపాలు అందించే సఫారీ టూర్ల వెసులుబాట్లు, టూరిస్ట్ ఆకర్షణలు. ఇవేగాక అంతర్గత రవాణా సదుపాయాలువంటివన్నీ అందుబాటులోకి వస్తాయి. అనేక సదుపాయాల సముదాయంగా అమరావతి పేరిట ఒక మహానగరం నిర్మించాలన్న చంద్రబాబు నాయుడు సంకల్పం అభినందనీయం. ప్రపంచంలో అనేక నగరాలను తిరిగి, అధ్యయనం చేసిన అనుభం చంద్రబాబుది. ఆయన తన రాజకీయ జీవితం కన్నా తన పేరు చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షించే వ్యక్తి. చంద్రబాబు దార్శనికుడు కావడం వల్ల ప్రపంచ స్థాయి నగరంగా 'అమరావతి'కి బలమైన పునాదులు వేస్తున్నారు. తన దార్శనికతతోనే అమరావతిని ఓ అద్భుత వాణిజ్య నగరంగా తీర్చిదిద్దే పనిలో ప్రధానిని ఆహ్వానించి పునాది వేయించడం,పునరావిష్కృతం చేయడం చరిత్రలో నిలిచే మహోజ్వల ఘట్టం. ఇది పూర్తిగా సాకారం కావడానికి కనీసం ఓ దశాబ్ద కాలం పట్టవచ్చు. అప్పటి వరకు చంద్రబాబును ప్రలజు ఆదరిస్తే ఎపిని అగ్రభాగాన నిలబెట్టే ప్రయత్నం చేస్తారు. చంద్రబాబు నాయుడు దార్శనికతకు సజీవ సాక్ష్యంగా చరిత్రలో అమరావతి నగరం నిలిచిపోతుంది. కృష్ణా పరివాహక ప్రాంతంకావడం నీటికొరత లేకుండా అమరావతి అలరారుతందనడంలో సందేహం లేదు. అమరావతి భారతదేశంలో అద్భుత నగరంగా నిలిచిపోతే తెలుగువారందరికీ గర్వకారణమే.

# కాశ్మీర్‌లో విస్తృత గాలింపు చర్యలు

- ముస్తాక్ ఇంట్లో విరివిగా సోదాలు

**శ్రీనగర్,మే2( వెలుతురు):**

పహల్గాం దాడి తర్వాత కశ్మీర్‌లో భద్రతా దళాలు గాలింపు చర్యలను వేగవంతం చేశాయి. ఇప్పటికే తప్పించుకున్న నలుగురు ముష్కరుల కోసం గాలింపు చేపట్టిన బలగాలు, వారి మూలాలను ఆరా తీస్తున్నాయి. తాజాగా ఐసీ 814 విమానాన్ని హైజాక్ చేసిన అల్ ఉమర్ ముజాహిద్దీన్ చీఫ్ ముష్తాక్ అహ్మద్ జర్గర్‌ను ఉగ్రవాదులు విడిపించిన నేపథ్యంలో అతని ఇంట్లోను భద్రతా దళాలు సోదాలు చేశాయి. ప్రస్తుతం అతడు పాకిస్థాన్‌లో ఉంటున్నాడు. కీలక ఆధారాల కోసం సోదాలు చేపట్టారు. గత వారం 60 ఇళ్లపై ఎన్‌ఐఏ బృందాలు దాడులు నిర్వహించాయి. ఈసందర్భంగా మొత్తం ఇప్పటివరకు 1900 మందిని ప్రశ్నించాయి. పహల్గాం దాడికి సంబంధించి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసేందుకు ఎన్‌ఐఏ అత్యాధునిక విధానాలు వినియోగిస్తోంది. శాటిలైట్ ఇమేజ్‌లు, డ్రోన్ దృశ్యాలు, బాధితులు, గుర్రపు స్వారీ ఆపరేటర్ల నుంచి సమాచారం సేకరిస్తోంది. దీంతోపాటు- దాడి జరిగిన ప్రదేశాన్ని





హైరిజల్యూషన్ 3డీ మోడల్‌ను కూడా తయారుచేస్తున్నట్లు- తెలుస్తోంది. ఈ మోడల్ దర్యాప్తును కోర్టులో విచారణకు ఉపయోగించనుంది. ఘటనా స్థలం నుంచి ఇప్పటివరకు 40 ఖాళీ తూటాలను దర్యాప్తు బృందాలు స్వాధీనం చేసుకొన్నాయి. అంతేకాదు.. మొబైల్ టవర్స్ నుంచి పాత డేటాను మొత్తం దర్యాప్తు బృందాలు వెలికితీస్తున్నాయి. బైసరన్ లోయలో పర్యాటకులను హత్య చేయాలన్న పథకాన్ని ప్రాథమికంగా లష్కరే తోయిబా రూపొందించిందని జాతీయ దర్యాప్తు సంస్థ ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చింది. దీనికి ఐఎస్‌ఐ ఆపరేటివ్‌లు సాయం చేయగా.. దీనికి పాక్‌లోని లష్కరే ప్రధాన కార్యాలయంలో తుదిరూపు వచ్చింది. ఈ మొత్తం దాడికి లష్కరే ఉగ్రవాది హషీమ్ ముసా, అలీభాయ్‌లు కేంద్రంగా నిలిచినట్లు అంచనా వేసింది. వీరిద్దరూ పాక్ జాతీయులే. ఈ ఉగ్రవాదులకు 2024లో జరిగిన గగనగర్ ఉగ్రదాడితో సంబంధం ఉందని దర్యాప్తు బృందాలు బలంగా విశ్వసిస్తున్నాయి. అయితే వీరు చీనాబ్ లోయ వైపు నుంచి వచ్చి ఉండనందున, అటువైపు వెళ్లి ఉండకపోవచ్చని భావిస్తున్నాయి. ఇకపోతే ?వరుసగా 8వ రోజు కూడా పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. అంతర్జాతీయ సరిహద్దుల వెంట కాల్పులు జరిపింది. వీటిని భారత్ బలంగా తిప్పికొట్టింది. దీంతోపాటు సరిహద్దుల వెంట ఉన్న బంకర్లను శుభ్రం చేసి.. స్థానికులు ఆశ్రయం పొందేందుకు వీలుగా సిద్ధం చేస్తున్నారు.

# రారెత్తిస్తున్న ఎండలు

## బయటకు రావడానికే జంకు

**నిజామాబాద్,మే2( వెలుతురు):**

జిల్లాలో రాష్ట్రంలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాదాపు 42డిగ్రీలకుఎ చేరువలో నమోదు అవుతున్నాయి. దీంతో ప్రజలు బయటకురావడానికే జంకుతున్నారు. వేడి, ఉక్కపోత ఉండటంతో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎండవేడిమితో అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పని నిమిత్తం ఎండలో బయట వెళ్లినప్పుడు తప్పనిసరిగా రక్షణ కవచాలు ధరించాలని, కళ్లకు రక్షణగా కళ్లద్దాలు, నెత్తిన టోపీ, వేడిగాల్పుల నుంచి చెవులు, ముక్కుకు రక్షణగా రుమాలు కట్టుకోవాలని చెబుతున్నారు. వడదెబ్బ తగలకుండా ఎక్కువ నీరును విడతల వారీగా తాగాలని, పుచ్చకాయలు, కొబ్బరినీళ్లు, పండ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలని పేర్కొంటున్నారు. ఓఆర్ఎస్ పొట్లాలు దగ్గర ఉంచుకుంటే ఉత్తమం. వృద్ధులు, గర్భిణులు, బాలలు ఎండలో వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీంతో చాలామంది తమ పనులు వాయిదా వేసుకుంటున్నారు. ఎండ లేని సమయంలో అంటే ఉదయం 9 లోపు, సాయంత్రం 6 తర్వాత తమ పనులు చేసుకోవడానికి ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. ఎప్రిల్‌లోనే మండుతున్న ఎండలు మే నాటికి ఎలా ఉంటాయోనన్న భయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. వచ్చే వారంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మేరకు నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లినా ఎండ వేడి నుంచి తట్టుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మే నెలలో వడగాల్పులు ఎక్కువగా వీచే



అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. తీవ్రమైన ఎండలతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారి ఎడారిని తలపింపజేస్తున్నాయి. కోల్‌బెల్ట్ ఏరియాలు ఎండలు మండుతున్నాయి. రామగుండం, పెద్దపల్లి, గోదావరిఖని తదితర ప్రాంతాల్లో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం ఎనిమిది దాటితేనే ఎండలు భగ్గుమంటున్నాయి.. నాలుగు రోజులుగా భానుడు తీవ్రరూపం దాల్చుతున్నాడు.. పది దాటితే బయటికి వెళ్లాలంటేనే జనాలు జంకుతున్నారు. దీంతో ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మధ్యాహ్నం వేళ ప్రధాన రోడ్లన్నీ నిర్మాణుష్యంగా మారుతున్నాయి. మున్ముందు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గత మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను దాటుతున్నాయి. రోజంతా భానుడు ప్రతాపం చూపిస్తుండడంతో సాయంత్రం 6 గంటల వరకు వేడి గాలులు వీస్తున్నాయి. సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ముఖ్యంగా వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతుండడంతో నగరంలోని ప్రధాన రహదారులన్నీ మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారుతున్నాయి. అనునిత్యం రద్దీగా ఉండే టవర్‌సర్కిల్‌తో పాటు, ఇతర ప్రాంతాలు వెలవెలబోతున్నాయి.

# సామాజిక సంస్కర్త భగవద్ రామానుజులు

### రామానుజుల జయంతి సందర్భంగా

**తిరుమల,మే4( వెలుతురు):**

భగవద్ రామానుజాచార్యులు వెయ్యేళ్ల క్రితమే సమానత్వాన్ని బోధించి గొప్ప సంఘసంస్కర్తగా నిలిచారు. అప్పటికాలమాన పరిస్థితులకు అనుగుణంగా వైష్ణవ ఆలయాల్లో పూజా విధా నాలను ఏకీకృతం చేసిన ఘనత రామానుజులవారికే దక్కింది. భారతీయ సనాతనధర్మంలో అద్వైతాన్ని శ్రీ ఆదిశంకరాచార్యులు, ద్వైతాన్ని శ్రీ మధ్వాచార్యులు, విశిష్టాద్వైతాన్ని శ్రీ రామానుజా చార్యులు బోధించి ఆధ్యాత్మిక బీజాలను నాటారు. భగవద్ రామానుజాచార్యులు సాక్షాత్తు ఆదిశేషుని అంశంగా భావిస్తారు. రామానుజాచార్యులు శాస్త్రాన్ని, సంప్రదాయాన్ని పటిష్టంగా అమలుచేసి ఆలయాలను అభివృద్ధి చేశారు. తిరుమల శ్రీవారి ఆలయమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రత్యేకించి దళితులకు చాపకూడు అమలుచేసి వారిని అంటరానితనం నుంచి దూరం చేశారు. వారికి కూడా నారాయణ మంత్రోపదేశం చేశారు. శ్రీభాష్యకారుడై, విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని స్థిరముగ నిలిపిన ధీశాలి రామానుజులవారు. కలియుగంలో వేంకటేశు డే గతి అని చాటిన గురువు ఆయన. కొండను ఆదిశేషుడని భావించి మోకాలుతోటే కొండనెక్కిన భక్తి పరుడు. కేవలం మనకే కాక శంఖ చక్రా క్రియాది కార్యాలను స్వామికి చేసి ఆచార్యుడంటే ఇతనే అని అనిపించుకున్న వారు ఆయన. స్వామికి ఊర్ధ్వపుండ్రమును ధరింపజేసి లోకానికి ఆయన శోభను ప్రకాశింప జేసాడు. వేంకటేశ్వరుడిని లోకానికి



ప్రకటింపజేసి అక్కడ ఆలయ నిర్వహణను భగవత్ రామానుజులవారు చక్కపరిచారు. కొండపై పూలు స్వామికి తప్ప ఇతరులకు అర్హతలేదు అని నియమం ఏర్పాటు చేసారు. నీలకంఠుడిచే పూజింపబడ్డ నారసింహ మూర్తికి ఆరాధనాలోపం జరగకూడదని శ్రీనివాసుని ధివ్య విమానమునకు అభిముఖంగా నారసింహ మూర్తిని ప్రతిష్ఠించారు. దేవాలయం చుట్టు తిన్నని మాడ వీధులను నిర్మించి ఉత్సవములను కొండపై జరిగేట్టు చేసారు. అక్కడ నిత్యారాధనకు అర్చకులని ఏర్పాటు చేసారు. కొండపై మృతకళేబరములకు దహన సంస్కారం జరపరాదు అని నియమం ఏర్పరిచారు. మాడ వీధుల యందు పాదరక్షలు ధరింపరాదని నియమం ఏర్పరిచారు. రామానుజులవారు తిరుమల నంబి వద్ద రోజు రామాయణం నేర్చుచుండగా కొండ క్రింద లక్ష్మణహనుమత్సుగ్రీవాంగద సహితముగా శీరామచంద్ర మూర్తి విగ్రహముగా స్వామి దర్శనమిచ్చాడు. ఆమూర్తికి సీతను జతచేసి ఆరాధన, కళ్యాణము నిత్యంగా జరిగేట్టు నియమం ఏర్పరిచారు. వరాహమూర్తికి ఉత్సవ మూర్తిని ఏర్పరిచి విశేషోత్సవములు జరిగేట్టు నియమం ఏర్పరిచారు. శ్రీనివాసుడికి ఇష్టమైన దివ్య ప్రబంధ గానములని తోమాల సేవగా ఏర్పరిచారు. ఆలయానికి ఎదుట జీయరుకు నివాసం ఏర్పరిచి తానారాధించిన శీరామచంద్ర మూర్తి విగ్రహముగా స్వామి దర్శనమిచ్చాడు. ఆమూర్తికి సీతను జతచేసి ఆరాధన, కళ్యాణము నిత్యంగా జరిగేట్టు నియమం ఏర్పరిచారు. వరాహ మూర్తికి ఉత్సవ మూర్తిని ఏర్పరిచి విశేషోత్సవములు జరిగేట్టు నియమం ఏర్పరిచారు. శ్రీనివాసుడికి ఇష్టమైన దివ్యప్రబంధ గానములని తోమాల సేవగా ఏర్పరిచారు. తిరుమలలో ఆచార విశేష వ్యవస్థల ధర్మ పరిరక్షణకు తగు వ్యక్తులను ధర్మరక్షకులుగా నియమించారు. సర్వలోక హితకరమైన శ్రీమద్రామానుజాచార్యుని దివ్యాజ్ఞ సమస్త దేశములయందు, దిక్కులయందు, అన్ని కాలములయందు అప్రతిహతంగా వర్థిల్లుతున్నాయి.

# ఉగ్రవాదులకు ఊతమిస్తున్నది నిజమే

- రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ వ్యాఖ్యలకు భుట్టో సమర్థన

**ఇస్లామాబాద్,మే2( వెలుతురు):**

పాకిస్తాన్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషించింది నిజమేనంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద గ్రూపులకు మద్దతు ఇవ్వడం, నిధులు సమకూర్చడంలో పాకిస్తాన్ ప్రమేయం ఉందంటూ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై స్పందించిన భుట్టో ఈమేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ చరిత్ర తీవ్రవాదంతో ముడిపడి ఉందన్నది నిజమేనని అన్నారు. దాని ఫలితంగా దేశం నష్టపోయిందని.. ఆ తర్వాత పలు సంస్కరణలు చేపట్టామని భుట్టో అన్నారు. పాకిస్తాన్ కు ఉగ్రవాదంతో సంబంధాలు ఉన్నాయన్నది రహస్యంగా భావించట్లేదని.. ఉగ్రదానికి మద్దతు ఇవ్వడం ద్వారా పాకిస్తాన్ తీవ్రంగా నష్టపోయిందని అన్నారు భుట్టో. ఉగ్రవాదం తాలూకు ప్రభావాన్ని ఇప్పటికీ అనుభవిస్తున్నామని అన్నారు. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకున్నామని.. ఫలితంగా సంస్కరణలు చేపట్టామని అన్నారు. ప్రస్తుతం పాకిస్తాన్ శాంతి కోరుకుంటు-ందని.. భారత్ రెచ్చగొడితే యుద్ధానికి సిద్ధమేనని అన్నారు భుట్టో. పాకిస్తాన్ శాంతియుత దేశమని, ఇస్లాం శాంతియుత మతమని అన్నారు భుట్టో... తాము యుద్ధం కోరుకోవడం లేదని.. కానీ ఎవరైనా సింధుపై దాడి చేస్తే, వారు యుద్ధానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. మేము యుద్ధ ఢంకా మోగించము కానీ.. రెచ్చగొడితె మాత్రం పాకిస్తాన్ గర్జన భయంకరంగా ఉంటుందని అన్నారు.

## విజయభేరి మ్రోగించిన నారాయణ విద్యార్థులు




**హయత్‌నగర్ వెలుతురు మే 02:**

హయత్‌నగర్ నారాయణ హైస్కూల్ 10వ తరగతి ఫలితాల్లో గొప్ప విజయాన్ని సాధించింది.హయత్‌నగర్, సూర్యనగర్ కాలనీ బ్రాంచ్ నారాయణ హైస్కూల్ విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించడం ద్వారా గొప్ప విజయాన్ని సాధించారు. ఈ విభాగంలో వారు మొత్తం 600 మార్కులు సాధించే సామర్థ్యాన్ని ప్రదర్శించారు. ఎస్. అక్షిత 572/600, కె. వివేక శ్రీ 569/600, బి. కావ్య శ్రీ 567/600, కె. ఆశ్రిత 566/600, జి. కృషిక 564/600, నిత్యశ్రీ 563/600, డి. సాయి శరణ్య 561/600, సంజనశ్రీ 560/600, సాయి మనోజ్ఞ 558/600 మరియు 38/66 మంది విద్యార్థులు 500 కంటే ఎక్కువ మార్కులు సాధించి తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల కృషికి జీఎం.గోపాల్ రెడ్డి , AGM రవీంద్ర బాబు, ప్రిన్సిపాల్ లావణ్య రెడ్డి , ఏడి. నజీర్, R&D. శివరంజని, సిఓ.సుజన్ మరియు ఉపాధ్యాయులందరూ అభినందించారు.

## కేంద్ర ప్రభుత్వం కులగణన చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- శిగ వీరస్వామి గౌడ్ ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు
- ప్రియతమ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారికి ధన్యవాదాలు



**ఆదిభట్ల వెలుతురు మే 02:**

తెలంగాణ ప్రభుత్వం కుల గణన పేరుతో తప్పుల తడకగా బీసీ గణన చేసి ఇతరులను బీసీ లలో చూపించడం ద్వారా ఇలాంటి పనులను కేంద్ర ప్రభుత్వం గమనించి తప్పును కులగణనను ఒప్పుకునేది లేదని దేశవ్యాప్తంగా ఏ విధమైన అవకతవకలు లేకుండా కేంద్ర కేబినెట్ కుల గణనకు అంగీకారం తెలపడం హర్షణీయమన్నారు. అయితే ఇప్పటికే జన గణన ఆలస్యమైన నేపథ్యంలో ప్రజలకు సంక్షేమం అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందుకే వీలైనంత తొందరగా జన గణన తో పాటు కుల గణన ప్రక్రియను పూర్తి చేసి జనాభా ప్రాతిపదికన సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్లు పెంచాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ యాదాద్రి భువనగిరి

- జిల్లా అధ్యక్షుడిగా గౌర బీరప్ప



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 2 :**

రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గా, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన గౌర బీరప్ప నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నాపై నమ్మకంతో నన్ను నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్ కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో స్కాలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా విశ్వవిద్యాలయాల సమస్యల పైన అనేక రకాల పోరాటాలు చేశానని, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశానని అన్నారు. చాలా సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఆహ్వానం మేరకు గత గ్రాడ్యుయేట్ ఎన్నికలలో కోఆర్డినేటర్ గా ఉండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం కృషి చేశానని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోని పెద్దలు పట్టించుకోకపోవడం, ప్రాధాన్యతను ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ పార్టీని విడాల్సి వచ్చిందని అన్నారు. రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్ ఆహ్వానం మేరకు ఆర్ ఎల్ డి పార్టీలో చేరానని తెలిపారు. నన్ను గుర్తించి నాకు రాష్ట్ర అధికార ప్రతినిధి గా, జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రాష్ట్ర పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, జిల్లాలోని అన్ని మండలాలలో, గ్రామాలలో కమిటీలను ఏర్పాటుచేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

## దాసరి మల్లయ్య చనిపోయిన వార్త తంగడపల్లి నాయకుల ప్రగాఢ సానుభూతి



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 2 :**

శుక్రవారం రోజున చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి తంగడపల్లిలో దాసరి మల్లయ్య చనిపోవడం జరిగింది ఇట్టి విషయాన్ని తెలుసుకొని పార్థియా దేహానికి పూలమాల వేసి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తనవంతు సాయంగా మాజీ సర్పంచ్ ముటుకులోజు దయాకర చారి పదివేల రూపాయలు వారి కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గ్యార కృష్ణ, రాజరత్నం, జిట కృష్ణ, అస్లాం, తదితరులు పాల్గొన్నారు .

## సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కులు అందజేత

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 2**



మండలం నీర్నెముల గ్రామనికి చెందిన చల్లమల్ల వైజయంతి మరియు బొజ్జ రాణి కు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్న సహకారంతో మంజూరైన చెక్కులను లబ్దిదారులకు అందజే యడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పెరమాండ్ల నవీన్ , ఆవుల సత్యనారాయణ, చల్ల సత్యప్రకాశ్, నోముల యాదగిరి, నోముల ప్రవీణ్ కుమార్, , నోముల విష్ణు, ఆవుల పర్వతాలు ,ఓర్సు తిరుమలయ్య, నోముల శివ, నోముల స్వామి ,నోముల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ యంత్రాంగం, కొన్ని విభిన్న సంస్థలు వ్యవహరిస్తున్న తీరు బాధ కలిగిస్తుంది...

- పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు...



**హైదరాబాద్ వెలుతురు మే 02:**

రాష్ట్రంలో ఒకవైపు ప్రభుత్వ యంత్రాంగం, మరోవైపు సమాజంలోని కొన్ని విభిన్న సంస్థలు వివరిస్తున్న తీరు బాధ కలిగిస్తుందని మెదక్ పార్లమెంటు సభ్యులు ఏం రఘునందన్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం రోజున జరిగిన మీడియా సమావేశంలో ఎం. రఘునందన్ రావు మాట్లాడారు..
మీడియా సమావేశంలో ఆయన ఏమన్నారంటే....
పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని జిన్నారం మండల కేంద్రంలో శివుడి విగ్రహ ధ్వంసానికి సంబంధించి, పోలీసులు మూడో రోజున ఒక వీడియో విడుదల చేశారు. అందులో మదర్సా విద్యార్థులకు సంబంధం లేదని, ఓ కోతి విగ్రహం వైపు వెళ్లి ధ్వంసం చేసిందని చెప్పుతూ వీడియో ఫుటేజ్ చూపించి వ్యవహారాన్ని ముగించేశారు. అయితే, సంఘటన జరిగిన మరుసటి రోజే 19 మంది హిందువులను అరెస్టు చేశారు. ఆ తరువాత మరో 5 మందిని అరెస్టు చేసి మొత్తం 24 మందిని రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటనపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఆ రోజు కొంతమంది హిందువులు చైతన్యంగా .. ఆరోజు ఇది ఎందుకు జరుగుతోందని నిలదీస్తే వారిని పోలీసులు రిమాండ్‌కు పంపారు. ఈ నేపథ్యంలో మాకు కలిగిన అనుమానాలను రాష్ట్ర డీజీపీ గారి దృష్టికి తీసుకెళ్లాను. ఆ మదర్సాలో ఎవరు ఉన్నారు? మదర్సాలో ఉన్న 70 మంది విద్యార్థులు ఎక్కడి వారు? వారు ఏ ఊర్ల నుంచి వచ్చారు? మదర్సా ఎప్పుడు స్థాపించారు? మదర్సా ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నారా? ఇది ఎవరి కోసం నిర్మించారు? ఏ జాతీయుల కోసం నిర్మించారు? ఈ విషయాలపై విచారణ జరపాలని కోరాను. మెదక్ పార్లమెంట్ పరిధిలోనే జిన్నారంలోని శివనగర్‌లో ఒక మదర్సా ఉంది. అలాగే సంగారెడ్డి నుంచి సదాశివపేటకు వెళ్లే హైవే పైన మరో మదర్సా ఉంది. ఈ మదర్సాల్లో జరుగుతున్న కార్యకలాపాలపై అనుమానాలున్నాయని డీజీపీ గారికి వివరించాను. వాటి అసలు వివరాలపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశాను. జిన్నారం మదర్సాలో 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 65 మంది బిహార్ రాష్ట్రంలోని కిషన్ గంజ్ జిల్లాకు చెందినవారిగా చెప్పారు. వారి తల్లిదండ్రులు బిహార్‌లోనే ఉన్నారని చెప్పారు. కిషన్ గంజ్ ప్రాంతం బంగ్లాదేశ్ సరిహద్దుకు సమీపంగా ఉంది. ఈ నేపథ్యంలో ఆ 65 మంది విద్యార్థులు బంగ్లాదేశ్ నుంచి వచ్చి శిక్షణ పొందుతున్నట్లుగా అనుమానం కలుగుతోంది. విద్యార్థులకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు కూడా కిషన్ గంజ్ నుంచే వచ్చారని తెలియజేశారు. కిషన్ గంజ్ ప్రాంతంలో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులు హిందువులను బెదిరించి భూములు ఆక్రమిస్తున్నారు. అక్కడ ల్యాండ్ జిహాద్ జరుగుతోంది. ఎండోమెంట్‌కు చెందిన భూమిలో మదర్సా ఎలా నిర్మించబడింది? కోదండరామాలయంనకు సంబంధించిన సర్వే నంబర్లు 1, 2పై విచారణ జరపాలని తహశీల్దార్‌ను కోరినప్పటికీ, ఆయన స్పందన తగిన స్థాయిలో లేదు. ఈ అంశాన్ని డీజీపీ గారి దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు. మదర్సా అనుమతులు, అక్కడ జరుగుతున్న కార్యకలాపాలపై ఎలాంటి విచారణ జరపలేదు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి మరియు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి ప్రజల సాక్షిగా లేఖ రాస్తున్నాను. ఈ రాష్ట్రంలో మదర్సాల వివరాలు ఏమిటి? ఎన్ని మదర్సాలకు అనుమతి ఇచ్చారు? మదర్సాలు ఎవరు నిర్వహిస్తున్నారు? ఎవరు చదువుతున్నారు? అనుమతిలేని మదర్సాలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది? ఇంతకు ముందు ఈ మదర్సాల్లో చదువుతున్న పిల్లలు ఇప్పుడు ఎక్కడున్నారు? వారు ఏం చేస్తున్నారు? వారికి మదర్సాల్లో ఇచ్చే సర్టిఫికెట్లకు ఎంతవరకు గౌరవం ఉంది? ఈ ప్రశ్నలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం ఇవ్వాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలి. మదర్సాల్లో పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి రోహింగ్యాలను తీసుకురావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మదర్సాల్లో తప్పుడు ధృవపత్రాల ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలకు శిక్షణ ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అనుమానం ఉంది. ఈ మదర్సాల్లో ఉండే పిల్లల గుర్తింపుపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలి. సదాశివపేట మున్సిపాలిటీ పరిధిలో బంగ్లాదేశీయులకు ఓటర్ కార్డులు, ఆధార్ కార్డులు జారీ చేశారు. ఇస్నాపూర్ వద్ద 247 మంది నేపాల్ దేశస్థులకు ఆధార్ కార్డులు మంజూరు చేశారు. ఇది అన్యాయం. ప్రశాంతంగా ఉన్న మెదక్ పార్లమెంటు పరిధిలో హిందువులను భయభ్రాంతులకు గురిచేస్తూ కొన్ని సంఘటనలు జరుగుతున్నాయి. సదాశివపేటలో వినాయకుడి విగ్రహం ధ్వంసం, బక్రీద్ సందర్భంగా జరిగిన గొర్రెల పోటీలు, ముత్యాలమ్మ గుడి ధ్వంసం వంటి ఘటనలు.. ఇవన్నీ స్థానికంగా ఉన్న కొంతమంది దుర్మార్గులతో కలిసి బయట నుంచి వచ్చిన వలసదారులు కలిసి, తప్పుడు ధృవపత్రాలతో దేశ వాతావరణాన్ని కలుషితం చేయడమే లక్ష్యంగా చేస్తూ జరుగుతున్నాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారు తెలంగాన రాష్ట్రంలో అక్రమంగా నివాసముంటున్న బంగ్లాదేశీయులను, రోహింగ్యాలను గుర్తించి వెనక్కి పంపించాలని ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రికి సూచించారు. దీనిపై హోంమంత్రిత్వ శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ కూడా అందింది. ముక్కుపచ్చలారని విద్యార్థులను ముందుకు పెట్టి "లవ్ జిహాద్" పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతూ, ప్రశాంతంగా ఉన్న జిన్నారం ప్రాంతంలో ఉద్రిక్తతలను సృష్టించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. జిన్నారం మదర్సాలో జరుగుతున్న వ్యవహారంపై పోలీసులు పూర్తిస్థాయిలో పారదర్శకంగా విచారణ జరపాలి.

# కాంగ్రెస్ ఎలక్షన్ల ముందు అందరికీ పరమాన్నమని, ఇప్పుడు అందరికీ పంగనామాలు పెడుతున్నారు.

- నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టింది.. నిరుద్యోగ భృతి అటకెక్కించింది...
- ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను ఆన్ లైన్ చేయడంలో విఫలమైంది.
- రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి.
- ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో ప్రభుత్వం చెప్పాలి.
- ఎన్నికల ముందు కోతలు ఎన్నికల తర్వాత ఎగవేతల్లా రేవంత్ రెడ్డి ప్రభుత్వం..
- కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చిన ఇల్లులే తప్ప కట్టిన ఇళ్ళు లేవు..
- ప్రజల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ సర్కార్...
- బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్...



**కరీంనగర్ వెలుతురు మే 02:**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు పరమాన్నం పెడతామని , నేడు అందరికీ పంగనామాలు పెడుతుందని , 16 నెలల్లో ఏ ఒక్క హామీని , 6 గ్యారంటీలను సక్రమంగా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను నిలువుల మోసం చేసిందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి, బీజేవైఎం కరీంనగర్ జిల్లా ప్రబారి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ఫైర్ అయ్యారు. శుక్రవారం రోజున కరీంనగర్లోని బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దుర్శెట్టి సంపత్ ఆధ్వర్యంలో యువ మోర్చా ముఖ్య నేతలతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో కోతలు కోసిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎగవేతలను మొదలుపెట్టారని విమర్శించారు. రాష్ట్రంలోని ఏ వర్గాన్ని విడిచిపెట్టకుండా అందరికీ అన్ని ఇస్తామని , అందర్నీ ఆదుకుంటామని మాయమాటలు చెప్పి మోసం చేసిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. నిరుద్యోగులకు ప్రతినెల 4 వేల భృతి ఇస్తామని, వారి నోట్లో మట్టి కొట్టిందన్నారు. ప్రజాపాలనలో అప్లికేషన్ , మీ సేవలో అప్లికేషన్, గ్రామసభల్లో అప్లికేషన్ లు పెట్టుకో వాలని కాంగ్రెస్ సర్కార్ ప్రజలను గోస పెట్టింది తప్ప ప్రజలకు న్యాయం చేసిందేవిలేదన్నారు. ముఖ్యంగా ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను ఆన్ లైన్ చేయకపోవడం వల్ల, కట్టగట్టి పక్కకు పడేయడం వల్ల మళ్ళీ మళ్ళీ దరఖాస్తులు పెట్టుకునే పరిస్థితి తీసుకువచ్చారని పేర్కొన్నారు.16నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు.. మోసాల పునాదిపై ఏర్పడింది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలనీ. ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో ప్రభుత్వం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు.ఇండ్ల విషయంలో ఏడాదికి ఐదు లక్షల ఇల్లు కడతామని హామీ ఇచ్చి , ఏడాదిన్నర కాలమైన ఒక్క ఇల్లయిన ప్రభుత్వం కట్టిందా? అని ఆయన ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చిన ఇల్లులే తప్ప కట్టిన ఇళ్ళులు ఏమీ లేవని ఆయన ఆరోపించారు.ఎస్సీ,ఎస్టీలకు ఆరు లక్షల రూపాయలు ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి ఇప్పటివరకు ఒక ఇల్లు కట్టించలేకపోయారన్నారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో కూలీలందరికీ న్యాయం చేస్తామని చెప్పి ఇప్పుడు కొందరు మాత్రమే ఇస్తామని మాట మార్చిందన్నారు పేదోళ్ళకు, అర్హులైన వారందరికీ ఇళ్ళు , రేషన్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా పరిపాలన కొనసాగిస్తుందని , ఏడాదిన్నరకి తీవ్రమైన ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు.కాంగ్రెస్ నాయకుల తప్పులకు అధికారులు బలవుతున్నారనీ, గ్రామాల్లో ప్రజలు అధికారులను నిలదీస్తున్నారని తెలిపారు.రూ.2500 మహాలక్ష్మి పథకం ఎప్పుడు ఇస్తారని, అవ్వాతాతలకు 4000 పెన్షన్ ఎప్పుడు ఇస్తావని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రతి ఊళ్లో ప్రశ్నించే పరిస్థితి కొని తెచ్చుకున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ యే నన్నారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్ పై చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాలకు బీజేవైఎం ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో బీజేవైఎంను మరింత బలోపేతం చేయడానికి తగిన కార్యాచరణతో ముందు కొనసాగాలని ఆయన ఈ సందర్భంగాసూచించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు శశిధర్ రెడ్డి, శ్రీరాముల శ్రీకాంత్,జిల్లా ఉపాధ్యక్షులు అశోక్,సంపత్,అనిల్,సాయి,అజయ్,జిల్లా కార్యదర్శి మహేష్, జిల్లా అధికార ప్రతినిధులు రమేష్,ప్రసన్న,సాయి కృష్ణరెడ్డి,ప్రశాంత్, పొన్నాల రాం,అరుణ్,ప్రదీప్,శివారెడ్డి,బండి సాగర్,వినయ్,వంశీకృష్ణ,దిలీప్ తదితరులు పాల్గొన్నారు..

# విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ప్రభుత్వ డిగ్రీ , జూనియర్ కళాశాల్లో అడ్మిషన్లు తీసుకోవాలి.
- తాజా మాజీ సర్పంచ్ గోదాసు శిరీష పృథ్వీరాజ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 2**

ప్రభుత్వ కళాశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని రామున్నపేట తాజా మాజీ సర్పంచ్ గోదాసు శిరీష పృథ్వీరాజ్ అన్నారు. శుక్రవారం రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించి ఉన్నత మార్కులు సాధించిన కాలేరు నందిని, కాలేరు శ్రేష్ట లను ఆమె వారి ఇండ్లకు వెళ్లి ఘనంగా సన్మా నించి, స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు. మరెన్నో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోటీ తత్వ ప్రపంచంలో విద్యను అభ్యసించి ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఆమె అన్నారు. పోటీ ప్రపంచంలో అమ్మాయిలు అబ్బాయిలతో పోటీపడి ప్రపంచంలో తీసుపోకుండా ముందుకు కదులు తున్నారని అన్నారు. తల్లిదండ్రులు అమ్మాయిలని తక్కువ చూపు చూడకుండా అబ్బాయిలతో సమానంగా వారిని అన్ని రంగాలలో ప్రోత్సహించాలని తెలిపారు. తమ ప్రతిభను చాటుతూ భారతదేశంలో అమ్మాయిలు ప్రతి రంగంలో అబ్బాయిల కంటే ముందున్నారని చెప్పారు. ఎవ్వరు కూడా అమ్మాయిలు అని చదువును మధ్యలో ఆపొద్దని ఆమె కోరారు. యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు ప్రభుత్వ కళాశాలలో, ఉన్నత రిజల్ట్ ని సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం పట్ల హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడున్న రోజులలో మనం ఎన్నో రకాలుగా ఆర్థిక ఇబ్బందుల ఎదుర్కొంటున్నా పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి వారికి ఉన్నత చదువుల కు ప్రోత్సహిస్తున్నారు. అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు వ్యసనాలకు, సెల్ ఫోన్ లకు దూరంగా ఉంచాలని కోరారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చు కోవాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ జూనియర్ కాలేజీలల్లో అడ్మిషన్లు చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రభుత్వ కాలేజీలో అడ్మిషన్ చేసుకోని ఉన్నతమైన అధ్యాపకులు సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రవేట్ కాలేజీలో చేరి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవద్దని ఆమె కోరారు. మన మహానుభావులు జ్యోతిరాజ్ పూలే, సావిత్రి బాయ్ కన్న కలలు వారి ఆశయాలు ఇప్పుడు పూర్తవుతున్నాయని ఆమె తెలిపారు.

## కాంగ్రెస్ రంగు తేలిపోయింది

- ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం
- బిజెపితో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు
- హరీష్ సమక్షంలో పలువురు బిజెపి కార్యకర్తల చేరిక



**సంగారెడ్డి,మే2( వెలుతురు):**

పాలనా వైఫల్యం, కాంగ్రెస్ నిర్లక్షం ప్రజలకు శాపంగా మారిందని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు చెప్పారు. ప్రజలకు కాంగ్రెస్ మోసం తెలిసిపోయిందని, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం అవుతుందని చెప్పారు. ఇకపోతే భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా విస్మరించిందని హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాన అభివృద్ధిని ఆ పార్టీ పూర్తిగా విస్మరించిందన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా తెలంగాణకు ఒరిగిందేమీ లేదన్నారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు భాజపా నేతలు, కార్యకర్తలు ఆయన సమక్షంలో భారాసలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణకు భాజపా అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా విమర్శలు గుప్పించారు. భారాస మొదలుపెట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టుల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కనపెట్టి జహీరాబాద్ నియోజకవర్గానికి అన్యాయం చేసిందన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా మొత్తం సాగునీటితో సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్షయం చేస్తోందని విమర్శించారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు పూర్తి చేయడానికి భారాస పోరాటం చేస్తుంది. తాగు, సాగునీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారాస హయాంలో వచ్చిన నీళ్లు ఇప్పుడు ఎందుకు రావడం లేదు? పాలనా వైఫల్యం, కాంగ్రెస్ నిర్లక్షయం ప్రజలకు శాపంగా మారింది. వాళ్ల మోసం ప్రజలకు తెలిసిపోయింది. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. తెలంగాణ అభివృద్ధి మాతోనే సాధ్యమవుతుందని హరీశ్ రావు తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. సంగమేశ్వర ప్రాజెక్టు పూర్తయితే జిల్లా మొత్తం సాగు నీటితో సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. బసవేశ్వర ప్రాజెక్టు పూర్తి చేయడానికి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని వెల్లడించారు. తాగు, సాగు నీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బీఆర్ఎస్ ఉన్నపుడు వచ్చిన నీళ్ళు ఇప్పుడు ఎందుకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో చేరినవారిలో మాజీ ఎంపీటీ-సీ దేశీటి పటేల్, రవి కుమార్, మాజీ సర్పంచ్ తుకారాం, భాస్కరం, సంగశీటి, సంజీవ్, అమృత్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# బిసిల గురించి కిషన్ రెడ్డికేం తెలుసు

- మాపై విమర్శలు చేస్తే సహించం
- విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే దానం
- తెలంగాణ ముమ్మాటికీ రోల్ మోడల్ అన్న బీర్ల అయిలయ్య

**హైదరాబాద్,మే2( వెలుతురు):**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి బీసీల గురించి ఏమి తెలుసని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో దానం నాగేందర్ మాట్లాడారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కిషన్‌రెడ్డికి లేదని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన ఎక్కడ చేయలేదని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణని రోల్ మోడల్‌గా తీసుకొమ్మన్నారని చెప్పారు. బీసీలం అల్ప సంతోషులమని అన్నారు. విమర్శలు ప్రతి విమర్శలు వల్ల సాధించేది ఏమీ లేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. ఇకపోతే దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో కులగణన చేసి రోల్ మోడల్‌గా నిలిచామని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సీఎల్పీ మీడియా పాయింట్‌లో బీర్ల ఐలయ్య మాట్లాడారు. సాహోసోపేత నిర్ణయాలతో దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. జనగణనలో కులగణన చేస్తామన్న మోదీ కేబినెట్‌కి ధన్యవాదాలు తెలిపారు. దేశం అంత బీసీలకి న్యాయం జరగాలని అన్నారు. ఇక్కడ ఉన్న బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. గతంలో రాహుల్ గాంధీ పాదయాత్రలో ప్రజల సమస్యలు చూసి కులగణన జరగాలని పోరాడారని చెప్పారు. తెలంగాణలో కులగణన రాహుల్ గాంధీ విజన్ అని చెప్పారు. కేంద్రమంత్రి అయ్యి ఉండి కిషన్‌రెడ్డి ఆలోచించి మాట్లాడాలని అన్నారు. ఏ లెక్కల ప్రకారం తమ కులగణన తప్పని కిషన్ రెడ్డి అంటున్నారని నిలదీశారు. రేపు కేంద్రం కులగణన చేసిన తర్వాత ఆ లెక్కలు చూసి చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణని కేంద్రం రోల్ మోడల్‌గా తీసుకున్నందుకు రాష్ట్ర బీజేపీ నేతలకి దిమ్మ తిరిగిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి భారత్‌లో హీరోగా నిలబడటం కేంద్ర మంత్రులు జీర్ణించుకోలేక పోతున్నారని బీర్ల ఐలయ్య అన్నారు.



కార్మిక దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నిన్న నిజాలు మాట్లాడారని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని గత పదేళ్లలో అభివృద్ధి చేయలేదని అన్న కవిత మాటలను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు కవితకి తలసరి ఆదాయం గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కొండలు, గుట్టలు, వెంచర్లకు రైతు రైతుబంధు ఇచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ కులగణనలో పాల్గొనలేదని.. అప్పుడు కవితకి సామాజిక న్యాయం ఎందుకు గుర్తుకు రాలేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేసినప్పుడు కవిత ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నపుడు కవితకి ఏం గుర్తుకురాదని విమర్శించారు. అధికారం పోయాక సామాజిక న్యాయమని కవిత అంటు-న్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ పేదల నాయకుడని అభివర్ణించారు. ఇచ్చిన హామీలని ఒక్కొక్కటి అమలు చేస్తూ బీఆర్ఎస్ కంటే రేవంత్ ప్రభుత్వంలో మంచి పాలన అందిస్తున్నామని చెప్పారు. వరి ఏస్తే ఉరే అని చెప్పి కేసీఆర్ ఫాంహౌస్‌లో వరి పండిచినప్పుడు కవితకి రైతులు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్కడ ఎన్నికలు ఉంటే అక్కడ సంక్షేమ పథకాలు వచ్చేవని అన్నారు. గత పదేళ్లు ప్రశ్నించని కవిత తన పార్టీలో ప్రాధాన్యత తగ్గగానే ప్రశ్నించటం ప్రారంభించిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు.

# పాక్ ఆక్రమిత కాశ్మీర్ అప్రమత్తం

- యుద్ధం వస్తుందన్న భయంలో పాలకులు
- 2నెలలకు సరకులు సిద్ధం చేసుకోవాలని ఆదేశం

**న్యూఢిల్లీ,మే2( వెలుతురు):**

పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణ నెలకొన్న వేళ యుద్ధం తప్పదన్న ఆందోళన ఇరు దేశాల్లోనూ ఉంది. పాక్ ఇప్పటికే యుద్ధ సన్నద్ధతకు దిగింది. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు సూచనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఆహారం నిల్వ చేసుకోవాలంటూ స్థానికులను పీఓకే యంత్రాంగం అప్రమత్తం చేసింది. రెండు నెలలకు సరిపడా ఆహారాన్ని నిల్వ చేసుకోవాలని వాస్తవాధీన రేఖకు సమీపంలో ఉన్న 13 నియోజకవర్గాల ప్రజలకు సూచనలు చేశాం అని చౌద్రీ అన్వర్ ఉల్‌హక్ స్థానిక అసెంబ్లీలో శుక్రవారం వెల్లడించారు. అలాగే స్థానిక ప్రభుత్వం రూ.100 కోట్లతో ఎమర్జెన్సీ ఫండ్‌ను ఏర్పాటు- చేసింది. ఆహారం, ఔషధాలు, ఇతర కనీస అవసరాల సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకునేందుకు ఈ మొత్తాన్ని కేటాయించినట్లు- ఉల్‌హక్ తెలిపారు.స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలోనే దొంగదెబ్బతో పీఓకేను తన నియంత్రణలోకి తీసుకున్న పాకిస్థాన్- ఆ ప్రాంత అభివృద్ధిని గాలికొదిలేసింది. ఇండియాపై విద్రోహచర్యలకు పాల్పడేందుకు ఉపయోగపడే ప్రదేశంగానే పీఓకేను పాక్ చూస్తోంది. పీఓకే ప్రధానమంత్రి పీఠం అధిరోహించినవారు ఇస్లామాబాద్ సర్కారు చేతుల్లో కీలుబొమ్మగానే మిగిలిపోతున్నారు.



ఫలితంగా స్థానికుల హక్కులకు రక్షణ కరవవుతోంది. దివాళ అంచున ఉన్న పాకిస్థాన్‌ను స్థానిక తిరుగుబాట్లు-, వరుస ఉగ్రదాడులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ భారత్ అనుకూలవాదం వినిపిస్తోంది. భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ ఇటీవల మాట్లాడుతూ.. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. ఉగ్రవాదులను శిక్షించడానికి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే.. భారత్ కఠినంగా జవాబివ్వాలని కోరారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలా క్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేశారు. కశ్మీర్ వివాదంలో ఈ ఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని విశ్వాసం వ్యక్తంచేశారు.


## ఎసిబి కస్టడీకి మాజీ ఈఎన్‌సి హరిరామ్

- అవకతవకలపై కూపీ లాగనున్న ఎసిబి

**హైదరాబాద్,మే2( వెలుతురు):**

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అవకతవకల కేసులో చంచల్ గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఈఎన్‌సి భూక్య హరిరామ్ ను ఏసీబీ అధికారులు ఐదు రోజులకస్టడీకి తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు హరి రామ్‌ను ఏసీబీ అధికారులు విచారించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో హరి రామ్ కీలకంగా వ్యవహరించారు. ఆయనను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విధుల నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. కాలేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ చీఫ్ ఈఎన్‌సీ హరి రామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిసిన అనంతరం ఆయనను పోలీసులు జడ్జి ముందు ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో ఆయనను చంచల్ గూడ జైలుకు తరలించారు. సుమారు రూ. 200 కోట్లకుపైగా అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్లు- ఏసీబీ అధికారులు గుర్తించారు. హరి రామ్ ఇంటితోపాటు- ఏకకాలంలో బంధువుల ఇళ్లల్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏక కాలంలో 14 ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. గజ్వేల్‌లో భారీగా అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. మార్కుర్‌లో 28 ఎకరాల భూమి, కొండాపూర్ షేక్స్‌పేట్, శ్రీనగర్, మాదాపూర్ ప్రాంతాల్లో ఖరీదైన ఫ్లాట్లను ఏసీబీ అధికారులు గుర్తించారు. పటాన్ చెరువులో 20 గుంటల భూమి, ఆరెకరాల మామిడి తోట, ఫామ్ హౌస్‌ను గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ భూక్యా హరిరామ్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు అయిన విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల మార్పు వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని, ఇందులో హరిరామ్ కీలకపాత్ర షోషించారనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. మరోపక్క, కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ నివేదిక ఇటీవల వెలువడింది. ఈ నేపథ్యంలో హరిరామ్ ఇల్లు, జలసౌధ కార్యాలయం, హరిరామ్ బంధువులు, స్నేహితులకు సంబంధించిన ఇళ్లు సహా 14 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ సోదాల్లో ఏసీబీ అధికారులు కళ్లుచెదిరే ఆస్తులను గుర్తించారు. ఏసీబీ ప్రకటన ప్రకారం.. హరిరామ్‌కు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న మర్కూక్ మండలంలోనే 28 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వాణిజ్య స్థలం ఉంది. అంతేకాక, హైదరాబాద్‌లోని షేక్‌పేట్, కొండాపూర్‌లో విల్లాలు, మాదాపూర్, శ్రీనగర్‌కాలనీ, నార్సింగ్‌లో ఫ్లాట్లు- ఉన్నాయి. పటాన్‌చెరులో 20 గుంటల భూమి, శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ ఇళ్లు కూడా ఉన్నాయి.





# చేనేత కార్మికులకు త్రిఫ్ట్ పండు వెంటనే అమలు చేయాలి

- **చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చెరుకు సైదులు**



**మునుగోడు వెలుతురు మే 02:**
వృత్తి రక్షణ వృత్తిదారుల సంక్షేమం కి చర్యలు చేపట్టాలి చేనేత వృత్తి కార్మికులందరికీ జియో టాక్ నెంబర్ ఇచ్చి ట్రిఫ్ట ఫండ్ పథకం వర్తింప చేయాలని మునుగోడు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత పరిశ్రమ త్రీవ సంక్షోభానికి ఎదుర్కొంటుందన్నారు కార్మికులు ఉపాధి కూలిపోయి కష్టాన్ని దగ్గర ఆదాయం లభించక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు కొందరు వలస బాట పడితే మరికొందరు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు చేనేత ముడి సరుకులు రంగులు రసాయనాలు నూవులు పట్టుదల పెరగడంతో కార్మికులు ఉపాధి కరువైందని సహకార సంఘాల ద్వారా తయారుచేసిన బట్టలకు మార్కెట్లో సౌకర్యం లేక గుట్టలు గుట్టలుగా పేర్కొన్నని వివరించారు పేరుకుపోయిన బట్టల నిల్వను ప్రభుత్వం కొనుగోలు చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు నోరు సబ్సిడీ పథకం నగదు బదిలీ ద్వారా కార్మికునికి అనుబంధ కార్మికులకు నెలకు 3000 రూపాయల అకౌంట్లో జమ చేయాలన్నారు చేనేత సహకారాలు సంఘాల ఎన్నికల నిర్వహించి టెస్కోపాలకవర్గాన్ని ఏర్పాటు చేసి సంఘాలను బలోపేతం చేయాలని కోరారు చేనేత కార్మికులకు పెట్టుబడి సాయం కింద రాయితో కూడిన కొత్త రుణాలు ఐదు లక్షలు ఇవ్వాలని ఉపాధి కల్పన కోసం ప్రభుత్వ రంగ సంస్థలకు ఏకరూప దుస్తులు ఆర్డర్స్ ఇవ్వాలని కోరారు చేనేత కార్మికులు ఆరోగ్య పథకం వర్తింపజేయాలని హౌస్ కం వర్క్ షెడ్యూనిర్మానానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు చేనేత పరిశ్రమల కార్మికులు ఉపాధి సంక్షేమం కోసం చేనేత అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి దానికి ప్రత్యేకంగా రెండు వేల కోట్ల రూపాయలు బడ్జెట్లో నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

# డివిజన్ లో సమస్యలను, పనులను త్వరగా పూర్తి చేయాలి

- **కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్**



**హైదరాబాద్ వెలుతురు మే 02:**
శుక్రవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ డివిజన్ లోని హైదర్గూడా ముఖ్యమైన రహదారి పై ఉన్న వర్షపునీరు ఆగుతుండంతో ఆ సమస్యను వెంటనే దాన్ని పరిష్కరించేలా మున్సిపల్ అధికారులతో మాట్లాడి పైప్ లైన్ లో ఏర్పరచడం జరుగుతుంది అదే సమయంలో పరిష్కరించడానికి జలమండలి అధికారులకు కూడా పైప్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు అయితే ఈ రెండు డిపార్ట్మెంట్ల మధ్యలో సమావేశం ఎక్కువ పోవడంతో హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ అక్కడికి వెళ్లి హీరో డిపార్ట్మెంట్ అధికారులతో మాట్లాడే సమయంతో పని పూర్తి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ప్రవీణ్, ఏ ఈ పవన్, వర్క్ ఇన్స్పెక్టర్ రాము, జలమండలి అధిక మేనేజర్ ఉమామహేశ్వర్ మరియు శానిటేషన్ సిబ్బంది సుబ్బయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్ మహేష్ సందీప్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ నారాయణపూర్ మండలాలకు కృష్ణా జలాలు

- **శివన్నగూడెం రిజర్వాయర్ నుండి రెండు మండలాలకు కృష్ణ నీటిని తీసుకొచ్చే విధంగా ప్రణాళికలు**
- **నీటిపారుదల శాఖ సమీక్షలు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**



**మునుగోడు వెలుతురు మే 02:**
డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మునుగోడు నియోజకవర్గం లోని లక్ష్మాపురం శివన్న గూడెం రిజర్వాయర్లకు కొనసాగింపుగా నారాయణపూర్ చౌటుప్పల్ మండలాలకు నీరందించడానికి కావలసిన ప్రణాళికలు సాధ్యసాధ్యాల పై రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం సభ్యులు, ఇరిగేషన్ అధికారులతో మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చౌటుప్పల్ పట్టణం వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న సందర్భంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని జనాభాకు సరిపడా తాగునీరు అందించడంతోపాటు, నారాయణపూర్ చౌటుప్పల్ మండలాల్లోని చెరువులు కుంటలను నింపి భూగర్భ జలాలను రీఛార్జి చేసే విధంగా శివన్న గూడెం రిజర్వాయర్ నుండి నీటిని తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ రెండు మండలాలకు నీటిని తీసుకొచ్చే విషయంలో తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం సభ్యుల సలహాలు సూచనలు తీసుకున్నారు... నీటిని తీసుకురావడానికి ప్రణాళికలు, చేపట్టాల్సిన పనులపై సమీక్షలో చర్చించారు ఈ సమావేశంలో తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం సభ్యులు శ్యాం ప్రసాద్ రెడ్డి ఇంద్రసేనారెడ్డి చంద్రమౌళి సత్తిరెడ్డిలతో పాటు, గట్టుప్పల్ డిఈ సురేందర్ రెడ్డి, గట్టుప్పల్ ఏఈ భాగ్యలక్ష్మి లు పాల్గొన్నారు...

# రాచాల ఎఫెక్ట్... నూతన భవనంలోకి ప్రభుత్వ కళాశాల వసతి గృహం

- **రాచాలకు ధన్యవాదాలు తెలిపిన విద్యార్థులు**





**వనపర్తి వెలుతురు మే 02:**
వనపర్తి మండలం నాగవరం గ్రామంలోని రేకుల షెడ్డులో ఉన్న ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహాన్ని జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలోని భవనంలోకి మార్చారు. గత నెల ఏప్రిల్ నాలుగో తేదీన కళాశాల వసతి గృహాన్ని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ సందర్శించారు.దరేకుల షెడ్డులో విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకొని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. విద్యార్థుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని వెంటనే ప్రభుత్వ లేదా ప్రైవేటు భవనంలోకి కళాశాల వసతి గృహాన్ని తరలించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వసతి గృహం మార్పులో నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులతో కలిసి ఆందోళన చేపడుతామని ఆరోజు హెచ్చరించారు. దీంతో స్పందించిన కలెక్టర్ వనపర్తి పట్టణంలో భవనాలపై ఆరా తీసి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలో ఉన్న భవనాన్ని ప్రభుత్వ కళాశాల వసతి గృహంగా మార్చి ఏప్రిల్ 30 తారీఖున మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి గార్లకు ప్రారంభించారు. కళాశాల వసతి గృహ మార్పులు తెలుసుకున్న బీసీ పొలిటికల్ జేసి నాయకులు శుక్రవారం వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతంగా రాణించుటకు కృషి చేయాలని కోరారు. కళాశాలను నూతన భవనంలోకి మార్చినందుకు విద్యార్థులు రాచాల యుగంధర్ గౌడ్ కు ధన్యవాదాలు తెలిపారు. కళాశాలను సందర్శించిన వారిలో వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రాష్ట్ర కార్యదర్శి వెంకటన్న గౌడ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, అస్కని రమేష్, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్ తదితరులు ఉన్నారు



# మనసా వాచా కర్మణా కమిట్మెంట్ తో ప్రతి ఒక్కరు బాధ్యత గా పనిచేయాలి

*గ్రామాలు పరిశుభ్రంగా వుండే విదంగా, సరైన త్రాగు నీరు అందించే విదంగా, గ్రామ పంచాయతీ సమస్యలు పరిష్కరించే విదంగా ఇక్కడి నుండే మార్పు మొదలు కావాలి*

*క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా*

*ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామస్థాయిలో పనిచేసే సిబ్బందికి రెగ్యులర్గా జీతాలు వస్తున్నాయి*

*పంచాయతీ కార్యదర్శుల పని వేళలు ప్రాక్టికల్ గా ఉండాలి. మునుగోడు నియోజకవర్గంలో పనిచేసే ప్రతి పంచాయతీ కార్యదర్శి ఉదయం 9 గంటల నుండి 5 గంటల వరకు పనిచేయాలని నిర్ణయం*

*గ్రామాలలో చెత్త సేకరణ మురుగు కాలువలు నిర్వహణపై అసంతృప్తి, సరిగా చేయడం లేదంటూ అధికారులపై ఆగ్రహం*

*గ్రామాలలో అక్రమ నిర్మాణాలకు, అడ్డగోలుగా అనుమతులు ఇవ్వదు*

*తడి చెత్త పొడి చెత్త వేరు చేసే అంశాలకు సంబంధించి ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి కార్యక్రమాలు చేపట్టాలి*

*అందరి సహకారంతో బెల్ట్ షాపుల నిర్మూలన పై ఏ రకంగా ఉద్యమం చేసి తగ్గించామో, ప్లాస్టిక్ నిర్మూలన కు కూడా అందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు*

*నియోజకవర్గ వ్యాప్తంగా స్వచ్ఛ మునుగోడు కార్యక్రమాన్ని తీసుకొని డ్రైవ్ చేపట్టాలని నిర్ణయం*

*నియోజకవర్గ వ్యాప్తంగా ఏడు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దాలి*

*ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి, నిజమైన నిరుపేద లబ్ధిదారులను ఎంపిక చేయాలి*

*పంచాయతీ అధికారుల సమీక్ష సమావేశంలో మునుగోడు శాసనసభలు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి*



**మునుగోడు వెలుతురు మే 02:**
మునుగోడు నియోజకవర్గంలో గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలు వాటి పరిష్కారం, చెప్పటాల్సిన అభివృద్ధి పనులు, ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై నల్గొండ యాదాద్రి జిల్లాకు చెందిన డిపిఓలు డిఎల్పిఓలు, నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులు, మునుగోడు నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి మునుగోడు లోని అధికారిక క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి




గ్రామాలలో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయి మురుగు కాలువల నిర్వహణ సరిగా ఉండకపోవడం వల్ల దోమలు ఎక్కువై ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని పల్లెలు క్లీన్ గా ఉంచాల్సిన బాధ్యత గ్రామపంచాయతీ కార్యదర్శుల పైన ఉందన్నారు... మనిషి ఎక్కువగా అనారోగ్యం పాలు కావడానికి కారణం త్రాగునీరు సరిగా లేకపోవడం మురుగు కాలువల నిర్వహణ సరిగా లేకపోవడం అని, మురుగు కాలవల నిర్వాహనకు చెత్త సేకరణకు, త్రాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు... గ్రామాలలో త్రాగునీరు శానిటేషన్ ఈ రెండు బాగా చేస్తే ఎటువంటి సమస్య ఉండదన్నారు... గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా సరైన త్రాగునీరు అందించే విధంగా గ్రామ పంచాయతీల సమస్యలు పరిష్కరించే విధంగా ఇక్కడి నుండి మార్పు మొదలు కావాలన్నారు... మనసా వాచా కర్మణా ప్రతి ఒక్కరం కమిట్మెంట్తో పని చేస్తేనే ఇది సాధ్యమవుతుందన్నారు... కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను సావధానంగా విన్న గౌరవ శాసనసభ్యులు ఆ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వంతో మాట్లాడతామని హామీ ఇచ్చారు... గ్రామాలలో నెలకొన్న సమస్యలపై నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముఖ్య నాయకులు తమ అభిప్రాయాలు తెలిపారు... క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని... అదేవిధంగా చెత్త సేకరణ శానిటేషన్ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని రాజగోపాల్ రెడ్డి గారి దృష్టికి తీసుకొచ్చారు... గ్రామపంచాయతీలో చేపట్టే అక్రమ నిర్మాణాలకు పంచాయతీ కార్యదర్శులు అడ్డగోలుగా అనుమతులు ఇవ్వద్దని సూచన చేశారు... మునుగోడు నియోజకవర్గం లోని ఏడు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దాలని త్వరలోనే మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా స్వచ్ఛ మునుగోడు కార్యక్రమాన్ని తీసుకొని స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఈ సమీక్షలో నిర్ణయించారు... చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధంగా ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు... మునుగోడు లో బెల్ట్ షాపుల నిర్మూలనకు ప్రతి ఒక్కరం ఏ రకంగా నైతే ఉద్యమం చేసి వాటిని నిర్మూలించమో అదేవిధంగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరం కంకణ బద్ధులై పనిచేయాలని కోరారు... గ్రామపంచాయతీ విస్తీర్ణాన్ని బట్టి ఆ విస్తీర్ణంలో 10 శాతం చెట్లను పెంచే విధంగా ముందు ముందు ప్రణాళికలు చేపట్టాలన్నారు.... ఈ సమీక్ష సమావేశంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముఖ్య నేతలు, యాదాద్రి నల్గొండ జిల్లాల డిపిఓ లు, డి ఎల్ పి ఓ లు, ఎంపీడీవోలు, ఎంపిఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు....

# నాకు ఇల్లు మంజూరు చేయండి

- **ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి పుల్లెంల గ్రామ నివాసి పూలే సురేష్ వినతి**
- **చండూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో 7 నుండి 10 ఎకరాల భూమి ఉండి, స్లాప్ ఇండ్లు ఉన్న ఇందిరమ్మ పథకంలో ఇండ్లు**
- **అన్ని అర్హతలున్నా బిజెపి కార్యకర్త అయినందుకు రిజెక్ట్ చేశారు అని సమాచారం**
- **తనకి గ్రామంలో 4 గుంటల భూమి మాత్రమే ఉన్నది**

**చండూరు వెలుతురు మే 02:**
ఇందిరమ్మ హౌసింగ్ పథకం కింద ఇల్లు మంజూరు చేయకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తూ నల్గొండ జిల్లా చందూర్ మండలం పుల్లెంల గ్రామ నివాసి పోలే సురేశ్ శుక్రవారం రోజున మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. లేఖలో పేర్కొన్న అంశాలు ఏమిటంటే నేను ఒక దళిత పేద కుటుంబానికి చెందినవాణ్ని. నా కుటుంబం చాలా సంవత్సరాలుగా చాలా కష్టాల్లో జీవిస్తున్నది. నాకు 4 గుంటల వ్యవసాయ భూమి కలదు. ఇప్పటికీ మేము కచ్చితమైన గృహంలేకుండా నివసిస్తున్నాము. ప్రతి సంవత్సరం వర్షాకాలం వస్తే మా పరిస్థితి మరింత దయనీయంగా మారుతుంది. వర్షం పడే ప్రతీసారీ మా గుడిసె లోపల నీరు వర్షంలా ప్రవహిస్తుంది. పిల్లలతో కలిసి ఒక మూలకు కూర్చోవడం కష్టంగా మారింది. రాత్రిళ్లు నిద్ర లేకుండా గడిపిన రోజులెన్నో. కరెంట్ షార్ట్ సర్క్యూట్ అవుతుందేమో అనే భయం. ఇలాంటి పరిస్థితుల్లో మాకు ఒక చిన్న ఇంటి అవసరం అత్యవసరమైంది. ఈ నేపథ్యంలోనే నేను ఇందిరమ్మ హౌసింగ్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నాను. నా అర్హతలు ఉన్నప్పటికీ నాకు ఇల్లు మంజూరు కాలేదు. ఇది నాకు ఎంతో బాధ కలిగించింది. ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇచ్చే చిన్న గృహం కూడా నాకు దక్కకపోవడం నా ఆకాంక్షలకు ఘాతుకంగా మారింది. మీరు మా నియోజకవర్గ ప్రజల పక్షాన నిలిచే నాయకుడిగా నా సమస్యను దయచేసి పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి నాకు ఇల్లు మంజూరవ్వేలా సహాయం చేయమని ప్రార్థిస్తున్నాను. మీ సహకారం నాకు ఒక నూతన జీవితం అవుతుందని, దయచేసి ఈ విషయంలో నాకు న్యాయం చేసి, ఇల్లును మంజూరు చేయాలని పోలే సురేష్ వినతి పత్రంలో కోరారు.



# బయ్యారంలో ఈదుగాలులకు నేలకొరిగిన చెట్లు

- **మామిడి పంట నేలరాలడంతో రైతన్నల ఆవేదన**

**ఖమ్మం,మే2( వెలుతురు):**
ఈదురు గాలులతో కూడిన వర్షం బయ్యారంలో శుక్రవారం తెల్లవారుజామున బీభత్సాన్ని సృష్టించింది. రెండు గంటల పాటు ఈదురు గాలులు, రాళ్లతో కురిసిన వర్షం ప్రజలను అతలాకుతలం చేసింది. గాలుల కారణంగా మండలంలోని కొత్తపేట, బయ్యారం, బాలాజీ పేట, వెంకట్రాంపురం, జగ్గు తండా, బంజర తండా, నామలపాడు, నర్సాతండా ఉప్పలపాడు, మిర్యాల పెంట కంబాలపల్లి, కాచనపల్లివంటి గ్రామాల్లో పెద్ద పెద్ద చెట్లు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో ఇండ్లపై కప్పులు , రేకులు గాలికి కొట్టుకుపోయాయి. ఇల్లందు- మహబూబాబాద్ జాతీయ రహదారి బయ్యారం శివారులో చెట్టు- రహదారిపై పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొత్తపేట, ఉప్పలపాడు, బయ్యారం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది.

రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతోనే నష్టపోయామని రైతులు వాపోయారు. ధాన్యం భద్రపరచుకునేందుకు పట్టాలు కప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందారు. విపరీతమైన గాలి కారణంగా మామిడికాయలు రాలిపోవడంతో కౌలు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.రంగాపురం ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న 150 ఏళ్ల మర్రి వృక్షం వేర్లతో సహా కూలిపోగా, బయ్యారంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పురాతన మర్రిచెట్టు- కొమ్మలు విరిగిపడ్డాయి. పలుచోట్ల స్తంభాలు, వైర్లు విరిగిపోవడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యుత్ పునరుద్ధరణకు ట్రాన్స్కో సిబ్బంది మరమ్మతులు ప్రారంభించారు. వర్షం కారణంగా జరిగిన నష్టాన్ని తహసిల్దార్ విజయ, సీఐ రవికుమార్, ఎస్ఐ తిరుపతి పర్యవేక్షించారు.

# విశ్వంలోనే మొట్టమొదటి పాత్రికేయుడు, ఖగోళ జర్నలిస్ట్ నారద మహర్షి....

- ప్రభుత్వం తర్వాత అత్యంత శక్తివంతమైన స్థానంలో మీడియా రంగం, పాత్రికేయులు....
- సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర కీలకం..
- తెలంగాణప్రాంత గ్రామ వికాస ప్రముఖ్ జిన్నా సత్యనారాయణరెడ్డి.

**కరీంనగర్ వెలుతురు మే 02:**
ముల్లోకాలు సంచరించి లోకకళ్యాణం కోసం సమాచార రంగాన్ని వికసింపజేసిన మొట్టమొదటి పాత్రికేయుడు, ఖగోళ జర్నలిస్ట్ నారద మహర్షి అని తెలంగాణ ప్రాంత గ్రామ వికాస ప్రముఖ్ జిన్నా సత్యనారాయణరెడ్డి తెలిపారు. సమాచార భారతి కరీనగర్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున పట్టణంలోని వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాలలో దేవర్షి నారద జయంతి (జర్నలిస్ట్ దినోత్సవం) వేడుకను నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ నారద మహర్షి విశ్వంలోని అన్ని లోకాలు సంచరించి అక్కడి మాటలు ఇక్కడా, ఇక్కడి మాటలు అక్కడ చేరవేయడమే ప్రవృత్తిగా ధర్మరక్షణ, సమాజ సంక్షేమం , లోక కళ్యాణం కోసం సమాచార రంగాన్ని వికసింపజేశారని పేర్కొన్నారు. విశ్వమంతట సమాచారాన్ని ప్రసారం చేసిన మొట్టమొదటి కమ్యూనికేటర్ , దివ్య జర్నలిస్ట్ నారద మహర్షి యేనన్నారు. నారద మహర్షిని మొట్టమొదటి పాత్రికేయుడుగా పరిగణిస్తూ ప్రతి సంవత్సరం నారద జయంతిని ప్రపంచ పాత్రికేయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. సమాచార భారతి ఆధ్వర్యంలో నారద మహర్షి యొక్క ప్రాముఖ్యత, పాత్రికేయ రంగం యొక్క పాత్ర, జాతీయవాద అవగాహన గురించి తెలియజేయడానికి ప్రతి ఏటా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశ నిర్మాణంలో పత్రికా రంగానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉందని, ప్రజాస్వామ్యంలో మీడియా రంగానికి నాలుగో స్తంభం అనే




ఒక విశిష్ట గుర్తింపు ఉందన్నారు. ప్రభుత్వం తర్వాత అత్యంత శక్తివంతమైన స్థానం మీడియా రంగం , పాత్రికేయులకే దక్కుతుందన్నారు. ముఖ్యంగా పత్రికా రంగంలో పని చేసేవారు సమాజ బాధ్యత, జాతీయ భావాలు కలిగి ఉండడం అత్యంత అవసరమని చెప్పారు. వృత్తి నిబద్ధతతో, ఆత్మవిశ్వాసంతో పని చేసే పాత్రికేయుల ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. వేగంగా మార్పు చెందుతున్న ప్రస్తుత మీడియా రంగంలో సామాజిక విలువలు, విశ్వాసం, నిబద్ధత తో ఉన్న పాత్రికేయులకు సమాచార వ్యవస్థలకు సంస్థలకు, దేశ హితం కోరే వార్తలకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. నిరంతరం లోకసంచారం చేస్తూ ఆయా ప్రాంత విశేషాలను అందరికీ తెలుపుతూ ఏమైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి ఎవరి ద్వారా పరిష్కరించవచ్చు వాళ్ళ దృష్టికి తీసుకు వెళ్తూ సమాజాన్ని సన్మార్గంలో నడిపిన దేవర్షి నారదుడి లాగే సమాజ హితం కోసం నేటి పాత్రికేయులు పనిచేసి, మీడియా శక్తిని చాటి చెప్పాలన్నారు. సత్యం, కచ్చితత్వం, నిస్పాక్షికత అనేవి జర్నలిజం నీతికి మూల స్తంభాలుగా నిలుస్తాయన్నారు. ఆ దిశలో సమాజ శ్రేయస్సు కోసం పాత్రికేయ రంగాన్ని సేవా మార్గంగా ఎంచుకొని తమ రచనలు, వ్యాఖ్యానాల ద్వారా ప్రజల్లో , సమాజంలో చైతన్యం కోసం నిత్యం కృషి చేస్తున్న పాత్రికేయులు చరిత్రలో నిలిచిపోతారన్నారు. సమాజ హితం కోసం చేసే రచనలు పెరగాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో కీలకపాత్ర సమాచార రంగానిదేనిని , అలాంటి సమాచార వ్యవస్థలో పనిచేస్తున్న పాత్రికేయులందరూ గొప్ప వారన్నారు. ఇట్టి సమావేశంలో ఆర్ఎస్ఎస్ బాధ్యులు పాక సత్యనారాయణ, తడగొప్పుల శంకరయ్య , గీకూరి శ్రీనివాస్, సమాచార భారతి బాధ్యులు వేణుగోపాల్ , విమల్, పైడిపల్లి శ్రీనివాస్, ఓదెల మల్లికార్జున్ నాతోపాటు కరీంనగర్ జిల్లా వివిధ పత్రికల రిపోర్టర్లు, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా , యూట్యూబ్ స్టాఫ్ రిపోర్టర్లు , కెమెరామెన్లు తదితరులు పాల్గొన్నారు.



## రూ. 5 లక్షల నిధులతో సీసీ రోడ్ల పనులు ప్రారంభం

- పనులు ప్రారంభించిన మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ...



**జహీరాబాద్ వెలుతురు మే 02:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం మల్చేల్మా గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే సహకారం తో రూ. 5 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను జహీరాబాద్ శాసన సభ్యులు కోనింటి మాణిక్ రావు ఆదేశాల మేరకు గ్రామస్థుల కోరిక మేరకు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఇప్పేపల్లి పిఏసిఎస్ చైర్మన్ మచ్చేందర్, మండల గ్రామ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తో కలిసి ప్రారంభించారు. ఈ సంధర్భంగా గ్రామ నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే మాణిక్ రావుకి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు ఆనందం మాజీ ఎంపీటీసీ లు ఇస్మాయిల్, మోయిన్, రాములు, ప్రేమ్ సింగ్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు వహీద్ అలీ, మండల బిసి సెల్ అధ్యక్షులు అమిత్ కుమార్, మండల యూత్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచులు చిన్నారెడ్డి, నాయకులు గోరెప్ప, భీమ్ రావ్, దత్తు రెడ్డి, మోహన్ రాథోడ్, శ్రీకాంత్, పిజి శంకర్, యేసు, శ్రీనివాస్, పాపన్న, ఖయ్యుమ్, నసీర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

## భారత ప్రధాని నరేంద్ర మోడీ గారికి పాలాభిషేకం చేసిన మునుగోడు బిజెపి నాయకులు



**మునుగోడు వెలుతురు మే 02:**
భారత ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో దేశంలో జనగణన తో పాటు కులగణన కూడ చేపట్టడం పట్ల మునుగోడు మండల కేంద్రంలో బిజెపి మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ గారికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మాదగోని నరేందర్ గౌడ్. బిజెపి సీనియర్ నాయకులు బొల్గురి రమేష్. పందుల నర్సంహ్మా. నీరుడు రాజారాం. మాజీ మెనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎం. డి మాజీద్. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అక్కెనపల్లి సతీష్. మండల కార్యవర్గ సభ్యులు దాం విష్ణు. దళిత మోర్చా మండల అధ్యక్షులు పందుల యాదయ్య. జక్కల కృష్ణ. పోలే వెంకటేశ్వర్లు. పిట్టల రాములు. బొజ్జ రాములు. తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక నిబంధనలకు విరుద్ధం

- మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం..



**జహీరాబాద్ వెలుతురు మే 02:**
ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జరిగిన తీరును పరిశీలిస్తే నిబంధనలకు విరుద్ధంగా ఉందని మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ వై. నరోత్తం ఆరోపించారు. వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు నియోజకవర్గానికి సుమారు 3500 వరకు మంజూరైనా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంతకు ముందు ప్రభుత్వం నుండి లబ్ధిపొందిన వారు కాకుండా, ఇల్లు లేని వారికి, స్వంత ప్లాటు ఉండి ఇల్లు కట్టే స్థోమత లేని వారికి, దివ్యా0గులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు, అనాదలకు, పాకిపని వారికి, మొదటి ప్రాధాన్యత ఇచ్చి గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాల్సి ఉంది కానీ ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జరిగిన తీరును పరిశీలిస్తే నిబంధనలకు విరుద్ధంగా ఇండ్లు ఉన్న వారికి, ఇంతకు ముందు లబ్ధిపొందిన వారికి కేటాయించినట్లు తెలుస్తున్నది. ఈ ఇండ్లకు ప్రభుత్వం ఇచ్చేది కేవలం 5 లక్షలు మాత్రమే దానికి అధికారులు వారు ఇచ్చిన ప్లాను ప్రకారం కట్టాలని నిర్బంధం చేస్తున్నారు వారు ఇచ్చిన ప్లాను ప్రకారం కట్టితే 2రేట్లు అధిక వ్యయం అయ్యే అవకాశం ఉంది మిగతా డబ్బులు వారు ఎక్కడి నుండి తేవాలి వారు ముందే బీదవారు ఇల్లు కట్టలేని పస్థితిలో ఉన్నప్పుడు ఈ అధిక వ్యయం ఎక్కడినుండి తేవాలి అదనపు భారం కొరకు తప్పని సరి అప్పులు చేయాల్సిన పరిస్థితి అంటే ఇండ్లు పొందిన వారు అప్పుల పాలు కావల్సిందేన కాబట్టి ప్రభుత్వం, అధికారులు కేవలం నాయకులు చెప్పిన వారికి కాకుండా నిబంధనల ప్రకారం అర్హులైన వారికి మాత్రమే కేటాయించాలని, ప్రభుత్వం ఇచ్చే డబ్బులకు సరిపడే విధంగా ఇంటి ప్లాన్ కుదించాలని, ఆపై ఇల్లు కట్టు కుంటే లబ్ధిదారుల ఇష్టానికి వదలాలని డిమాండ్. ఈ కార్యక్రమంలో నాయకులు జి. నర్శింలు, యస్. గోపాల్ పాల్గొన్నారు

## క్లాస్మేట్ కుమార్తె వివాహ మహోత్సవ వేడుకకు హాజరైన మిత్ర బృందం

- పట్టు వస్త్రాలు బహుకరించిన సమ్మిగౌడ్..

**తొర్రూరు వెలుతురు మే 02:**
తొర్రూరు మండలం మొరిపిరాల గ్రామానికి చెందిన తోటి క్లాస్మెట్ పెందోట నాగమణి-శ్రీనివాస్ ల కుమార్తె యశశ్విక వివాహం పెళ్లి కుమారుడు మణికంఠా చారి తో శు క్రవారం తొర్రూరు మండలం నాంచారి మాడూరు లోని నవోదయ హై స్కూల్ ఎదురుగా ఉన్న రెడ్డి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో వివాహం జరగగా సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం నిండు నూరేళు చల్లగా ఉండేట్లు ఆ దేవుడి ఆశీస్సులు వారికి మెండుగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ



నూతన దంపతులతో పాటు వారి కుటుంబానికి నూతన పట్టు వస్త్రాలు బహుకరించారు.. ఈ కార్యక్రమంలో క్లాస్మేట్ కుమార్తె వివాహ మహోత్సవ వేడుకకు హాజరైన మిత్రులు సమ్మి గౌడ్ తో పాటు గిరిక సురేష్, కన్నయ్య, సాయి, నాగరాజు సుమలత, మంజుల తదితరులు ఉన్నారు..

## భర్త చనిపోయి నాలుగు సంవత్సరాలైనా పింఛన్ అందించని ప్రభుత్వం

- తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహ
- తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మీర్జా ఫజల్ బేగ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 2**
సిరిపురం గ్రామానికి చెందినటువంటి అప్పం అర్చన కడు బీదరాలు. భర్త అప్పం రామకృష్ణ, చనిపోయి నాలుగు సంవత్సరాలు అయినది. అర్చన కి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అర్చన వయసు 34 సంవత్సరాలు. అత్తగారింటి పరిస్థితి అంతంత మాత్రమే. ప్రస్తుతం అమ్మ ఇంట్లో ఉంటున్నది. వితంతు పెన్షన్ గూర్చి పలుమార్లు విన్నవించుకున్న ఇప్పటికీ పెన్షన్ రాలేదు. వారికి బ్రతుకు భారంగా మారినది. తన బాధను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడానికి గత సోమవారం ఏప్రిల్ 28 రోజున గ్రీవెన్స్ డే సందర్భంగా విన్నవించుకోవడానికి కలెక్టరేట్ కు పోయినది. కనీసం అక్కడ అర్చన వినతి పత్రం స్వీకరించలేదు. అందరికి వచ్చినప్పుడు నీకు వస్తాయి వెళ్ళిపొమ్మని చెప్పారట. క్షేత్రస్థాయిలో అకస్మాత్తుగా ప్రజల సమస్యలు పరిశీలనలు చేసి సమస్యలు పరిష్కారం చేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా ఒక మంచి కలెక్టర్ ని కలిగివున్న, సందర్భంలోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం చాలా బాధాకరం. అని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహ అన్నారు. అర్చన విషయంలో మరియు అర్చన లాంటి అన్ని గ్రామాల్లో కూడా ఉన్నటువంటి ఇలాంటి వారికి వెంటనే పెన్షన్ మంజూరు చేసి వారిని ఆదుకోవాలని. భర్త చనిపోయి సంవత్సరాలు గడుస్తున్నా, ఆ భర్త పెన్షన్ భార్యకు మార్చిడి కాక చాలామంది కుటుంబాలలో నిరాదరణకు గురి అయ్యి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త పెన్షన్లు మంజూరు ఇప్పిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మీ యొక్క కార్యక్రమంలో రామన్నపేట తెలుగుదేశం పార్టీ మండల బాధ్యులు మిర్జా ఫజల్ బేగ్, తెలుగుదేశం పార్టీ రామన్నపేట బీసీ సెల్ మండల అధ్యక్షులు పున్న వెంకటేశం, చేనేత నాయకులు గోషిక చక్రపాణి, తెలుగుదేశం పార్టీ రామన్నపేట మండల అధికార ప్రతినిధి బత్తుల సత్యం మూడుదుడ్ల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట ప్రభుత్వ అధికారులకు గ్రామ ప్రజలకు నా యొక్క విజ్ఞప్తి



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 2**
నేను అనగా కూనూరు కలమ్మ w అంజయ్య నివాసం భోగారం రామన్నపేట మండలం యాదాద్రి భువనగిరి జిల్లా వాస్తవ్యులు నేను నిరుపేద కుటుంబానికి చెందిన గౌడ్ కులస్తులం నేను నా భర్త ఇద్దరం వికలాంగులు మాకు ఇద్దరు ఆడపిల్లలు మేము రోడ్డు మీద రేకుల షెడ్డు వేసుకొని ఉంటున్నాము సొంత ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాము కావున దయచేసి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయవలసిందిగా ప్రభుత్వ అధికారులను గ్రామం ప్రజలని వేడుకుంటున్నాము. ఇట్లు కునూరు కలమ్మ w అంజయ్య, గ్రామ బోగారం మానసిక వికలాంగులను నా యొక్క ఆవేదన.

## కేంద్ర క్యాబినెట్ లో కులగణన జనగణన ఆమోదం చేసినందుకు ప్రధాని నరేంద్ర మోడీ గారి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీజేపీ నాయకులు



**మనోహరాబాద్ వెలుతురు మే 02:**
60 ఏళ్ల పాలనలో ఏనాడు కాంగ్రెస్ దేశంలో కుల గణన చేపట్టలేదు బీసీల హక్కులను కాలరాయడం బీసీల హక్కులను అణిచివేయడం బీసీల రిజర్వేషన్లు అనిచివేయడమే కాంగ్రెస్ చరిత్ర, కానీ నరేంద్ర మోడీ గారి ప్రభుత్వం కేంద్ర క్యాబినెట్ లో కులగణన జనగణన ఆమోదం చేసినందుకు గౌరవ శ్రీ నరేంద్ర మోడీ గారి చిత్రపటానికి మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం మేజర్ గ్రామ పంచాయతీ కాళ్లకల్ గ్రామంలో రాష్ట్ర సర్పంచ్ ల ఫోరమ్ మాజీ ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు నరేందర్ చారి, బీజేపీ గ్రామ అధ్యక్షులు కొత్తూరి మల్లేష్, గ్రామ బూత్ ఈరక్క గోపాల్గారు, మండల నాయకులు ఎర్ర కృష్ణ, కరాటే మల్లేష్, వీరబోయిన నాగేందర్, మామిండ్ల ప్రణయ్, వెంకటోల్ల హరిబాబు గౌడ్, ఏల్ .శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## షాదీఖానా భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

- ఎంఐఎం మండల అధ్యక్షుడు షేక్ రబ్బాని....



**జహీరాబాద్ వెలుతురు మే 02:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండల కేంద్రంలోని షాదీఖానా భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఐఎం మండల అధ్యక్షుడు షేక్ రబ్బాని కోరారు. మంగళవారం పెండింగ్‌లో ఉన్న షాదీఖానా భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... షాదీఖానా నూతన భవన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు జహీరాబాద్ ఎమ్మెల్యే కోట నుండి 20 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా షాదీఖానా పనులు పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. కక్ష పూరితంగానే గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులను అధికార పార్టీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. షాదీఖానా పనులు పూర్తి కాకపోవడంతో ముస్లింలు పెళ్లిలు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు.

## జహీరాబాద్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో భావన రుషి జయంతి

**జహీరాబాద్ వెలుతురు మే 02:**
భావన ఋషిజయంతి సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ మందిరం నందు వేణుభట్ పంతులు ఆధ్వర్యంలో దండి విట్టల్ దంపతులచే రుద్రాభిషేకం నిర్వహించినారు. వైశాఖ శుద్ధ పంచమి నాడు భక్త మార్కండేయులు ధూమ్రావతి దంపతులు యజ్ఞము చేయుచుండగా ఆ యజ్ఞమునందు భావనాముని ఐదు మంత్రములచే హెూమ కు కుండంబునజన్మించెను. కనుక పంచ వటియను నామమున ముల్లోకముల పేరు నొందెను. ఇదియును గాక వేద పారాయణం చేయుచు జన్మించినందున దేవతలు ఋషులందరును మార్కండేయులు వేద శీర్ష%శీ%డను నామంబు చేసిరి సమస్త వేద విజ్ఞానము తన భావమందు ఉండినందున భావనారాయణయుడనియు పేరిడిరి, శ్రీమన్నారాయణని అంశమున జన్మించిన వాడుగా ఉండి సమస్త విద్యలు తెలిసి సర్వులకు చెప్పువాడుగా ఉండి సప్త ఋషుల ద్వారా తన తండ్రి అయిన మార్కండేయుని ద్వారా విద్యలు విలువిద్యలు, మాయోపాయమైన విద్యలు బ్రహ్మవిద్యయు కూడా నభ్యసించిన వాడై యుండి భావనారాయణుడనే నామంతో దినదినమున ప్రవర్తన శు



క్లపక్ష చంద్రుని దిక్కరించినట్లు భావనారాయణడు 16 సంవత్సరముల వాడై 14 లోకములకు ప్రకాశముగా వెలుగొందిచుండెను ఈశ్వరుని ఆజ్ఞతో సూర్యపుత్రిక యొక్క భద్రావతి తో భావనాముని వివాహము జరిగినది దేవతల ఆజ్ఞతో అడవులకు భార్య సమేతముగా పులుల మందతో వెళ్ళుచుండగా కాలువాసురుడను రాక్షసుడు చూసి అడ్డగించారు అప్పుడు భావనముని ఆ రాక్షసునితో యుద్ధము చేసి సంవరించేను. రాక్షసుల సంవాహరము తెలిసి దేవతలు జయ జయ ద్వనులతో బేరి నాదములు చేసి పుష్ప వర్షములు కురిపించిరి.

ఈ ప్రకారముగా ప్రపంచమునకు ప్రాణముల భయము పోగొట్టి మాన రక్షణ చేసి దేవతలందరితో బిరుదు పొంది ఆనందకరముగా కనకాద్రి పట్టణమున భార్యాభర్తలు అన్యోన్యంగా సంసారం చేయుచుండిరీ. సంసారము చేయుచుండగా కొన్ని దినములకు ఏ కొత్తర శత పుత్రులు కలిగి కనకాద్రి పట్టణమున ఆనందదాయకముగా మానరక్షణకు వస్త్రములు తయారు చేయుచు సమస్త దేవతలకు ఇచ్చుచుండగా దేవతలందరూ సంతోషించి నారాయణుని హృదయ పద్మము నుండి తంతువులు తీసి శాలువాలు తయారు చేయువారు గాన వీరికి పద్మశాలీయులని నామకరణము చేసిరి. ఈనాటి అభిషేక కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గద్దం జనార్దన్ గారు సగ్గంవిట్టల్, గద్దె వెంకటేశం, కొడపాక నాగరాజు, గాజుల రామలింగం కుల బాంధవులు పందాల్ ప్రభు, గద్దం గోపాల్, ఎల్గొండ వెంకటేశం, నీలి రాజేష్ తదితరులు పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

## ప్రధానికి స్వాగతం పలకడం అదృష్టం -నాగబాబు



**అమరావతి,మే2( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో కొత్త అధ్యాయాన్ని లిఖించేందుకు, ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులను పునః ప్రారంభించేందుకు రాష్ట్రానికి విచ్చేసిన గౌరవ భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారికి స్వాగతం పలకడం నా జీవితంలో ఒక గొప్ప అనుభూతి అని ఎమ్మెల్సీ, జనసేన నేత నాగబాబు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ గారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున, రాష్ట్ర ప్రజల తరపున మరొక్కమారు కృతజ్ఞతాపూర్వక స్వాగతం పలకడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. దేశం శ్రేయస్సు కోసం తన వయసును కూడా లెక్క చేయకుండా ఆయన పని చేస్తోన్న తీరు మనందరికీ స్ఫూర్తిదాయకం. అన్నారు. మానసికంగా శారీరకంగా ఒత్తిడికి గురవుతున్నప్పటికీ ప్రజా సంక్షేమం కోసం అంకితభావంతో పని చేస్తోన్న ప్రధాని నరేంద్ర మోదీకి ఎల్లవేళలా సంపూర్ణ ఆరోగ్యం, ఆయుష్షు లభించాలని ఆశిస్తున్నట్లు నాగబాబు వెల్లడించారు.

## మరోమారు ప్రత్యేకత చాటుకున్న ఎంపి కలిశెట్టి

- సైకిల్‌పై అమరావతి ప్రాంగణానికి రాక

**అమరావతి,మే2( వెలుతురు):**
విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఇంద్రకీలాద్రి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం పసుపు రంగు సైకిల్ మీద 'సైకిల్ యాత్రగా' అమరావతి సభా ప్రాంగణానికి బయలుదేరారు. రైతుకు నిదర్శనగా, తెలుగుదేశం పార్టీకి నిదర్శనగా సైకిల్ యాత్ర చేసుకుంటూ ఎంపీ కలిశెట్టి సభా ప్రాంగణానికి బయలుదేరారు. ఒక ఎంపీగా, నగర పౌరుడుగా, రైతుబిడ్డగా, తెలుగుదేశం పార్టీలో ఎంపీగా ఉన్నందుకు గర్విస్తున్నాను అని అన్నారు. రాజధాని అమరావతి ప్రపంచంలోనే కీలకపాత్ర పోషిస్తుందని ఎంపీ కలిశెట్టి చెప్పుకొచ్చారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మీడియాతో మాట్లాడుతూ... 'వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా మూడు ముక్కలాట ఆడింది. మన రాజధాని ఏదో చెప్పుకోలేని పరిస్థితికి తీసుకువచ్చాడు వైఎస్ జగన్. మళ్లీ అమరావతికి పునర్ వైభవం వచ్చింది. రాజధానిలో అభివృద్ధి పనులు శరవేగంగా రూపొందుతున్నాయి. అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ప్రధాని మోడీ రావడం శుభపరిణామం. విజయనగరంలో ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ నిర్మాణం, పలు నిర్మాణ పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయి. ఒక ఎంపీగా, నగర పౌరుడుగా, రైతుబిడ్డగా, తెలుగుదేశం పార్టీలో ఎంపీగా ఉన్నందుకు గర్విస్తున్నాను' అని చెప్పారు.

## రాజకీయాలకు బుట్టా గుడ్ బై



**కర్నూలు, మే 2, ( వెలుతురు)**
వ్యాపార రంగంలో ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. పారిశ్రామిక, వ్యాపార రంగాల నుంచి రాజకీయాల వైపు వచ్చినవారు చాలా అప్రమత్తంగా ఉంటారు. పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారు. లేకుంటే ఇబ్బందులు తప్పవని వారికి తెలుసు. అయితే ఈ విషయంలో మూల్యం చెల్లించుకున్నారు మాజీ ఎంపీ బుట్టా రేణుక. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన రేణుక 2014 ఎన్నికల్లో కర్నూలు ఎంపీగా గెలిచారు. అత్యంత సీనియర్ నేతగా ఉన్న కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ని ఓడించి లోక్ సభలో అడుగుపెట్టారు. అటు తరువాత రాజకీయంగా తీసుకున్న నిర్ణయాలు ఆమె పాలిట శాపంగా మారాయి. 2014లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం గౌరవప్రదమైన స్థానాలను తెచ్చుకొని ప్రతిపక్షంగా ఉంది. బుట్టా రేణుక ఎంపీగా గెలిచి పార్లమెంట్లో అడుగుపెట్టారు. విద్యాధికురాలిగా, వ్యాపారవేత్తగా బహుముఖంగా గుర్తింపు పొందారు రేణుక. అయితే 2018లో ఆమె టిడిపిలో చేరాలని నిర్ణయించుకున్నారు. అక్కడ నుంచి ఆమె కౌంట్ డౌన్ మొదలైంది. తెలుగుదేశం పార్టీలో చేరినా.. ఆమెకు కోరుకున్న సీటు దక్కలేదు. కనీసం ఎక్కడా సర్దుబాటు కూడా చేయలేదు. దీంతో టీడీపీలోకి వచ్చినట్టే వచ్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి వెళ్ళిపోయారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకొనసాగి ఉంటే 2019లో సైతం ఆమెకే కర్నూలు పార్లమెంట్ టికెట్ ఇచ్చేవారు. టిడిపిలోకి వెళ్లి తిరిగి రావడంతో ఆమెకు టికెట్ నిరాకరించారు జగన్మోహన్ రెడ్డి. 2019 నుంచి 2024 మధ్య ఆమె పార్టీకి తన సమయాన్ని కేటాయించాల్సి వచ్చింది. అయితే అధినేతను ఎలాగోలా ఒప్పించి 2019లో ఎమ్మిగనూరు అసెంబ్లీ టికెట్ ఇప్పించుకున్నారు రేణుక. సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని తప్పించి మరి జగన్ ఆమెకు టికెట్ ఇచ్చారు. బీసీ తారక మంత్రం పనిచేస్తుందని భావించారు. కానీ కూటమి ప్రభంజనంలో బుట్టా రేణుక ఓడిపోయారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి రూపంలో ఆమెకు వ్యతిరేక వర్గం ఉంది. మొన్నటి ఎన్నికల్లో ఆ వర్గం వ్యతిరేకించింది. ప్రస్తుతం కూడా వ్యతిరేకిస్తూనే ఉంది. ఇంకోవైపు వ్యాపారంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆమె ఆస్తులు వేలానికి సిద్ధంగా ఉన్నాయి. అటు రాజకీయంగా కలిసి రాక.. ఇటు వ్యాపార పరంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. అయితే రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత వ్యాపార రంగం తిందని ఆమె బాధపడుతున్నారు. అందుకే రాజకీయాలనుంచి నిష్క్రమించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. చూడాలి ఆమె నిర్ణయం ఎలా ఉంటుందో.

## ఎసిబి అదుపులో గొర్రెల స్కామ్ నిదింతుడు

**హైదరాబాద్, మే 2, ( వెలుతురు)**
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన గొర్రెల పంపిణీ స్కాం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో మొదటి నుంచి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటు-న్న ఏ1 నిందితుడు మొయినుద్దీన్‌ను శుక్రవారం ఉదయం ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. గతంలో మొయినుద్దీన్‌పై పోలీసులు ఎల్‌వోసీ జారీ చేశారు. మొయినుద్దీన్ కొడుకు ఈక్రముద్దీన్ ఇద్దరి పాస్ పోర్టును అధికారులు సస్పెండ్ చేశారు. ఈ క్రమంలోనే మొయినుద్దీన్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

## కాంగ్రెస్ అగ్రనేతలకు కోర్టు శ్రీముఖం

**న్యూఢిల్లీ,మే2( వెలుతురు):**
నేషనల్ హెరాల్డ్ కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఈడీ దాఖలు చేసిన కేసులో వీరిద్దరికీ కోర్టు నోటీసులు పంపింది. ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీటుకు సమాధానం ఇవ్వాలని వారిద్దరికి కోర్టు జారీ చేసిన నోటీసుల్లో స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణ మే 7వ తేదీకి వాయిదా వేసింది. అయితే ఈడీ ఇటీవల దాఖలు చేసిన ఛార్జిషీట్ విచారణ సమయంలో ప్రతివాదుల వాదనలు వింటామని ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే స్పష్టం చేశారు. కొత్త చట్ట నిబంధనల ప్రకారం నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని.. ఈ నేపథ్యంలో విచారణకు హాజరయ్యేలా వారికి నోటీ-సులు ఇవ్వాలని ఈడీ ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. గతవారం ఈ కేసును విచారించిన న్యాయస్థానం ఈడీ సమర్పించిన ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేని కారణంగా రాహుల్, సోనియా గాంధీలకు నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ చర్యలు తీసుకుంది. బిజెపి నేత సుబ్రమణ్య స్వామి జూన్ 2014లో దాఖలు చేసిన ప్రైవేట్ క్రిమినల్ ఫిర్యాదును మేజిస్ట్రేట్ కోర్టు స్వీకరించింది. ఆ తర్వాత ఈ కేసులో 2021లో ఈడీ దర్యాప్తు అధికారికంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఛార్జిషీట్‌పై న్యాయబద్ధమైన విచారణ జరిగే సమయంలో ఎప్పుడైనా అవతలి పక్షంవారు తమ వాదనలు వినిపించే హక్కు ఉంటుందని ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ విశాల్ గోగ్నే అన్నారు. దీనిపై తదుపరి విచారణను మే8కి వాయిదా వేస్తున్నట్లు- పేర్కొన్నారు. మనీలాండరింగ్ కేసులో నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని.. కాబట్టి విచారణకు హాజరయ్యేలా వారికి నోటీసులు ఇవ్వాలని ఈడీ ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. గతవారం ఈ కేసును విచారించిన న్యాయస్థానం ఈడీ సమర్పించిన ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేని కారణంగా రాహుల్, సోనియా గాంధీలకు నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ చర్యలు తీసుకుంది. నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ (ఊ÷ఎస-।పు।ష ఉస।-షుసశషు).. అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ(÷ఎశ ఏశత), రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీవల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఆస్తులున్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించింది. కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు- ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లెయింట్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు విచారణ చేపట్టింది.

## కేరళలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం




డీప్‌వాటర్ మల్టీపర్పస్ సీపోర్టును ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరువనంతపురం ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ హాజరయ్యారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. ప్రతిపక్ష పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఈ ఫొటో చూసి కొందరికి నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు. ఈ రోజు శశిథరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ ప్రోగ్రామ్ కొందమందికి నిద్ర లేని రాత్రిని మిగులుస్తుంది. ఈ సందేశం ఎక్కడికి వెళ్లాలో అక్కడికి వెళ్లిపోయిందని మోదీ చమత్కరించారు. కాగా.. గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధానిని థరూర్ వ్యక్తిగతంగా వెళ్లి స్వాగతించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. దిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల ఆలస్యం ఉన్నప్పటికీ.. సమయానికి తిరువనంతపురం చేరుకోగలిగా. నా నియోజకవర్గానికి వచ్చిన మోదీని సాదరంగా స్వాగతించానని థరూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ అధినాయత్వంతో శశిథరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా థరూర్ తన సొంత పార్టీపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ మధ్య ఓ కేంద్ర మంత్రితో ఆయన సెల్ఫీ దిగడంతో థరూర్ పార్టీ మారనున్నట్లు ప్రచారం మొదలైంది. ఇక, భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ పరిణామాల వేళ ఆయన మోదీతో వేదిక పంచుకోవడం చర్చనీయాంశమైంది. తిరువనంతపురం నుంచి నాలుగు సార్లు ఎంపీగా గెలిచిన శశి థరూర్ గురించి ప్రధాని నేరుగా ప్రస్తావించడం అరుదైన విషయమని చెప్పవచ్చు. అంతేకాదు ఇప్పుడు శశి థరూర్ బీజేపీలో చేరారా అనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు కేరళలోని కాంగ్రెస్ పార్టీలో థరూర్ స్థానం గురించి జరుగుతున్న చర్చల నేపథ్యంలో వచ్చాయి. ఇదే సమయంలో థరూర్ తన వ్యక్తిగత ఇమేజ్‌ను పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి వేరుగా ప్రాజెక్ట్ చేస్తున్నారనే అభిప్రాయం బలంగా వినపడుతోంది.

## మన నమో మిస్సైల్‌తో పాక్ మటాష్

ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగానే అమరావతి పునర్నిర్మాణం మొదలైంది. ఈ కార్యక్రమంలో మంత్రి నారాలోకేష్ మాట్లాడుతూ... పహల్గాం దాడిలో అమరులైన టూరిస్టుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వేదిక మీద నుంచి పాకిస్థానీయులను గట్టిగా హెచ్చరించారు. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన కుటుంబాలకి దేశం మొత్తం అండగా నిలుస్తుంది. పాకిస్థాన్ గీత దాటింది. అమాయకులను చంపింది. చాలా పెద్ద తప్పు చేసింది. ఒక్క పాకిస్థాన్ కాదు.. 100 పాకిస్తాన్ లో వచ్చినా.. భారతదేశ నేలపై మొలిచిన గడ్డి కూడా పీకలేదు. 100 పాకిస్థాన్ లకు సమాధానం చెప్పే.. ఒక్క మిస్సైల్ మన దగ్గర ఉంది. ఆ మిస్సైలే నమో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని అన్నారు. సింహం ముందు ఆటలాడకూడదు. ఆడితే ఏమవుతుందో అందరికీ తెలుసు. మన ప్రధాని మోడీ కొట్టే దెబ్బకి ప్రపంచ మ్యాప్ లోనే పాకిస్థాన్ కనుమరుగైపోతుంది. ఈరోజు పాకిస్థాన్ ఆర్మీలో పని చేసే వాళ్ళు కొంత మంది రాజీనామా చేశారు. కొంతమంది సెలవు పెట్టి పోయారు. అది మన మోడీ పవర్ అంటే.. మన ప్రధాని దెబ్బకు పాకిస్థాన్ దిమ్మ తిరగడం ఖాయమని మంత్రి నారాలోకేష్ వ్యాఖ్యానించారు. భారత్ వద్ద మోదీ అనే మిసైల్ ఉందన్నారు. అమరావతి పునఃనిర్మాణ సభలో అమరావతి నమో నమః అని రెండు సార్లు అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. నమో కొట్టే దెబ్బకు పాకిస్థాన్ దిమ్మ తిరగడం ఖాయం. భారత గడ్డపై గడ్డి మొక్క కూడా పీకలేరు. మోదీకి ఏపీ అంటే ప్రత్యేక అభిమానం. ఏపీ ప్రాజెక్టులకు ఆమోదం చెబుతూ మద్దతు ఇస్తున్నారు. 2014లో రాజధాని కూడా లేకుండానే విడిపోయాం. చంద్రబాబు ఆత్మస్థైర్యం కోల్పోకుండా రాష్ట్రాన్ని నిలబెట్టారు. చంద్రబాబుపై కోపంతో కొందరు రాజధానిని పక్కనబెట్టారు. అమరావతికి అండగా ఆంధ్రా ప్రజలంతా నిలబడ్డారని అన్నారు. ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా అమరావతి రైతులు తగ్గేదే లే అన్నారు. గత ప్రభుత్వం దొంగకేసులు పెట్టి ఎన్ని కుట్రలు చేసినా జై అమరావతి నినాదాలను మాత్రం ఆపలేకపోయింది. ఆపేదానికి.. పీకేదానికి అమరావతి ఎవరి ఇంట్లోనో పెంచుకున్న మొక్క కాదు.. జనం గుండెల్లో దాచుకున్న ప్రజా రాజధాని. రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. అమరావతి అన్ స్టాపబుల్ అన్నారు.

## మూడేళ్లలో అమరావతి నిర్మాణం

- మోడీ చేతులమీదుగానే ప్రారంభం
- సిఎం చంద్రబాబు వెల్లడి

**అమరావతి,మే2( వెలుతురు):**
మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి చేసి, తిరిగి ప్రధాని మోడీతోనే ప్రారంభిస్తామని సిఎం చంద్రబాబు చెప్పారు. 5 కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజలు అమరావతి నా రాజధాని అని చెప్పుకునేలా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర సహకారంతో అమరావతిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మూడేళ్లలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని.. మళ్లీ అప్పుడు అమరావతి ప్రారంభోత్సవానికి కూడా మోడీనే రావాలని కోరారు. సకల హంగులతో ప్రపంచం మెచ్చే విధంగా అమరావతిని తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన నగరాలకు అమరావతిని అనుసంధానిస్తామని చెప్పారు. 5 లక్షల మంది విద్యార్థులు అమరావతిలో చదువుకునేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఆధునిక నగరంగా నిర్మిస్తామని అన్నారు. ఇందుకు కట్టుబడి పనిచేస్తామని అన్నారు. అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు.

## కూటమి ప్రభుత్వానికి వెంటాడుతున్న ప్రమాదాలు





**విశాఖపట్టణం, మే 2, ( వెలుతురు)**
ఏపీలోకూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయింది. పాలనాపరంగా ఇప్పుడిప్పుడే ప్రభుత్వం కుదుటపడుతోంది. మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భావిస్తోంది. అదే సమయంలో అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు సిద్ధపడింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయి. ఇటువంటి సమయంలో ఏపీలో విపత్తులు, వివాదాలు, ప్రమాదాలు ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పది నెలల్లోనే ఏపీ ప్రభుత్వం చాలా రకాల విపత్తులను ఎదుర్కొంది. ప్రభుత్వానికి అవి సవాల్ గా మారాయి. అయినా సరే కూటమి ప్రభుత్వం తట్టుకొని ముందుకు సాగుతోంది. సహజంగానే విపత్తులను, ప్రమాదాలను




ప్రతిపక్షం రాజకీయాలు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్లో ప్రస్తుతం జరుగుతున్నది అదే. గత ఏడాది జూన్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సెప్టెంబర్లో విజయవాడను బుడమేరు ముంచేసింది. దీంతో వేలాది కుటుంబాలు వరదల్లో చిక్కుకున్నాయి. లక్షలాదిమంది నిరాశ్రయులు అయ్యారు. కనీసం ఆహారం కూడా వారికి దొరకని పరిస్థితి. అటువంటి సమయంలో సీఎం చంద్రబాబు నేనున్నాను అంటూ బాధితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. రోజుల తరబడి విజయవాడలోనే మకాం వేసి బాధితులకు స్వయంగా వరద నీటిలోనే వెళ్లి పరామర్శించారు. వారికి అన్ని విధాల సాయం చేశారు. రాత్రికి రాత్రి వరద బాధితులను ఆదుకునేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు వర్కౌట్ అయ్యాయి. అయితే ఈ కష్టం నుంచి బయటపడే క్రమంలో.. ఏలూరులోని ఎర్ర కాలువ పొంగింది. వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో ఇబ్బందులు తప్పలేదు. అటు తర్వాత ఫార్మా కంపెనీల్లో వరుస ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. విశాఖ జిల్లా అచ్యుతాపురం సమీపంలో ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఉద్యోగులతో పాటు కార్మికులు చనిపోయారు. అటు తర్వాత కాకినాడలోని పరిశ్రమలో సైతం ప్రమాదం చోటుచేసుకుంది. బాధిత కుటుంబాల పరామర్శ, వారికి పరిహారం అందించడంలో ప్రభుత్వం ముందంజలో నిలిచింది. క్యాబినెట్ మంత్రులు సైతం నేరుగా మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ప్రభుత్వపరంగా అండగా నిలిచారు. ఈ ఏడాది జనవరిలో తిరుమల వెంకటేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించి టోకెన్ల పంపిణీలో అపశృతి జరిగింది. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు చనిపోయారు. ఇది పెను వివాదానికి దారితీసింది. మృతుల కుటుంబాలకు టీటీడీతో పాటు ప్రభుత్వం అండగా నిలిచింది. పరిహారం కూడా అందించింది. అంతకుముందు టీటీడీ లడ్డు ప్రసాదం వివాదం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. మరోవైపు తూర్పుగోదావరి జిల్లాలో బాణాసంచా పేలుడు కారణంగా 8 మంది చనిపోయారు. తాజాగా సింహాచలంలో జరిగిన ఘటనలో భక్తులు మరణించారు. ఇప్పుడు వారికి ప్రభుత్వం పరిహారం కూడా అందించింది. ప్రభుత్వం పాలనలో మునిగి తేలుతున్న తరుణంలో ఇలా ప్రమాదాలు, వివాదాలు, విపత్తులు.. తీవ్ర ఇబ్బందికరంగా మారుతున్నాయి. మరి వీటన్నింటినీ తట్టుకొని కూటమి ప్రభుత్వం ఎలా నిలబడుతుందో చూడాలి.

## ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన మసీదుల మూత

**లక్నో, మే 2, ( వెలుతురు)**
ఉత్తర్ ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అక్రమ మసీదులు, మదర్సాలపై ఉక్కుపాదం మోపుతోంది. ముఖ్యంగా భారత్- నేపాల్ సరిహద్దుల్లోని ఉన్నవాటిపై అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. జిల్లా పాలనాధికారులు, స్థానిక పోలీసులు, సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) వంటి కేంద్ర దళాల సమన్వయంతో శు క్రవారం పెద్ద ఎత్తున యాక్షన్ చేపట్టింది. అక్రమ మసీదుల్ని మూసేయడంతో పాటు- ప్రభుత్వ భూముల్లో అనధికారికంగా నిర్మించిన మతపరమైన నిర్మాణాలు కూల్చేశారు. మహారాజ్‌గంజ్ జిల్లాలో, అధికారులు 11 మదర్సాలను సీజ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించిన మసీదులు, మందిరాలతో సహా అనేక భవనాలను కూల్చేశారు.

శ్రావస్తిలో గుర్తింపు లేని 41 మదర్సాలను మూసేశారు. రెవెన్యూ కోడ్‌లోని సెక్షన్ 67 ప్రకారం, ఇండో-నేపాల్ సరిహద్దు నుండి 15 కిలోమీటర్ల వ్యాసార్థంలో శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలతో సహా 139 అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించినట్లు- అధికారులు తెలిపారు. బహ్రైచ్ జిల్లాలో, రుపైదిహా, మోతీపూర్ వంటి సరిహద్దు ప్రాంతాలలో కూడా ఇలాంటి చర్యలు కొనసాగుతున్నాయి.

## అన్ని వర్గాలను ఆదుకున్న కెసిఆర్

● అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యం




**నిజామాబాద్, మే2( వెలుతురు):**
బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలను ఆదుకున్న ఘనత నాటి సిఎం కెసిఆర్‌దని నిజామాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. కానీ పద్నాలుగు నెలలకే కాంగ్రెస్ మడత చుట్టేసిందని, అభివృద్ధి వెనక్కి పోయిందని అన్నారు. నీళ్లు, కరెంట్ ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. తెలంగాణ సమాజంలో అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేస్తున్న ఘనత కేసీఆర్‌దని వేముల అన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత తెలంగాణలో మాత్రమే అన్నారు. గత పాలకులు 70 ఏళ్లలో చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ తొమ్మిళ్లలో చేసి చూపించారని పేర్కొన్నారు. తెలంగాణలో కరువును పారదోలేందుకు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును చేపట్టారని అన్నారు. దీంతో పాటు మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ వంటి ఆధునిక జలాశయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాగే భూగర్భ జలాలలు పెరిగాయన్నారు. రైతులకునీరు, రైతుబంధు సాయం వంటివి అందడం,ధాన్యం కొనుగోళ్లు చేపట్టడంతో వారు సుఖంగా ఉన్నారని అన్నారు. కేంద్రం ధాన్యం కొనుగోళ్లకు ముందుకు రాకున్నా కెసిఆర్ ముందుకు వచ్చి ధాన్యం కొనుగోళ్లను చేపట్టారని అన్నారు. దిగుబడి పెంచేందుకు రైతులు ఆధునిక పద్ధతులు అవలంబిం చేలా చేశారని అన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వీటిని కొనసాగించడం లేదన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, ఆ పార్టీ నాయకుల మోసపూరిత మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు తెలిపారు. పేదలు, రైతులకు సంక్షేమ పథకాలు పక్కాగా అందాయని గుర్తుచేశారు. రైతులకు వరికి రూ.500 బోనస్ ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ పార్టీ..ఇప్పుడు నోరెత్తడం లేదని విమర్శించారు. ప్రజలను అబద్దాలతో ఆగంచేసే కాంగ్రెస్, బీజేపీ కావాలా.. అభివృద్ధి చేసే బీఆర్ఎస్ కావాలో ప్రజలు నిర్ణయించు కోవాలని సూచించారు.

## బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి ఆత్మహత్య

● అప్పులు తీర్చే స్థోమత లేక బలవన్మరణం



**విశాఖపట్టణం, మే2( వెలుతురు):**
బెట్టింగ్ యాప్‌లు ప్రాణాలు తీస్తూనే ఉన్నాయి.. బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పెట్టి సంపాదిస్తామన్న ఆశతో వాటి మోజులో పడి.. ఉన్న డబ్బునంతా పోగొట్టు-కోవడమే కాదు.. అప్పులు చేసి మరి బెట్టింగ్‌లు పెట్టి.. చివరకు లక్షల్లో అప్పులు కావడం.. తీర్చే స్తోమత కూడా లేకపోవడంతో.. ప్రాణాలు తీసుకుంటున్నారు ఎంతో మంది యువకులు.. తాజాగా, బెట్టింగ్ యాప్ లకు విశాఖపట్నంలో మరో యువకుడు బలి అయ్యాడు..ద్వారక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. స్థానికంగా లాడ్జిలో పనిచేస్తున్న పవన్ అనే యువకుడు.. బెట్టింగ్ కి బానిసగా మారిపోయాడు.. బెట్టింగ్‌తో డబ్బులు సంపాదించవచ్చు అనే ఆశతో.. ఉన్న డబ్బులు పెట్టడమే కాదు.. తన దగ్గర సొమ్ము అంతా అయిపోయిన తర్వాత.. అనేక చోట్ల అప్పులు చేసి మరీ బెట్టింగ్ వేశాడు.. అప్పులు ఇచ్చినవారి నుంచి ఒత్తిళ్లు ఓవైపు.. బెట్టింగ్‌లో డబ్బులు అన్నీ పోవడం మరోవైపు.. తీవ్రమనస్తాపానికి గురైన పవన్.. చివరకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకి పాల్పడ్డాడు.. కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ చేపట్టారు.. అయితే, బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టు-కుని అప్పులు పాలైన యువకుడు.. మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్టు-గా పోలీసులు చెబుతున్నారు.. బెట్టింగ్ యాప్స్ జోలికి పోవద్దు.. మీ జీవితాన్ని, కుటు-ంబాన్ని నాశనం చేసుకోవద్దు.. ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు అని పోలీసులు సూచిస్తున్నారు.

## రామానాయుడు స్టూడియోస్‌కు చుక్కెదురు

● ప్రభుత్వ నిర్ణయంపై జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం




**న్యూఢిల్లీ, మే2( వెలుతురు):**
సుప్రీం కోర్టులో సురేష్ ప్రొడక్షన్స్‌కి చుక్కెదురైంది. రామానాయుడు స్టూడియో భూముల వ్యవహారంలో సురేష్ ప్రొడక్షన్స్‌కు ఊరట దక్కలేదు. ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ విశాఖపట్నంలో రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. విశాఖలో ఫిల్మ్ సిటీ కోసం కేటాయించిన భూములను ఇతర అవసరాలకు కూడా వాడుకోవచ్చని అప్పట్లో జగన్ ప్రభుత్వం సురేష్ ప్రొడక్షన్స్‌కు అనుమతి ఇచ్చింది. రామానాయుడు స్టూడియో కోసం కేటాయించిన భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతుందని, అందుకే సురేష్ ప్రొడక్షన్స్‌కు కేటాయించిన భూములను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేస్తూ షోకాజ్ నోటీసు ఇచ్చింది. ప్రభుత్వ షోకాజ్ నోటీసును సుప్రీంకోర్టులో సురేష్ ప్రొడక్షన్స్ సవాల్ చేసింది. విచారణ జరిపిన జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా ధర్మాసనం జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. మధ్యంతర ఉపశమనం అడుగుతున్నారని, అది కుదరదని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. అవసరం అనుకుంటే.. ప్రభుత్వ షోకాజ్ నోటీసుపై సంబంధిత కోర్టును ఆశ్రయించాలని జస్టిస్ జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా పిటిషనర్‌కు సూచించారు. పిటిషన్ ఉపసంహరించుకుంటామని సురేష్ ప్రొడక్షన్స్ కోరగా, ధర్మాసనం అనుమతించింది.

# దేశానికి మద్దతుగా రైతులు

**బెంగళూరు, మే2( వెలుతురు):**
దాయాది దేశం పాకిస్తాన్ ఇప్పటికే ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం, ఆహార సంక్షోభం వంటి వాటితో ఇబ్బంది పడుతూనే ఉంది. పాక్ వాసులకు తినడానికి తిండి కూడా లభించని స్టేజ్ లో ఉన్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన దాడి నేపథ్యంలో పాకిస్తాన్ పై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతుంది. అంతేకాదు భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పాకిస్తాన్ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు ఇప్పుడు కర్ణాటక రైతులు తమ వంతు అన్నట్లు పాక్ దేశానికి టమాటా ఎగుమతులు నిలిపివేశారు. మార్కెట్ మొత్తం ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద టమోటా మార్కెట్‌గా గుర్తింపు పొందింది. అదే కారణంతో కోలార్ జిల్లాలో పండించే నాణ్యమైన టమోటాలు దేశంలోని చాలా రాష్ట్రాలతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తారు. జూన్, జూలై నెలలు టమోటా పంట కోతకు అనువైన నెలలు. ఈ సందర్భంగా ఇక్కడి రైతులు కోలార్ నుంచి పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, దుబాయ్ వంటి వివిధ దేశాలకు టమోటాలను ఎగుమతి చేస్తారు. అయితే ఇటీవల కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు ఉగ్రవాద దాడి చేసి 27 మందిని చంపారు. దీని కారణంగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పాకిస్తాన్‌పై దౌత్యపరంగా అనేక చర్యలు చేపట్టింది. ఇప్పుడు కోలార్‌లోని రైతులు తాము పండించిన



టమోటాలను పాకిస్తాన్‌కు ఎగుమతి చేయడం నిలిపి వేశారు. ఇలాంటి చర్యలతో కోలార్ రైతులు పాకిస్తాన్‌ను కూడా దిగ్భ్రాంతికి గురిచేశారు.పాకిస్తాన్ పై ప్రతీకారం తీర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దౌత్యపరమైన చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో కోలార్ లోని రైతులు, వ్యాపారులు పాకిస్తాన్ పై మరో సర్జికల్ స్ట్రైక్ ప్రకటించారు. కోలార్ నుంచి పాకిస్తాన్‌కు టమోటాలు సరఫరా చేయడంపై పూర్తి నిషేధం ప్రకటించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ పాకిస్తాన్‌కు టమోటాలు సరఫరా చేయకూడదని రైతులు నిర్ణయించుకున్నారు. ప్రతి సంవత్సరం కోలార్ నుంచి 800 నుంచి 900 టన్నుల టమోటాలు పాకిస్తాన్‌కు సరఫరా అయ్యేవి. అయితే పహల్గామ్ దాడి నేపథ్యంలో వ్యాపారులు ఇకపై పాకిస్తాన్‌కు ఒక్క టమోటా కూడా పంపకూడదని నిర్ణయించుకున్నారు. ఇక్కడి వ్యాపారులకు పాకిస్తాన్ తో విడదీయరాని సంబంధం ఉంది. వాళ్ళు టమోటాలతో పాటు కూరగాయలను కూడా పంపేవారు. దీని ద్వారా ఇక్కడి రైతులు, వ్యాపారులు పాకిస్తాన్‌తో కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నారు. అయితే ఉగ్రవాదులు మతం అడిగి మరీ మరణ హోమం సృష్టించడంతో రైతులు పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా మారారు.తమకు నష్టాలు కలిగినా పాకిస్తాన్‌కు టమోటాలు ఎగుమతి చేయడమని రైతులు చెబుతున్నారు. 2013లో పుల్వామా దాడి సమయంలో పాకిస్తాన్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నప్పుడు.. కోలార్ రైతులు కూడా ఇలాంటి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు పాకిస్తాన్ కు కోలార్ నుంచి టమోటాల ఎగుమతిని నిలిపివేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాము కట్టుబడి ఉన్నామని కోలార్ రైతులు కూడా చెబుతున్నారు.పాకిస్తాన్ ఉగ్రవాదులకు సపోర్ట్ చేయడం మానెయ్యాలని.. కేంద్ర ప్రభుత్వం నీరు.. ఇతర వస్తువులపై ఆంక్షలు విధించగా, కోలార్ రైతులు ఒక అడుగు ముందుకు వేసి టమోటాలు, కూరగాయల సరఫరాని నిలిపివేసి పాక్ ప్రజలకు షాక్ ఇచ్చారు. దీని వలన పాకిస్తాన్ ప్రజలు టమోటాలు, కూరగాయల కోసం ఇబ్బంది పడటం అనివార్యం.

# సైబర్ ఉచ్చులో చదువుకున్నవాళ్లే ఎక్కువ

**హైదరాబాద్, మే2( వెలుతురు):**
హైదరబాద్ మియాపూర్‌కు చెందిన 40 ఏళ్ల ఐటీ ఉద్యోగి, ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ యాడ్ ద్వారా ట్రేడింగ్ స్కామ్‌కు గురై ?38.62 లక్షలు కోల్పోయాడు. వ్యాపారంలో ?1.3 కోట్లు లాభాలుగా చూపించినా, అతని ఖాతాలో జమయిన మొత్తం కేవలం ?200 మాత్రమే. ఈ కేసును సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.బాధితుడు మొదట ఓ వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. ఈ గ్రూప్‌లో "ప్రియా శర్మ"గా తాను పరిచయం చేసుకున్న యువతి అతనికి ట్రేడింగ్ గురించీ, అధిక లాభాలు పొందే పద్ధతుల గురించీ వివరించింది. ఆమె అతనికి "ASK ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ" అనే యాప్ ఉపయోగించమని సూచించింది. దీనివల్ల బ్లాక్ ట్రేడ్స్, అప్పర్ సర్క్యూట్ స్టాక్స్ వంటి విషయాల్లో మోహపూరితమైన వ్యూహాలతో అతన్ని పెట్టుబడి పెట్టించేందుకు ప్రోత్సహించిందివాట్సాప్ గ్రూప్‌లో వేరే సభ్యుల ద్వారా ఇచ్చిన టెస్ట్‌మోనియల్స్, స్క్రీన్‌షాట్‌లతో ఆకర్షితుడైన బాధితుడు తొలుత ?50,000 పెట్టుబడి పెట్టి, తరువాత నెమ్మదిగా పెంచుతూ మొత్తం ?14.87 లక్షలు పెట్టాడు. మొత్తంగా అతను తన ఖాతా మరియు భార్య ఖాతా ద్వారా



?38.62 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు.ట్రేడింగ్ జరుగుతున్న సమయంలో ప్రియా అతనికి ?1 కోటి లాభాలు వచ్చాయని చెప్పింది. కానీ, ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు ముందు, ?18 లక్షలు ట్యాక్స్ క్లీయరెన్స్ పేరుతో డిమాండ్ చేసింది. బాధితుడు ఈ మొత్తం తన లాభాల నుంచి తీసుకోమని అడిగినప్పుడు, ఆమె దానికి అంగీకరించకుండా.. ట్యాక్స్‌ను వేరుగా చెల్లించాల్సిందేనని చెప్పింది.ఇంకొక సంఘటనలో, హైదరాబాద్‌కు చెందిన 55 ఏళ్ల వ్యక్తిని ఇండియామార్ట్ అనే వాణిజ్య వెబ్‌సైట్‌లో ట్రాన్స్‌మిషన్ లైన్ టూల్స్ కోసం వెతుకుతున్న సమయంలో, మోసగాళ్లు ?1,17,646ను మోసగించారు. %ఖూ% ఎంటర్‌ప్రైజెస్ అనే పేరుతో పర్సనల్ జాయింట్ అకౌంట్‌కు చెందినట్లుగా తమను పరిచయం చేసుకున్నారు. బాధితుడికి ఫోన్లో మాట్లాడి పర్చేజ్ ఆర్డర్ పంపించారు.ఏప్రిల్ 5న ?1,17,646 చెల్లింపును బాధితుడు చేశాడు. అయితే అప్పటి నుంచి అతనికి ఎటువంటి సరుకు రాలేదు. ఫాలో అప్‌లో, మోసగాళ్లు వాట్సాప్ ద్వారా మరిన్ని నకిలీ రసీదులు, షిప్పింగ్ డాక్యుమెంట్లు పంపించారు.సిటీ సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి మాట్లాడుతూ, "బాధితుల ఫిర్యాదుల ఆధారంగా మోసగాళ్లను గుర్తించే పనిలో ఉన్నాం" అన్నారు. ఇలాంటి నేరు జరిగినప్పుడు వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేయాల్సిందిగా పోలీసులు సూచిస్తున్నారు.

# తన మార్క్ అధికారులపై రేవంత్ గురి

**హైదరాబాద్, మే2( వెలుతురు):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారం చేపట్టి ఏడాదిన్నర గడిచింది. ఈ తరుణంలో, పాలనలో సమర్థత, స్థిరత్వం సాధించేందుకు తన కార్యాలయం (సీఎంవో)ను పునర్వ్యవస్థీకరిస్తున్నారు. పదేళ్ల కేసీఆర్ పాలన తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్, ప్రభుత్వ యంత్రాంగంలో క్రమంగా మార్పులు చేస్తూ, తనదైన టీమ్‌ను రూపొందించుకుంటున్నారు. ఈ క్రమంలో సీఎంవోలో కీలక అధికారుల బదిలీలు, నియామకాలతో పాటు శాఖల పునర్విభజన చేపట్టారు.తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి ఏఆడదిన్నర గడిచింది. 18 నెలల పాలనలో అధికారులపై ఇప్పటికీ పట్టు సాధించలేదు. అధికారుల నుంచి కూడా పెద్దగా సహకారం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈతరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి సీఎంవోలో సమగ్ర సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఏప్రిల్ 27న 18 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీఎంవో సంయుక్త కార్యదర్శిగా పనిచేసిన సంగీత సత్యనారాయణను వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్‌గా, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా నియమించారు. ఆమె గతంలో వైద్యం, స్త్రీ-శిశు సంక్షేమం, ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖలను



పర్యవేక్షించారు. అలాగే, పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌ను సీఎంవోలోకి తీసుకొచ్చి, పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల అభివృద్ధి వంటి కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ చర్య రాష్ట్ర ఆర్థిక వృద్ధికి పెట్టుబడులను వేగవంతం చేయడానికి ఉద్దేశించినది.సీఎం కార్యదర్శిగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిని రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్‌గా నియమించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆయన మూడు నెలల్లో రిటైర్ కానున్నారు. ప్రస్తుతం ఆయన అటవీ, వ్యవసాయం, పశు సంవర్ధక, రవాణా, పంచాయతీరాజ్ శాఖలను చూస్తున్నారు. షానవాజ్ ఖాసిమ్‌ను ఔషధ నియంత్రణ మండలి డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేశారు. ఆసక్తికరంగా, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో జేఈవోగా సుదీర్ఘకాలం పనిచేసిన కేఎస్ శ్రీనివాసరాజును ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా నియమించారు. రిటైరైన ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, కార్యదర్శి మాణిక్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు తమ పదవుల్లో కొనసాగుతారు. ఈ అధికారులు సీఎం సన్నిహిత బృందంగా కీలక శాఖలను పర్యవేక్షిస్తున్నారు. ఈ మార్పులతో సీఎంవో సమర్థవంతమైన పాలనకు బలమైన పునాది వేస్తోందిరేవంత్ రెడ్డి సీఎంవో ప్రక్షాళన ద్వారా పాలనలో సమర్థత, పారదర్శకతను పెంచే దిశగా అడుగులు వేస్తున్నారు. కీలక బదిలీలు, అనుభవజ్ఞుల నియామకాలతో తెలంగాణ పాలన యంత్రాంగం మరింత బలపడనుంది.

# కులగణనపై క్రెడిట్ వార్...

**హైదరాబాద్, మే2( వెలుతురు):**
కేంద్ర ప్రభుత్వం తదుపరి జనాభా లెక్కల్లో కులాల గణనను కూడా నమోదు చేస్తామని ప్రకటించిన మరుసటి రోజు, ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల ఒక పోస్టర్ వెలసింది. ఈ నిర్ణయం తీసుకునేలా నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసిన ఘనత కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకే చెందుతుందని ఆ పోస్టర్ పేర్కొంది. కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ బివి ఏర్పాటు చేసిన ఈ పోస్టర్‌లో రాహుల్ గాంధీ ఫోటో ఉంది. దేశంలో కుల గణన జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది సమాజంలోని వెనుకబడిన వర్గాలను అభివృద్ధి చేయడానికి మరింత సానుకూల చర్యలకు మార్గం సుగమం చేస్తుందని ఆయన నొక్కి మరీ చెప్పారు.నిర్ణయం తీసుకునేలా కేంద్రాన్ని ఒత్తిడి చేసింది తమ కుల గణన డిమాండేనని కాంగ్రెస్ చెబుతుండగా, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాలు కుల గణనను ఎప్పుడూ వ్యతిరేకించాయని, ఆ పార్టీ ఈ అంశాన్ని రాజకీయ



సాధనంగా మాత్రమే ఉపయోగించిందని బీజేపీ పేర్కొంటుంది.ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేస్తూ.. "మోదీ జీ కుల గణన చేయవలసి ఉంటుందని మేము చెప్పాము. మేము దానిని చేయిస్తాము. ఇది మా దృష్టి ప్రభుత్వం పారదర్శకమైన కుల గణనను చేస్తుందని నమ్ముతున్నాము. దేశంలోని సంస్థలు, అధికార నిర్మాణంలో ఏ వర్గాలకు ఎంత భాగస్వామ్యం ఉందో అందరికీ తెలుసు" అని అన్నారుదీని కోసం ఒత్తిడి చేస్తూనే ఉన్న వ్యక్తులు, సంస్థలను రాహుల్ గాంధీ అభినందించారు. వారి గురించి గర్వపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌ను ప్రతిఘటిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడుతూ.. కొంతమంది తప్పుడు క్రెడిట్‌ను పొందుతున్నారని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ కుల ఆధారిత రిజర్వేషన్‌కు తీవ్ర వ్యతిరేకి అని దేశప్రజలు తెలుసుకోవాలన్నారు. ఆ తర్వాత ఇందిరా గాంధీ ప్రభుత్వం ఈ అంశాన్ని వెనక్కి నెట్టిందని ఆయన తెలిపారు.కుల గణన అంశం చాలా కాలంగా రాజకీయ చర్చనీయాంశంగా ఉంది. మొత్తానికి కుల గణన విషయంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య రాజకీయ పోరాటం తీవ్రంగా ఉంది. రాహుల్ గాంధీ దీనిని తమ విజయంగా చెప్పుకుంటున్నారు. కుల గణన ద్వారా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ వాదిస్తోంది. నెహ్రూ, ఇందిరా గాంధీల కాలంలో దీనిని వ్యతిరేకించినట్లు బీజేపీ చెబుతోంది. మండల్ కమిషన్ నివేదికను అమలు చేసినప్పుడు బీజేపీ మద్దతు ఇచ్చిందని ధర్మేంద్ర ప్రధాన్ గుర్తు చేశారు. బీజేపీ మాత్రం కాంగ్రెస్ దీనిని రాజకీయ సాధనంగా వాడుకుంటోందని ఆరోపిస్తోంది. ఈ అంశంపై ప్రజల స్పందన కూడా భిన్నంగా ఉంది. కొందరు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు బీజేపీ వాదనను సమర్థిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ అంశం ప్రధాన ప్రచారాస్త్రంగా మారే అవకాశం ఉంది.

# పద్మనాభస్వామి ఆలయం చుట్టూ జటాధర

టాలీవుడ్ స్టార్ హీరో సుధీర్ బాబు నటిస్తున్న పౌరాణిక, నేచురల్ థ్రిల్లర్ మూవీ 'జటాధర'. వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో రైన్ అంజలి, శిల్పా శిరోద్కర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీ స్టూడియో సమర్పణలో కె.ఆర్.బన్సాల్, ప్రేరణ అరోరా సంయుక్తంగా మూవీని నిర్మిస్తున్నారు. అనంత పద్మనాభ స్వామి ఆలయం కథాంశంతో మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాతో.. బాలీవుడ్ బ్యూటీ– సోనాక్షి సిన్హా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుంది. ఈ మూవీలో పవర్ ఫుల్ రోల్‌లో ఆమె కనిపించబోతున్నట్లు ఆమె లుక్ చూస్తే తెలుస్తోంది. అయితే తాజాగా ఈ మూవీకి సంబంధించి తాజాగా ఓ వార్త వైరల్ అవుతుంది.. ఇక ఈ సినిమాలో విలన్ గా రోహిత్ పాఠక్ నటిస్తున్నాడు. 'ఖాకీ', 'సీటీ–మార్','సీతా రామం', 'వీర సింహారెడ్డి', 'వాల్తేరు వీరయ్య' వంటి హిట్ సినిమాల్లో తన విలనిజంతో ఆకట్టుకుని తెలుగులో బాగా పాపులర్ అయ్యాడు. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న 'ది రాజా సాబ్' సినిమాలో కూడా ఓ విలన్ గా నటిస్తున్నాడు. అయితే తాజా సమాచారం ప్రకారం 'జటాధర' లో రోహిత్ కి భార్య పాత్రలో మహేష్ బాబు మరదలు శిల్పా శిరోద్కర్ కనిపించనుందట. ఈమె రోల్ కూడా చాలా పవర్ఫుల్‌గా ఉంటుందని సమాచారం. త్వరలోనే ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా వదిలే అవకాశం ఉంది.





# బాకాసుర రెస్టారెంట్ పోస్టర్ విడుదల




కొన్ని రోజులుగా కమెడియన్ ప్రవీణ్ రెస్టారంట్‌ను ప్రారంభించనున్నారనే వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. అయితే ఇదంతా ఓ సినిమా కోసమేనని క్లారిటీ వచ్చేసింది. ఆయన ఏ బిజినెస్ ప్రారంభించడం లేదు. అది సినిమా పేరు మాత్రమే. ఈ విషయాన్ని తెలుపుతూ 'బకాసుర రెస్టారెంట్' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. కమెడియన్ ప్రవీణ్, వైవా హర్ష ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్, ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రం ఎస్‌జే మూవీస్ పతాకంపై రానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ.. హంగర్ కామెడీ ఎంటర్–టైనర్‌గా ఈ చిత్రం రానుందన్నారు. ప్రవీణ్ కెరీర్‌లోనే గుర్తుండిపోయే చిత్రమవుతుందన్నారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుందన్నారు.

# రెండు ఓటిటిల్లోకి ఓదెల-2 మూవీ

ఇటీవల విడుదలైన 'ఓదెల 2' మూవీ ఓటిటిలోకి వచ్చేసింది. తమన్నాతో పాటు హెబ్బాపటేల్, వశిష్ట ఎన్ సింహా, మురళీ శర్మ కీలక పాత్రలు పోషించిన ఈ మూవీకి డైరెక్టర్ సంపత్ నంది కథను అందించాడు. ఈ మూవీకి అశోక్ తేజ దర్శకత్వం వహించాడు. ప్రేతాత్మకు, నాగసాధువుకు మధ్య పోరాటం నేపథ్యంలో సంపత్ నంది ఈ కథను రాసుకున్నారు. ఈ నెల 17న రిలీజైన ఈ మూవీ లో ప్రతి ఒక సీన్ డైలాగ్.. భయనకం గానే ఉన్నాయి. ప్రేక్షకులు కూడా బాగా ఎంజాయ్ చేశారు. ముఖ్యంగా తమన్నా ఎంట్రీ ఇచ్చిన తర్వాత కథలో కొంత వైవిధ్యం కనిపిస్తుంది. మునుపెన్నడూ చూడని విధంగా తమన్న తనలోని కొత్త కోణాని చూపించింది. మొదటి భాగంలో కొంత అడల్ట్ కనిపించినప్పటికి.. ఈ రెండో భాగం మాత్రం చాలా డీసెంట్‌గా తీశాడు. కానీ కొంత మంది రొటీన్ స్టోరీలైన్‌తో పాటు ప్రేతాత్మతో నాగసాధువు పోరాటాన్ని పవర్‌ఫుల్‌గా చూపించలేకపోయాడు డైరెక్టర్ అంటూ కామెంట్స్ వినిపించాయి. అయినప్పటికి నాగసాధువుగా తమన్నా యాక్టింగ్‌కు మాత్రం ప్రశంసలు దక్కాయి. ఇక తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ క్షి రిలీజ్ కు సిద్ధం అయింది. ఓదెల 2 మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకున్నది. ఈ నెల 16 నుంచి మూవీ స్ట్రీమింగ్ కానున్నట్లు– సమాచారం. దీని గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయితే అమెజాన్ ప్రైమ్‌తో పాటు– ఆహా ఓటీటీలోనూ ఓదెల 2 మూవీ స్ట్రీమింగ్ కానుంది. దీని గురించి అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.





# స్పిరిట్ కోసం వంగా ముమ్మర యత్నాలు

ప్రభాస్ నటించబోయే సినిమాలలో సందీప్ రెడ్డి వంగాతో చేస్తున్న స్పిరిట్ కోసం అభిమానులు ఎదురు చేస్తున్నారు. ఇప్పటికే దర్శకుడు సందీప్ రెడ్డి వంగ ప్రీ ప్రొడక్షన్ వర్క్‌తో బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం కొత్త నటీనటులను ఫైనల్ చేసే పనిలో ఉన్నాడు. మరోవైపు ప్రభాస్ ఫౌజీ. రాజసాబ్ షూటింగ్స్ పూర్తి చేసేలా జెట్ స్పీడ్‌లో ఉన్నాడు. వీలైనంత త్వరగా స్పిరిట్‌ను సెట్స్ పైకి తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నాడు వంగా . ఈ సినిమాలో ఫస్ట్ టైం పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడు ప్రభాస్. కానీ ఇప్పుడు ఈ సినిమాపై రకరకలా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రభాస్ ముందుగా రాజాసాబ్, ఫౌజీ సినిమాలను ఫినిష్ చేసి ఆ తర్వాత ప్రశాంత్ వర్మ సినిమా స్టార్ట్ చేస్తాడని ఆ వెంటనే నాగ్ అశ్విన్ డైరెక్షన్ లో కల్కి 2 చేసి లైన్ లోనే సలార్ 2 ను కూడా చేసేలా ప్లానింగ్ జరుగుతోందట. ఇవన్నీ ఫినిష్ అయ్యాకే సందీప్ రెడ్డి వంగతో స్పిరిట్ ఉంటుందని టాక్ నడుస్తోంది. అయితే ఇవన్నీ ఫేక్ అని విశ్వసనీయ సమాచారం. సందీప్ రెడ్డి వంగా మరే ఇతర సినిమాలు చెయట్లేదు. ఇటీవల ఆయన కథ చెప్పడానికి రెండుసార్లు చెన్నైకి వెళ్లి విజయ్ సేతుపతితో చర్చించారు. ప్రస్తుతం సేతుపతి గ్రీన్ సిగ్నల్ కోసం సందీప్ ఎదురు చూస్తున్నారు. అలాగే ఈ సినిమాకు సంబంధించి మ్యూజిక్ సిట్టింగ్ చాలా కాలం క్రితం ప్రారంభమయ్యాయి. మరోవైపు లొకేషన్స్ వేటకూడా కొనసాగిస్తున్నాడు సందీప్. అందులో భాగాంగానే 4 స్థానాలను ఖరారు చేశారని కూడా తెలిపారు.

# నటనకు గుడ్‌బై చెప్పేస్తానేమో: అజిత్



కోలీవుడ్ స్టార్ హీరో, పద్మ భూషణ్ అజిత్ కుమార్ తెలుగు ప్రేక్షకులకి కూడా చాలా సుపరిచితం. ఆయన నటించిన చాలా సినిమాలు తెలుగులో రిలీజై ప్రేక్షకులని ఎంతగానో అలరించాయి. ఇటీవల అజిత్ సినిమాల కన్నా కూడా మోటార్ రేసింగ్ పై ఎక్కువగా దృష్టి సారించాడు. మోటర్ రేసింగ్‌లో తల ఎన్నిసార్లు గాయపడ్డా కూడా దానిని వీడడం లేదు. అయితే తాజాగా ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇప్పుడు అభిమానుల్లో ఆందోళన కలిగిస్తుంది. ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ.. నేను ఎప్పుడు నటన నుండి వైదొలుగుతానో తెలియదు. బలవంతంగా వీడాల్సి రావచ్చు. నేను ఏ విషయాన్నైన కూడా తేలికగా తీసుకోకూడదు అనుకుంటు–న్నా. ప్రేక్షకులు నా నటన గురించి ఫిర్యాదు చేస్తారేమో, అప్పుడు వైదొగలగక తప్పదు. ఒకవేళ నన్ను అంతా ఆదరిస్తున్నప్పుడే తప్పుకుంటానేమో. జీవితం చాలా విలువైనది. నేను నా కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. నా స్నేహితులు క్యాన్సర్‌తో పోరాడుతున్నారు. అలాంటి వారిని చూసినప్పుడు జీవితం విలువ ఏంటో అర్ధమవుతుంది. సమయాన్ని వృధా చేయకుండా నా లైఫ్‌లోని ప్రతిక్షణాన్ని ఆస్వాదించాలని అనుకుంటున్నా అని అజిత్ అన్నారు. తాను యాక్సిడెంటల్ స్టార్ అని అన్నాడు. రంగుల ప్రపంచంలో భాగం కావాలని తాను ఎప్పుడూ ఎ÷–లాన్ చేసుకోలేదని అనుకోకుండా నటు–డయ్యానంటూ అజిత్ అన్నారు. నటనపై ఎప్పుడు దృష్టి పెట్టలేదు. యాక్సిడెంటల్ స్టార్‌ని నేను. స్కూల్ చదువుల తర్వాత ఆటోమొబైల్ రంగంలో పని చేసాను??? అని అజిత్ తెలిపారు. 18 ఏళ్లు ఉన్నపుడు రేసింగ్ స్టార్ట్ చేశాను. రేసింగ్ ఖర్చుతో కూడుకున్న పని అవ్వటంతో మా అమ్మానాన్నలు ఆర్థికంగా నాకు అంతగా సపోర్ట్ చేయలేకపోయారు. అయిన నేను వెనక్కి తగ్గలేదు. ఓ రోజు నేను రేస్ ట్రాకులో ఉండగా.. మోడల్ కోఆర్డినేటర్ నా దగ్గరకు వచ్చి మోడలింగ్‌లో ఆసక్తి ఉంటే తనను కలవమని ఓ కార్డ్ ఇచ్చి వెళ్లాడు. రేసింగ్ కోసం డబ్బులు వస్తాయి కాబట్టి ఓకే చెప్పాను. మోడలింగ్‌లో వచ్చిన డబ్బుల్ని రేసింగ్ కోసం వాడేవాడిని. ఓ సారి తెలుగు సినిమా ఆడిషన్‌కు కాల్ రాగా, నాకు తెలుగు రాదు కాబట్టి నేర్చుకున్నా. మా కుటు–ంబానికి సినిమాలతో అస్సలు సంబంధం లేదు కాబట్టి వారు భయపడ్డారు. వారికి నచ్చజెప్పి సినిమాల్లోకి వెళ్లా. వ్యాపారంలో బాగా దెబ్బతినటం వల్ల నేను సినిమాల్లోకి వచ్చాను.. నా యాస కారణంగా కూడా చాలా విమర్శలు కూడా ఎదుర్కొన్నాను. పట్టు–దలతో అన్నిటిపై పట్టు– సాధించాను. సినిమాల విషయంలో ఎంతో నిజాయితీగా ఉన్నాను అంటూ అజిత్ పేర్కొన్నారు.




# హిట్ టాక్ దక్కించుకున్న రైడ్-2

ఇటీవలి కాలంలో బాలీవుడ్ చిత్రాలు పెద్దగా సక్సెస్ సాధించింది లేదు. ఖాన్ హీరోల సినిమాలకి కూడా ఆదరణ దక్కడం లేదు. దాంతో బాలీవుడ్ పని ఖతమైనట్టే అని అందరు అనుకుంటున్నారు. కాని ఇప్పుడు సీనియర్ హీరో అజయ్ దేవగణ్.. బాలీవుడ్‌కి ఊపిరి పోసాడు. ఆయన నటించిన రైడ్ 2 చిత్రం మంచి హిట్ టాక్ దక్కించుకోగా, తొలి రోజు బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లే రాబట్టింది. అజయ్ దేవగన్, రితేష్ దేశ్‌ముఖ్ నటించిన రైడ్ 2 చిత్రం మొదటి రోజు 18.25 కోట్ల వసూళ్లు సాధించింది. రైడ్ 2 మూవీ 2018లో వచ్చిన రైడ్‌కి సీక్వెల్ గా రూపొందింది. రైడ్ 2 చిత్రం ఐటీ– రైడ్స్ ప్రధానంగా తెరకెక్కగా, ఇందులో సౌరభ్ శుక్లా విలన్ పాత్ర పోషించారు. అదే సమయంలో, రైడ్ 2లో రితేష్ దేశ్‌ముఖ్ విలన్ పాత్రలో నటించారు. దర్శకుడు రాజ్‌కుమార్ గుప్తా రైడ్ 2 చిత్రాన్ని 48 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించగా, ఈ చిత్రానికి భూషణ్ కుమార్, అభిషేక్ పాఠక్, కృష్ణ కుమార్ నిర్మాతలుగా వ్యవహరించారు. వాణీ కపూర్, రజత్ కపూర్, సౌరభ్ శుక్లా, సుప్రియా పాఠక్, అమిత్ సైల్, యశ్‌పాల్ శర్మ, గోవింద్ నామ్‌దేవ్, బ్రిజేంద్ర కాలా ప్రధాన పాత్రల్లో నటించారు. తొలి రోజు ఈ చిత్రం మంచి వసూళ్లే రాబట్టగా, వారాంతంలో మరిన్ని వసూళ్లు రాబడుతుందని అంటున్నారు. రైడ్ 2 జోరు చూస్తుంటే మొదటి వారాంతంలోనే బ్రేక్ ఈవెన్ అవుతుందనే ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బాలీవుడ్ సినిమా ఇటీ–వల బాక్సాఫీసు వద్ద స్ట్రగుల్ అవుతున్న నేపథ్యంలో రైడ్ 2 చిత్రం ఊపు తెచ్చేలా కనిపిస్తుంది. రైడ్ 2 సినిమాకు ఏకపక్షంగా హిట్ టాక్ రావడంతో నార్త్ ఇండియాలో ప్రేక్షకుల సానుకూలంగా స్పందించారు. ఓవర్సీస్‌లో ఈ సినిమా 5 కోట్ల మేర వసూళ్లు సాధించవచ్చు అని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. దాంతో ఈ సినిమా తొలి రోజు 20 నుంచి 22 కోట్ల మధ్య కలెక్షన్లు రాబట్టినట్టు– అర్ధమవుతుంది.

https://epaper.velthuru.com
శనివారం 3 మే 2025

# పాలమూరుకు ద్రోహం చేస్తున్న రేవంత్

● పాలమూరు-రంగారెడ్డిపై అడ్గు ముందు పడదే

● మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్,మే2( వెలుతురు):**
పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న వైఖరిని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఒక్క అడుగు ముందుకు వేయకపోవడం మాతృద్రోహం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఏడాదిన్నర కాలంగా తట్టె-డు మన్ను కూడా ఎత్తని ప్రభుత్వం ప్రాజెక్టుపై ప్రాధాన్యం లేకుండా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్యాకేజీ 3లో కేవలం 8 కిలోమీటర్ల కాలువ మాత్రమే మిగిలి ఉండగా, దానికి సంబంధించిన కాంట్రాక్ట్‌ను ఆంధప్రదేశ్‌కు చెందిన టీ-డీపీ నేతకు అప్పగించడం అనుమానాస్పదమని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఆ కాంట్రాక్టును ప్రారంభించకపోవడానికి అక్కడి రాజకీయ నాయకుల ఒత్తిడి ఉందేమో అనిపిస్తోందని అన్నారు. ప్రాజెక్టు కోసం 27,000 ఎకరాల భూసేకరణ జరగగా, కేవలం 100 ఎకరాలు మాత్రమే మిగిలివున్నాయని తెలిపారు. ప్రజలకు పాలమూరు ప్రయోజనాలు త్వరగా అందకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పనులను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుత పరిస్థితిని సమీక్షించేందుకు నిపుణుల కమిటీ-ని ఏర్పాటు- చేయాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. డిండి పనులను హడావిడిగా ప్రారంభించడం అనవసరం. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టును నీటి పారుదల శాఖ మంత్రి ఎందుకు సమీక్షించడం లేదని నిలదీశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టాల్సిన సమయంలో, జూరాల నుంచి కొడంగల్ ఎత్తిపోతల చేపట్టడం అనేది కక్షసాధింపు చర్య అని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం జూరాలలో నీరు వదులుకోవడం వల్ల ప్రాజెక్టు డిజైన్ ప్రమాదంలో పడుతుందని, అల్మట్టిలో నీళ్లు నిలుపుకునే అవకాశం తక్కువ అని అన్నారు. ప్రాజెక్టుపై ఇప్పటివరకు రూ.32 వేల కోట్ల వ్యయం జరిగిందని, 90 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా అంగీకరించారని గుర్తు చేశారు. జరిగిన పనులకు అభినందనలు చెప్పే ముందు, మిగిలిన వాటిని పూర్తిచేసి ప్రజలకు ఫలితాలు అందించాలంటూ డిమాండ్ చేశారు. సాగునీళ్లు ఇవ్వడం లేదు, పంటలు కొనడం లేదు. రైతులకు బోనస్ ఇవ్వలేదు. రుణమాఫీ సగం కూడా కాలేదని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రూ.లక్షా 70 వేల కోట్ల అప్పులు చేసిన ఈ ప్రభుత్వం ఇప్పుడు అప్పుల గురించి మాట్లాడడం ఆక్షేపణీయమైనదని నిరంజన్ రెడ్డి వ్యాఖ్యానించారు. మూసీ ప్రాజెక్టు, హైడ్రా వంటి మంచి అవకాశాలను ధ్వంసం చేశారు. అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు అని ఆయన విమర్శలు గుప్పించారు.

## పాక్ గగనతలం మూసివేత

● ఎయిరిండియాకు భారీ నష్టాలు




**న్యూఢిల్లీ,మే2( వెలుతురు):**
పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్-భారత్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న క్రమంలో పాక్ గగనతలం మూసివేతతతో ఎయిరిండియాకు భారీగా నష్టాలు వస్తున్నాయి. పాకిస్థాన్‌పై భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. సింధు జలాలను నిలిపివేసింది. అనంతరం పాకిస్థాన్ వీసాలను రద్దు చేసింది. అంతేకాకుండా అటారీ సరిహద్దు మూసివేసింది. దీనికి బదులుగా పాకిస్థాన్ తన గగనతలాన్ని మూసివేసింది. తమ వైపు విమానాలు రాకుండా అడ్డుకుంది. అయితే దీని కారణంగా ఎయిరిండియా భారీ నష్టాలను ఎదుర్కొంది. పాక్ గగనతలం ఏడాది పాటు మూసివేతతో ఎయిరిండియా సంస్థకు రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లనుందని జాతీయవార్తా సంస్థ వెల్లడించింది. ఎయిరిండియా సహా ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు తాజాగా సూచనలు, సలహాలను పౌర వైమానిక శాఖకు తెలియజేశాయి. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించి తగిన పరిష్కారం వెతికే పనిలో ఆ శాఖ నిమగ్నమైంది. ఏడాది పాటు పాక్ గగనతలం మూసివేస్తే సుమారు 600 మిలియన్ డాలర్లు అంటే రూ.5 వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని ఎయిరిండియా పేర్కొంది. ఈ నేపథ్యంలో వైమానిక సంస్థ పలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిపెట్టాయి. ప్రస్తుతం దేశంలో ఎయిరిండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశా ఎయిర్ అంతర్జాతీయ సర్వీసులను నడుపుతున్నాయి. వైమానిక సంస్థలకు వారానికి రూ.77 కోట్ల అదనపు భారం పడొచ్చని అంచనా వేస్తున్నారు. ఇక భారత్ కూడా గత బుధవారం నుంచి పాకిస్థాన్ విమానాలకు మే 23వ తేదీ వరకు గగనతలం మూసివేసింది. ప్రస్తుతం రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

## అమరావతికి వస్తున్న ప్రధానికి స్వాగతం

● ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్




**అమరావతి,మే2( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనుల పున: ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ కి మన: పూర్వకంగా స్వాగతం పలుకుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. రాష్ట్ర ప్రజల కలల రాజధాని నిర్మాణాన్ని సాకారం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఎపిలో ప్రతి పౌరుడికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించే ప్రజా రాజధానిగా అమరావతి ఆవిష్కృతం అవుతుందని, సంపద సృష్టితో రాష్ట్రానికి ఒక చోదక శక్తిగా నిలబడుతుందని పేర్కొన్నారు. ఇందుకు సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులను పున: ప్రారంభించేందుకు రాష్ట్రానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు- డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపంగా రూపుదిద్దుకుంటున్న ప్రజా రాజధాని పునర్నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## టిటిడి వినూత్న ప్రయోగం

● ప్రజల నుంచి వాట్సాప్ ద్వారా ఫీడ్‌బ్యాక్

**తిరుమల,మే2( వెలుతురు):**
భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు టిటిడి ఓ కొత్త ఫీడ్‌బ్యాక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇకపై భక్తులు తమ అభిప్రాయాన్ని వాట్సాప్ ద్వారా సులభంగా తెలియజేయవచ్చు. తిరుమల, తిరుపతిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను మొబైల్‌తో స్కాన్ చేస్తే వాట్సాప్‌లో టిటిడి అభిప్రాయ సేకరణ పేజీ ఓపెన్ అవుతుంది. ఇక్కడ భక్తులు తమ పేరు, విభాగం (అన్నప్రసాదం, శుభ్రత, కల్యాణకట్ట, లడ్డూ ప్రసాదం, లగేజీ, దర్శన అనుభవం, క్యూలైన్, గదులు మొదలైన వాటిని ఎంచుకోవాలి. అనంతరం, అభిప్రాయం తెలిపేందుకు టెక్స్ట్ లేదా వీడియో ఫార్మాట్ ను ఎంచుకోవచ్చు. సేవా ప్రమాణాన్ని ఉత్తమం, సగటు-మరింత మెరుగుదల అవసరం, లేదా బాగాలేదుగా రేట్ చేయాల్సి ఉంటుంది. భక్తులు తమ అభిప్రాయాన్ని గరిష్టంగా 600 అక్షరాల పరిమితిలో టైప్ చేయవచ్చు లేదా వీడియోగా అప్‌లోడ్ చేయవచ్చు. అభిప్రాయం సమర్పించిన వెంటనే, మీ అభిప్రాయం విజయవంతం గా నమోదు చేయబడింది. మీ విలువైన ఫీడ్‌బ్యాక్‌కు ధన్యవాదాలు అనే ధృవీకరణ సందేశం వస్తుంది. భక్తుల నుండి అందిన అభిప్రాయాలను టిటిడి యాజమాన్యం పరిగణనలోకి తీసుకుని సేవల ప్రమాణాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటుంది.



## వివాహేతర బంధంతో భర్త హత్య

● కేసును ఛేదించిన తెనాలి పోలీసులు

**గుంటూరు,మే2( వెలుతురు):**
వివాహేతర సంబంధాలు పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతున్నాయి.. పరాయి వ్యక్తి మోజులో పడి కట్టుకున్నవారిని సైతం కాటికి పంపిస్తున్నారు.. ఈ మధ్య కాలంలో ఇలాంటి కేసులు మరీ ఎక్కువగా వెలుగుచూస్తున్నాయి.. తాజాగా, గుంటూరు జిల్లాలోనూ వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ వివాహిత ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది .. అయితే, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసుల విచారణలో సంచనల అంశాలు వెలుగు చూశాయి.. పోలీసులు వెల్లడించిన విషయాల్లోకి వెళ్తే.. గత నెల 26న తెనాలి రూరల్ మండలం మల్లెపాడులో పృథ్వీరాజ్ అనే వ్యక్తి దారుణంగా హత్య చేయబడ్డాడు.. అయితే, ఐదేళ్ల క్రితం వెంకటలక్ష్మితో పృథ్వీరాజ్ కు వివాహం జరిగింది.. వెంకటలక్ష్మికి మొదటి భర్త చనిపోవడంతో పృథ్వీరాజ్ తో రెండోపెళ్లి జరిపించారు. ఉపాధి కోసం బెంగుళూరు వెళ్లారు దంపతులు. అయితే, బెంగుళూరులో పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం వెల్లటూరుకు చెందిన కోటేశ్వరరావుతో వెంకటలక్ష్మికి పరిచయం ఏర్పడింది.. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది.. కొన్నిరోజుల తరవాత బెంగుళూరులో ఉండలేక పృథ్వీరాజ్ తెనాలి వచ్చి ఆటోనడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు.. కొన్నాళ్లపాటు- బెంగుళూరులో కోటేశ్వరరావుతోనే ఉండిపోయింది వెంకటలక్ష్మి. మద్యంతాగి కొడుతుండడంతో తిరిగి భర్త వద్దకు వచ్చింది.. అయితే, తమ బంధానికి అడ్డుగా ఉన్న భర్తను లేపేస్తే.. తమకు అడ్డుఉండదని కోటేశ్వరరావుతో కలిసి ప్లాన్ చేసింది వెంకటలక్ష్మి.. తమ ప్లాన్‌లో భాగంగా కోటేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడుతూ అన్నయ్య అంటూ భర్త పృథ్వీరాజ్‌కు పరిచయం చేసింది వెంకటలక్ష్మి.. అక్రమసంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను హత్య చేయడానికి ప్రణాళికలు వేశారు.. తెనాలి వచ్చి మద్యం తాగుదామంటూ పృథ్వీరాజ్ ను బయటకు తీసుకెళ్లిన కోటేశ్వరరావు.. ఫుల్లుగా మద్యం తాగిన తర్వాత కత్తితో పొడిచి.. రాయితో తలపై కొట్టి హత్య చేశాడు.. మొదట హత్య కేసుగా నమోదు చేసిన పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు.. ఇదే సమయంలో.. పృథ్వీరాజ్ తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. కోడలిపైనే అనుమానం ఉందని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. రంగంలోకి దిగిన పోలీసులు.. సెల్ ఫోన్ డేటా ఆధారంగా నిందితులను అరెస్టు చేశారు.. విచారణ జరపగా.. ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.. భార్య అసలు హంతకురాలని తేల్చారు.

## ప్రపంచ రాజధానుల సరసన అమరావతి

● అత్యంతత అధునాతన నగర నిర్మాణం: నారాయణ



**అమరావతి,మే2( వెలుతురు):**
ఏపీ కలల రాజధాని అమరావతిని తరతరాలు గర్వపడేలా నిర్మిస్తామని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. అమరావతి పునర్నిరమాణ సభలో ఆయన ప్రసంగించారు. పదేళ్ల క్రితం ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పురుడు పోసుకుంది. పునఃప్రారంభం కూడా ఆయన చేతుల మీదుగా జరగడం మన అదృష్టం అని అన్నారు. ప్రపంచంలోనే అగ్రభాగాన ఉన్న 5 రాజధానుల్లో ఒకటిగా అమరావతిని నిర్మించాలనే లక్ష్యంతో 2014-19లోనే రూ.40వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించాం. దాదాపు రూ.9వేల కోట్ల పనులు పూర్తి చేశాం. గత ప్రభుత్వం నిర్వాకంతో గత ఐదేళ్లలో రాజధాని పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వస్తే అమరావతిని పూర్తి చేస్తామని కూటమి తరఫున ఎన్నికల ముందు చెప్పాం. ప్రధాని ఆశీస్సులతో సీఎం చంద్రబాబు సారథ్యంలో మూడేళ్లలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ఇచ్చిన హామీ నిలబెట్టు-కుంటాం' అని మంత్రి నారాయణ అన్నారు. గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన ఒకే ఒక్క పిలుపుతో 29 గ్రామాల్లో 29,373మంది రైతులు కేవలం 58 రోజుల్లోనే ఒక్క సమస్య కూడా లేకుండా 34వేల ఎకరాల భూమిని అమరావతి కోసం త్యాగం చేయడం దేశ చరిత్రలోనే ప్రథమం. అమరావతి రైతుల త్యాగం వెలకట్టలేనిది. అమరావతి కోసం ఎన్నో త్యాగాలు చేసిన రైతులకు నా పాదాభివందనంఅని అన్నారు.

## క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు తొలి అడుగు

● చంద్రబాబుతో టెక్ దిగ్గజ సంస్థల భేటీ

**అమరావతి,మే2( వెలుతురు):**
అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు తొలి అడుగు పడింది. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో జరిగిన కార్యక్రమంలో టెక్ దిగ్గజాలు ఐబీఎమ్, టీసీఎస్, ఎల్ అండ్ టీలతో దేశంలోనే తొలి -టెక్‌పార్క్‌కు ఏపీ సర్కార్ ఎంవోయూ కుదుర్చుకుంది. 2026 జనవరి 1న తొలి క్వాంటం వ్యాలీ టెక్‌పార్క్ ప్రారంభంకానుంది. క్వాంటం కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఐబీఎమ్, టీసీఎస్, ఎల్ అండ్ టీలతో ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. క్వాంటం పరిశోధన, ఆవిష్కరణలతో పాటు- ఏపీని ప్రపంచ హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సర్కార్ ముందు సాగుతోంది. అమరావతిలో భారతదేశపు మొట్టమొదటి, అత్యాధునిక క్వాంటం వ్యాలీ టెక్ పార్క్ నిర్మాణం కానుంది. దేశంలోనే తొలిసారి ఐబీఎం అతిపెద్ద క్వాంటమ్ కంప్యూటర్ 156 క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్ కలిగిన 'క్వాంటం సిస్టం 2'ని అమరావతిలో నెలకొల్పనుంది.




## పాక్ ప్రధాని యూట్యూబ్‌పైనా వేటు

● ప్రసారాలు నిలిపివేసిన భారత ప్రభుత్వం

**న్యూఢిల్లీ,మే2( వెలుతురు):**
పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న వేళ అనేక చర్యలు తీసుకుంటున్న భారత్ పలు పాక్ యూట్యూబ్ ఛానళ్లను నిషేదించింది.. ఆ ఘటన తర్వాత భారత ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ యూట్యూబ్ ఛానల్ స్ట్రీమింగ్‌ను మనదేశంలో నిలిపివేసింది. జాతీయ భద్రతకు సంబంధించి భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కంటెంట్ ప్రస్తుతం ఈ దేశంలో అందుబాటులో లేదని ఆ ఛానల్ క్లిక్ చేసిన వారికి ఒక సందేశం దర్శనమిస్తోంది. ఉద్రిక్తతలు భగ్గుమంటోన్న వేళ.. పాకిస్థాన్ కేంద్రంగా నిర్వహిస్తున్న పలు యూట్యూబ్ ఛానళ్ల ప్రసారాలు, సామాజిక మాధ్యమ ఖాతాలను భారత్‌లో నిలిపివేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పాక్ న్యూస్, ఎంటర్టైన్‌మెంట్ మీడియాకు చెందిన పలు ఛానళ్లపై వేటు పడింది. పాక్ మాజీ ఆటగాళ్లు షోయబ్ అక్తర్, బాసిత్ అలీ, షాహిద్ అఫ్రిది ఛానళ్లు కూడా అందులో ఉన్నాయి. ఆ దేశ రక్షణ మంత్రి ఎక్స్ ఖాతాను బ్లాక్ చేసింది. పాకిస్థాన్ క్రికెటర్స్ బాబర్ అజామ్, మహ్మద్ రిజ్వాన్, షహీన్ అఫ్రిదీ ఇన్‌స్టా ఖాతాలను తాజాగా సస్పెండ్ అయ్యాయి. పాకిస్థాన్ జావెలియన్ త్రోయర్, ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ఇప్పటికే బ్లాక్ చేసిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత చట్టపరమైన చర్యల్లో భాగంగా భారత్‌లో అతని ఖాతాను నిలిపివేశారు. భారత్‌లో నదీమ్ ఖాతా అందుబాటులో లేదు. ఖాతాలోని సమాచారాన్ని నియంత్రించాలన్న చట్టపరమైన అభ్యర్థనను పాటిస్తున్నామని భారత్‌లో నదీమ్ ఇన్‌స్టా ఖాతా తెరిచిన వాళ్లకు ఈ సందేశం కనిపిస్తోంది.



## అమరావతి వేదికపై ఆసక్తికర సన్నివేశం

● పవన్‌కు చాక్లెట్ ఇచ్చి ఆశ్చర్య పరచిన మోడీ




**అమరావతి,మే2( వెలుతురు):**
అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ వేడుక అమరావతిలో పెద్దెతున్న జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ హాజరయ్యారు. అమరావతిలో ఏర్పాటు చేసిన సభలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కి ప్రధాని మోడీల మధ్య ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఏర్పాటు చేసిన సభా వేదికపై ముఖ్య నేతలందరూ కూర్చొని ఉండగా..పవన్ ప్రసంగించారు. అనంతరం ప్రధాని మోడీ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను దగ్గరకు పిలిచారు. దానితో ప్రధాని మోడీ ఎందుకు పిలిచారో తెలియని పవన్ కళ్యాణ్ హడావిడిగా ఆయన దెగ్గరికి వచ్చారు. ఆ తర్వాత ప్రధాని తన వద్ద ఉన్న చాక్లెట్ ను పవన్ కు ఇవ్వడంతో వేదికపై ఉన్న వారితో పాటు, సభ ప్రాంగణంలో ఉన్న వారి మధ్య నవ్వులు విరబూశాయి. మొదట మోడీ చాక్లెట్ ఇచ్చిన తర్వాత.. మొదట ప్రధాని, సీఎం చంద్రబాబు నవ్వారు. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ కూడా చేతిలో ఉన్న చాక్లెట్ ను చూసి వారితో కలిసి ఆయన కూడా నవ్వేశారు. ఆ తర్వాత మోడీకి రెండు చేతులతో నమస్కరించి నవ్వుతూ తన కుర్చీలో కూర్చున్నాడు పవన్ కళ్యాణ్. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com